# సహజ మార్గదర్శనము

## (Sahaj Marg Philosophy)



రచయిత :

**శ్రీ రామచంద్రజీ**



**శ్రీ రామచంద్ర మిషన్**

షాజహాన్‌పూర్.



**మహాత్మా శ్రీ రామచంద్రజీ**

శ్రీ రామచంద్ర మిషన్, షాజహాన్ పూర్. (యు.పి.)

# విషయసూచిక


**ప్రథమ అధ్యాయము** : పరిచయము
తాత్త్వికభావన
సహజమార్గ చరిత్ర
సహజమార్గము యొక్క ప్రత్యేక లక్షణములు

**ద్వితీయ అధ్యాయము** : సత్యము – దానిచేతన – అచేతన
స్వరూపములు
అంతిమ సత్యము
స్వత్వము (ఐడెంటిటి)
విశ్వశాస్త్రము
ఆకాశము – కాలము
జీవుడు – బ్రహ్మము
ప్రకృతియందలి సమానాంతరత
అవతారములు

**తృతీయ అధ్యాయము** : జ్ఞానము దాని స్వభావము
ఉపాయములు : తర్కము – శ్రుతి – అనుభవము

**చతుర్ధ అధ్యాయము** : మానవుడు
విశ్వమందు మానవుని స్థానము మరియు విధి
మానవత్వమునకు దివ్యత్వమునకు మధ్యనున్న సమానంతర నిర్మూలనము
సాక్షాత్కారము మరియు దాని ఉపాయములు
గృహస్థాశ్రమము

**పంచమ అధ్యాయము** : సాక్షాత్కార మార్గము – సాధకుని పాత్ర
వైరాగ్యము
ధ్యానము
ధ్యానమునకు పూర్వరంగము
ప్రార్థన
నిరంతరస్మరణ
భక్తి
శరణాగతి

**ఆరవ అధ్యాయము** : సాక్షాత్కార మార్గము – మార్గదర్శకుని పాత్ర
గురువు ఆయన నిర్వహించు కార్యము
ప్రాణాహుతి

**సప్తమ అధ్యాయము** : సాక్షాత్కార మార్గమందలి దశలు

# సహజమార్గ దర్శనము

## ప్రథమ అధ్యాయము

## పరిచయము

---

**తాత్విక భావన :**

తత్వము వివేచనపైన గాక అంతర్‌దృష్టిపై ఆధారపడినది. చాలామంది పాశ్చాత్య తాత్వికులు అభిప్రాయపడినట్లు తత్వము సంశయమునుండి గాక అద్భుతమునుండి ప్రారంభమైనది. పాశ్చాత్యతాత్వికుల వలెనే సాధారణముగా తత్వవేత్తలు ఆచరణతో కూడిన జీవితమును నెరపకయే విషయములను వివరింప ప్రయత్నించిరి. తాత్వికుడు తాత్వికుడైనంత మాత్రమున నైతికముగ పతనమగుటకుగాని, దిగజారుటకు గాని వీలులేదని చెప్పుటకు అవకాశము లేదు. కాని ఆచరణతో కూడిన జీవితమును గడపి విషయములను సరిగా అవగాహన చేసుకున్నయెడల పతనమునకు అవకావములేదు. తొలుత ఆచరిత జీవితములోనికి వెళ్లిన పిమ్మటనే సాధారణముగా హిందూదేశమున జ్ఞానులు తత్వమును వివరింప ప్రయత్నించిరి. వారు తమకు వీలగునంతలో తమతమస్థాయికే అనుగుణ్యముగా విషయరహస్యములను వెలిబుచ్చిరి. తత్ఫలితముగా వివిధ రీతులలో "షడ్ దర్శనములు" వెలసినవి. మన మెల్లప్పుడును అభ్యాసము పూర్తి అయినపుడే విషయములను వ్యక్తీకరించుటకు ప్రయత్నించవలెను. విషయములను సరిగా గ్రహించుటకు తాత్వికుడు గుర్తించవలసిన కీలకమిదియే.

భారతదేశము అధ్యాత్మికతకు జన్మభూమి. కావుననే ఇచట అన్నికాలములందును సత్యాన్వేషణము ఉత్సాహవంతముగ కొనసాగుచుండెడిది. ఆధ్యాత్మికత అనగా ఆదిమ కేంద్రమునుండి ప్రవహించెడు శక్తి గ్రంథుల రూపములో సృష్టి లయ కార్యములను నిర్వహించు సామర్థ్యము కలదానికి సంబంధించిన శాస్త్రము. భారతదేశమున ఋషులు సృష్టి కార్యము నెరపు శక్తిని మానవజాతి సంస్కరణకు వినియోగించిరి. దాని అధికమగు విధ్వంసక శక్తితో పోల్చిన అణ్వాయుధ శక్తికూడ తృణప్రాయమే అగును. యోగి వీనిని భగవదావేశమునకు అనుగుణముగా, తన సంకల్ప శక్త్యానుసారముగా ఉపయోగించును. వర్తమానమందును ఈ శక్తి ఉపయోగించబడుచున్నది. ఒక నూతన ప్రపంచము సృష్టింపబడుచున్నది. ఎంతకాలము పట్టినను ఆధ్యాత్మిక పునరుజ్జీవనము జరిగితీరి, భారతదేశము మరల ప్రపంచమును నడిపించును. ఆధ్యాత్మికతలేనిదే ఏ దేశము కూడ మనుగడ సాగించుట అసాధ్యమని ఇతర దేశములు గ్రహింపమొదలిడినవి. రాజకీయ చతురత, కపటోపాయములతో కూడిన యుగమిపుడు అతిశీఘ్రముగా గడిచిపోవుచున్నది. ఈ శతాబ్దము ముగియులోపుననే మహత్తరమైన మార్పు జరిగితీరును. ప్రతివారును తనకు శ్రేయస్సునొసగు ఆధ్యాత్మికమార్గము చేరి విధిగా సంభవించబోవు పరిణామములను సంతసముతో ఆహ్వానించవలెను. నేనిచట ఒక మహత్తర తత్వమును బహిర్గతము చేయుచున్నాను. ప్రజలు దానిని ప్రారంభమున గ్రహించినను, గ్రహించకున్నను కాలక్రమమున వారు అది వాస్తవమేనని తప్పక గ్రహింపమొదలిడెదరు.

## సహజమార్గ చరిత్ర :

మహాత్ములు యాదృచ్ఛికముగా జన్మింపరు. ప్రపంచము ఆతురతతో నిరీక్షించుచున్నపుడే వారు అవతరింతురు. అది ప్రకృతిధర్మము. ఆధ్యాత్మికతకు నిలయమైన భారతదేశము అనాది సిద్ధమైన తన యోగవిధానమును పూర్తిగ మరచి అంధకారమున తడవులాడుచున్నది. సూక్ష్మమగు ఆధ్యాత్మికతను, స్థూలమగు భౌతికత ఆక్రమించినది. అజ్ఞానమును కారు మేఘములు ఎల్లెడల అలముకొన్నవి. యోగజనిత ప్రాణాహుతి హిందువులకు పూర్తిగ అన్యమైపోయినది. ఆధ్యాత్మికత ఇట్టి స్థితియందు నిస్సహాయముగ ఊగిసలాడుచున్న తరుణమున, పరిస్థితులను చక్కబరచి మానవాభ్యుదయమును సాధించుటకు ఒక మాహాత్ముడు అత్యంత ఆవశ్యకమయ్యెను.

1873వ సంవత్సరము ఫిబ్రవరి 2వతేదీ వసంతపంచమి శుభదినమున ఉత్తరప్రదేశ్ నందలి ఫరూకాబాద్ జిల్లాలోని ఫతేఘర్ అను గ్రామమున ప్రకృతిశక్తి మానవరూపమున శ్రీ రామచంద్రజీ మహరాజ్ రూపమున భూమిపై అవతరించినది. అట్టి ఈ శుభదినము సంవత్సరమునందు ఆహ్లాదకరమైన ఋతువుతో సమన్వయమై ప్రతి హృదయమును వికసించు నవవసంతశోభతో నుజ్జీవింపజేసినది. నీతి అవతరణము మానవ జీవితసమస్యకు ఆచరణాత్మకమైన పరిష్కారమును నిశ్చయముగ సూచించు మిక్కిలి ఆనందకరమగు సమయమును ప్రవేశపెట్టినది. ఆధ్యాత్మికరంగమున వారిచే తీసుకొని రాబడిన అమోఘ పునరుజ్జీవమును తలపునకు తెచ్చుకొనునపుడు మనము భక్తిపూర్వక గంభీరానందముతో తన్మయత్వము చెందుదుము. జ్ఞానులలో మహోన్నతస్థితి పొందినవారికి కూడ దురవగాహమైన జీవితసమస్యకు సులభ పరిష్కారమార్గమును ఆయన సూచించెను.

ఈ దివ్యపురుషుడు గౌరవనీయమగు కాయస్థవంశము నందు జన్మించెను. వీరి బాల్యము ఉన్నతస్వభాము, నిరాడంబరత కల్గి ఎక్కువ సమయము భక్తి, ఆరాధనలయందు గడపిన మాతృమూర్తిచే ప్రభావితమైనది. ఆమె ప్రభావము వలన పిన్నవయస్సుననే దైవప్రేరితులయ్యెను. వీరు తమ సహచరులతో ఆటలాడుకొను సమయమున, ఒకనాడు ఏదో దివ్యశక్తి, తాను నిమగ్నుడైయున్న ఆ కార్యముకొరకు జన్మింపలేదను భావమును రేకెత్తించిన సంఘటన జరిగెను. తన భావిమహత్కార్యమును నిర్వహించుటకు సాక్షాత్కారము పొందుటకు కార్యనిర్వహణకు పూనుకొనిరి. ఆయన ఆత్మ జాగృతమైనది. ఆయన కృషి ప్రారంభించినారు. ఏడు మాసములలోనే పరిపూర్ణతను పొందిరి. ఇది సాటిలేని దృష్టాంతము. నాటినుండి వారు తమ యావజ్జీవితమును ఆధ్యాత్మికతకే వినియోగించిరి. మన సంస్థకు వారే ఆది గురువులు.

వారే మూర్తీభవించిన మితస్వభావము, సహనము, భక్తి, ప్రాణాహుతి ద్వారా యోగవిద్య శిక్షణనొసగుట అను నూతన సాధనాశకము ఆయనతోనే ప్రారంభమైనది. దానికి ఆయనయే గురువు. మానవుడు గృహస్థాశ్రమ మందుండియే ఒక జీవితకాలమందే ఆధ్యాత్మిక సాధనయందు పరిపూర్ణతను సాధించుటకు సులభమార్గము చూపిరి. గృహస్థ జీవితమందలి కష్టములు, బాధలు, ఆధ్యాత్మిక సంపదకు కావలసిన తపస్సులు, త్యాగములు, అని వారు చెప్పెడివారు. ఆధ్యాత్మికత నొందుటకు పరిస్థితులకు అనుగుణముగ సవరించి చాలావరకు సులభము గావించిరి. గొప్ప సామర్థ్యముతోనూ, ఆధ్యాత్మిక ఉన్నతితోనూ దివ్యజ్యోతి సాదృశుడగు మన సమర్థగురువు తన జీవితమందలి ప్రతిక్షణమును మానవాళి అభ్యుదయము కొరకే వినియోగించిరి. నిజమునకు ఆయన

ప్రకృతియొక్క అద్భుత సామర్థ్యములుగల వ్యక్తి. ఆధ్యాత్మికరంగమున వారి కృషి సామాన్య ఊహకు అతీతమైనది. ఈ శాస్త్రమునందు వారి అద్భుత పరిశోధనలు సాధ్యమైనంత తక్కువకాలము నందు మానవుడు చేరుకొనగల స్థితి సుసాధ్యము, మరియు సాదన యోగ్యము చేసినవి. ఈనాడు "సహజమార్గము" అని పిలువబడునది వీరు మెరుగులుదిద్ది ప్రవేశపెట్టిన రాజయోగమే. ఈ ఆధ్యాత్మిక ప్రతిభాశాలి ముప్పదియారేండ్లపాటు మానవాళికి సేవగావించి తమ 58వ ఏట 14-8-1931వ తేదీన భౌతిక రూపమును వీడిరి. వీరి జీవితకాలములో వీరుచేసిన కృషి ఊహాతీతము. తరువాత తరములవారు కాలక్రమేణా వీరి ప్రతిభావిశేషములను తెలిసికొందురు.

ఆ మహాపురుషుని అనుగ్రహము వలన ఆయనను ప్రతినిధినైన నాచేత 1945 మార్చి 31వ తేదీన షాజహాన్‌పూర్‌లో వారిపేరున శ్రీ రామచంద్రమిషన్ స్థాపించబడినది. ఆ సంస్థ ఎల్ల ప్రదేశములనుండియు సత్యాన్వేషకులను ఆకర్షించుచున్నది. గురుదేవుని అనుగ్రహమీరీతిగా పనిచేయుటచే వారి కృపవలన కల్గు ప్రయోజనములను పొందుటకనేకులు ఆకర్షింపబడుట నాకు సంతోషకరము.

ఈ సంస్థయందిపుడు అనుసరింపబడుచున్న సహజమార్గ సాధనావిధానము అంతిమస్థితిని పొందుటకు సులభము, సహజము, అయిన మార్గమును ప్రసాదించుచున్నది. సహజమార్గము నిత్యజీవితమునందు ఆచరణయోగ్యముకాని అపరిష్కృత విధానములను బోధింపదు. తొలుత మానవరూపమును దరించినపుడు ఇంద్రియములు ఎట్టిస్థితిలో నుండెనో అట్టి ఆదిమ స్థితికి సహజమార్గ విధానమున ఆధ్యాత్మిక శిక్షణ, వాని క్రియలను సహజముగా క్రమపద్ధతికి తెచ్చును. అంతియేకాదు స్వతంత్రముగ జనించు అధోవృత్తులు, అధిచైతన్యము యొక్క ఆధీనమునకు లోబడియుండును. అందువలననే వాటి విపరీత ప్రవర్తన ఆపబడినది. ఉన్నత కేంద్రములు, దివ్యకేంద్రముల అధీనములోనికి వచ్చును. ఈ విధముగా శరీరమంతయు దివ్యత్వము పొందనారంభించును.

## సహజమార్గము యొక్క విశిష్టలక్షణములు :

శంకర, రామానుజాదులు వారి అనుభవములతో చెప్పినది ఏమైయుండినను నేను చెప్పునది, వ్రాయునది, స్వానుభవముపైనే ఆధారపడినది. ప్రపంచము నందెల్లరును శాంతిని కోరుదురు. వారి లక్ష్యము సాక్షాత్కారముకాదని దాని అర్థము. అట్టివారికి శాంతిమాత్రమే లభించునుగాని సాక్షాత్కారముకాదు. అయితే సాక్షాత్కారమే లక్ష్యమగుచో శాంతి దానంతట అదియే లభించును. సాక్షాత్కారమననేమియో తెలిసికొని సంతృప్తి నొందక దానిని పొందుటకు సైతము యత్నించవలెను.

సామాన్యముగా ప్రజలు ముక్తిని సాధించుటకు కష్టమనియే అంతియేకాకుండ ఈ జన్మమందే సాధించుట దుస్సాధ్యమనియు తలచెదరు. కాని ఇది పొరపాటైన భావము. ముక్తికి కొనిపోవు కడపటి జన్మ ఇదియే కావచ్చునేమో? అది ఎవరికి తెలియును? నిజమగు మార్గదర్శిని పొంది శ్రద్ధగా కృషిచేయు సాధకుడు ఒకేజన్మలో (జీవితకాలములో) ఇంకనూ తక్కువ కాలములోకూడ ఆ స్థితిని చేరుకొనగలడని మన గురుదేవులు చాటిచెప్పిరి. దీనిని ఆయన ఋజువుచేసిరి కూడ. కాని ఆ నిరూపణ మాటలలో చెప్పనశక్యము. మన అనుభవము మాత్రమే దానిని తెలుపగలదు.

భగవంతుడు కేవలము అరణ్యవాసియగునట్లు అడవుల మధ్యముననే ఆయనను అన్వేషింపవలెనను ప్రజావిశ్వాసము వ్యర్థము, అర్థరహితము. భగవంతుని ఎవరి హృదయాంతరమున వారే అన్వేషించగలరని నా విశ్వాసము. కాని అందులకు దృఢసంకల్పముతో కృషిచేయు 'స్పార్తాను"ల మనస్తత్వము ఆవశ్యకము.

ఇంటినుండి పారిపోయి, ప్రాపంచిక బాధ్యతలను పూర్తిగ విస్మరించి నిర్దిష్టలక్ష్యము, లేక ఉద్దేశ్యము లేనివాడై సంచరించుట ఏమాత్రము సమంజసముకాదు. అట్టివాడు నిజమునకు ఆ వైరాగ్యస్థితి యందుండియు ప్రాపంచిక భావములను వదలియుండుట అరుదు. సహజమార్గ సాధకుడు ప్రాపంచిక వ్యవహారము, ఆధ్యాత్మికతయను రెండు పక్షములను సమానముగ అభివృద్ధిపరచి ప్రకాశింప జేసుఒకనవలయును. జీవితకర్తవ్య బాధ్యతలను గుర్తెరిగి ఐహిక జీవితముతో ఆధ్యాత్మిక సాధనను సంయుక్తముగ కొనసాగించుటయే ఈ సాధనయందత్యంత ప్రధాన లక్షణము. ఈ భావములను కేవలము బోధించుట, లేక ప్రచారము చేయుట మాత్రమేకాదు. అంతేగాక వాటిని ఆచరణలో పెట్టి నిత్యజీవితమందు అనుసరించుటయే మా లక్ష్యము.

అజ్ఞానాంధకారముననున్న ప్రజానీకమును ఆధ్యాత్మిక చింతనవైపునకు మేల్కొలిపి వారిని ప్రగతి మార్గమునకు మరల్చుటకు మన సమర్థగురుదేవులు సహజమార్గ పద్ధతిని నూతనముగా ప్రవేశపెట్టిరి. వారి సిద్ధాంతమును మనము సహజమార్గ విధానముద్వారా ప్రకటించుట మనసంస్థ ఉద్దేశ్యము. ఇందుకు నేటి జీవన విధానమునకు ఏమాత్రము సరిపడనివియు, యాంత్రికమైనవియు బలవంతముగ విధింపబడు కఠిన తపశ్చర్యల వంటి వానిని విసర్జించి వాటికి మారుగా సులభములు, సహజములైన పద్ధతులను అనుసరింపవలెను.

మోక్షసాధనకు, లేక, పరిపూర్ణ స్వేచ్ఛ (బంధవిముక్తి)కు సంబంధించినంతవరకు ఎందరో పూర్వకాలము మహర్షులును, ఈకాలమువారును "రాజయోగము" మాత్రమే మానవునికి తుది లక్ష్యమును, చేరుటకు వీలు గల్పింపగలదన్న యంశమును అంగీకరింతురు. పూర్ణస్వేచ్ఛ అనగా సాక్షాత్కారమును పొందగోరెడు ప్రతివారును ముందువెనుకలలో రాజయోగమునకు తప్పకరావలసినదే. అనవసరమైన వాటిని త్రోసిపుచ్చి, కొన్ని మార్పులు సవరణలు చేయబడిన రాజయోగపద్ధతికి సహజమార్గము అత్యంత సన్నిహితము.

గురుసహాయము సహజమార్గ సాధనయొక్క విశిష్ట లక్షణము. ప్రాణాహుతిద్వారా తన యోగశక్తిని సాధకునియందు ప్రవేశింపజేసి అతనిని పురోగమింపజేయగల సమర్థుడైన గురువు నెన్నుకొనుట సాధకుని గురుతరబాధ్యత. గురువు తనయందలి అంతఃశక్తులను వినియోగించి ప్రాణాహుతి ప్రక్రియ ద్వారా, ఆ దివ్యశక్తిని అభ్యాసి హృదయమున ప్రవేశపెట్టి అతనియందు నిద్రాణమైయున్న శక్తులను మేల్కొలిపి, త్వరితపరచును. తత్ఫలితముగా సాధకుడు ఆధ్యాత్మికముగ పురోగమించ మొదలిడి అంతకంతకు ఎక్కువ ఆనందమును అనుభవించుచుండును. సాధకుడు ఆ దివ్యశక్తిని స్వీకరించుటకు సిద్ధముగా నుండవలెను. మరియొక విధముగ చెప్పవలెనన్న సాధకుడందులకు సామర్థ్యము, అర్హతలను, పొందవలెను. ఈ విధముగా ఏది నిరంతర శ్రమతో కూడినదై పూర్వము మిగుల కష్టముగా నుండినదో దానిని ఇప్పుడు అతిసులభముగను, సాధ్యమైనంత తక్కువకాలము నందును పొందవీలగును. అయితే దానిని అభ్యసించవలసినదేగాని, ఏవిధముగను మాటలలో చెప్పవీలుకాదు. అనుభవము మాత్రమే యిందలి గుణ విశేషములను తెలుపగలదు.

అనేకులు ప్రశాంతస్థితిని చవిజూచియుందురు. నిజమైన శాంతియొక్క యదార్థస్థితి అవగాహనాతీతము. ఇందు వైరుధ్యములకు తావులేదు. ఇది ఖచ్చితముగ శాంతియుగాదు, అశాంతియుగాదు. కలయికగాదు, ఎడబాటుగాదు. మీరందరును అట్టి ఆవేదనను చవిచూచెదరుగావుత, అయిననూ దానిని అలవరచుకొనుట కష్టముగాదు. అందులకు కావలసినదంతయూ దృఢసంకల్పము, తదేకదీక్ష మాత్రమే. అపుడు మీరు అన్వేషించునదే మీకు అత్యంత సన్నిహితమని లేదా మీలోనేయున్నదని తెలుసుకొందురు. అంతేకాదు మీరు దేనిని అన్వేషించుచున్నారో అది మీరే అగుదురు. అందుకొరకు మార్గమునగల కంటకములను నిర్మూలన చేయగల్గు తీవ్రతపన మన హృదయములో ఉండవలెను.

పూర్వాచార గురుశిష్య సాంప్రదాయమును, ప్రతిపాదించుట ఏవిధముగను నా ఉద్దేశ్యముకాదు. మన సంస్థయందు ఒకరికొకరు అవసరమైనపుడు సహాయము చేసుకొనుచు సేవా త్యాగములతో గూడిన సోదరభావముతో దీనిని తీసికొందుము. సహజమార్గ ఆధ్యాత్మిక శిక్షణా విధానమున కుల, మత, స్త్రీ, పురుష వర్ణబేధములు లేక ప్రతివారికిని ప్రవేశమున్నది. భారతీయతాత్విక సాంప్రదాయమున నూతనాధ్యాయమును ప్రారంభించిన మా గురుదేవుని అనుగ్రహమువలన సత్యాన్వేషకులు సాధనానుభవములను పొంది అపారలాభము పడయగలరు. అంతిమ లక్ష్యమును సాక్షాత్కరింప జేసుకొనుటకు ఈ సాధనయందు దయామయుడైన మా గురుదేవుని పర్యవేక్షణయే మనకు మార్గదర్శియై మన జీవిత లక్ష్యము సిద్ధింపజేయగావుత.

## ద్వితీయ అధ్యాయము

# సత్పదార్థము - దానియొక్క చేతన - అచేతన స్వరూపములు, అంతిమ సత్యము

---

అంతిమ సత్యమగు భగవంతుని అస్తిత్వముపై గొప్ప వాదప్రతివాదములు ఉంటూ ఉండినవి. పరమార్థము యొక్క అస్తిత్వము ఋజువుచేయుటో, నిరాకరించుటో గాక, ఉచితమైన సంతృప్తికరమైన రీతిని దానిని నిర్వచించుటే, నా ప్రథమ సమస్య. వ్యక్తిగత దుఃఖములు, కోరికలచే సృష్టించబడి, బలపరుపబడిన ఉత్సాహ పూరితమైన అంధవిశ్వాసము వివిధ సాంస్కృతిక సందర్భములలో అనేకానేక గందరగోళములను సృష్టించెను. తత్ఫలితముగ వివేచనాపరునకు భగవంతుని పేరెత్తినచో విసుగు జనించుట సమంజసమే.

అంతిమ సత్యమును గూర్చి పలువిధములైన అభిప్రాయములు గలవు. తమ గ్రహణశక్తి, సామర్థ్యములకు అనుగుణ్యముగా, దానిని పలువిధముల భావింతురు. భగవంతుడు శాశ్వతశక్తి అనునది సర్వసామాన్యముగ అంగీకరింపబడిన భావము. అయితే అనేకత్వము, భిన్నత్వములకు అతీతమైన నిర్గుణబ్రహ్మ భావన తాత్వికదృష్టి యందున్నది. ఇది గుణ, క్రియచైతన్యములకు అతీతమైనది. ఈ నిర్గుణ బ్రహ్మమే సకలజగత్తునకు మూలకారణమనియు, పరమచైతన్యవంతమైన కేంద్రమనియు తెలియనగును. దీనినే పరబ్రహ్మమనికూడా తెలియనగును. అటుపై భగవంతుడు సర్వోత్కృష్టసత్తయను అభిప్రాయము కల్గును. అనేక భిన్నరూపములతోను, వ్యత్యాసములతోను కూడిన ఈ జగత్తును చూచి దీని సృష్టికర్త, పరిపాలకుడు కలడని మనము నమ్ముచున్నాము. మనము ఆయనను ఈశ్వరుడు, సగుణ బ్రహ్మమని పిలుతుము. సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు, సమస్త ఉత్తమ లక్షణ సంపన్నుడు అయిన శాశ్వతుడని మనము ఆయనను భావింతుము. ఆయనయే ఈ విశ్వమునకు నైమిత్తిక కారణము, మరియు స్థితిలయకర్త కూడ.

మనము సామాన్య దృక్పథమునుండి చూచునప్పుడు మాత్రమే భగవంతుడు (మతధర్మ ప్రకారము దైవము) ఆరాధ్యవస్తువుగ గోచరించును. అదియే మతములన్నిటికిని తుది ధ్యేయము. ఈ సగుణ బ్రహ్మమే అపర బ్రహ్మమని కూడ తెలియబడుచున్నది. మతగ్రంథములందు పైన పేర్కొనబడిన రెండు అభిప్రాయములగూర్చి చాలా చెప్పబడినది. కొందరు నిర్గుణ బ్రహ్మభావన, సగుణ బ్రహ్మభావనకంటే శ్రేష్ఠమైనదని తలచిరి. ఇతరులు దీనికి సరిగా వ్యతిరేక అభిప్రాయము వ్యక్తిపరచిరి. యదార్థమునకు ఈ ఇద్దరును పొరబడుచున్నవారే. వారు నిర్గుణబ్రహ్మను గాని, సగుణ ఈశ్వరుని గాని, పొందజాలరు. నిస్సందేహముగా అవి రెండు మార్గములు. కాని వాటి లక్ష్యము ఒక్కటే. అదియే అంతిమస్థితి లేక పరమార్థ సాక్షాత్కారము. సాధారణముగ అర్థము చేసికొనబడిన ఈ రెండు అభిప్రాయములు ఎక్కువగా పెడత్రోవను పట్టించుచున్నవి. యదార్థమునకు భగవంతుడు సగుణుడుకాడు, నిర్గుణుడుకాడు. ఈ రెంటికి అతీతుడు. ఆయన ఆయనయే. ఆయనను నిర్గుణుడుగా ఊహించినది మనమే. ఆయనను సగుణునిగా చేసినది మనమే. కావున ఈ వివాదములను రేకెత్తకుండా చేయుటకు మన

దృష్టిని ఆదితత్త్వముపై నిలుపవలెను. అది సగుణమైనప్పటికినీ, నిర్గుణమైనప్పటికినీ ఏమైననుసరే దానినే మనము తప్పక ప్రేమింపవలెను.

ఎంతకాలము మనము మతపరిమితులలో కట్టుబడియుందుమో అంతవరకూ మతసంబంధమగు దైవమే మన దృష్టియందుండును. అంతవరకును మనము ఏదో ఒక (సాకార, నిరాకార) భావముతో చిక్కుపడి యుందుము. మతపరిదులను అతిక్రమించినప్పుడే అత్యున్నత ఆధ్యాత్మిక స్థితులను పొందుట సాధ్యము. వాస్తవముగ మతమెక్కడ అంతమగునో అక్కడ ఆధ్యాత్మికత మొదలగును. మతమనునది సంపూర్ణ ముక్తిమార్గమున పయనించుటకు సాధకుని సిద్ధపరచు ప్రారంభదశ మాత్రమే. మతముయొక్క అంత్యమే ఆధ్యాత్మికతోదయము. ఆధ్యాత్మికతయొక్క అంత్యమే సత్యోదయము. సత్యము యొక్క అంత్యమే వాస్తవ ఆనందము. అదియును గడచిన పిదప మనము గమ్యస్థానమును చేరుదుము. మాటలకలవికాని మహోన్నతస్థితి అదియే.

ఈవిధముగా ఏదేని ఒక ప్రత్యేకమతము లేక తెగల పరిధియందు మనము భగవంతుని కానలేము. ఆయన ఏదేని రూపములందుగాని వైదికకర్మలయందు గాని కట్టుబడియుండడు. మతగ్రంథములందుకూడ కనుగొనబడడు. ఆయనను మనము మన హృదయాంతరాళమందే అన్వేషింపవలయును. నిజమునకు భగవంతుడు సరళ నిరాడంబర స్వరూపుడు. ఆయన స్థూలరూపములయందు లేడు. ఏవిధమైన స్థౌల్యమును ఆయన యందు లేదు. భగవంతుడు సరళుడు, అత్యంత సూక్ష్మమయినవాడు. వాస్తవమునకు ఈ అంతిమస్థితి యొక్క సరళత్వము, పవిత్రతయే దానిని మరుగుపరచు తెరగా రూపొందినది.

దైవము, లేక అంతిమ సత్యముయొక్క భావమును గ్రహించుటకు దేవుడు లేడు అను నాస్తికుని అభిప్రాయముతో ప్రారంభింతుము. గణితశాస్త్ర పరిభాషలో దానికి, ధన, ఋణ విలువలనిచ్చుటకు వీలుండదు. ధన, ఋణ విలువలులేని దానికి గణితశాస్త్రమున "శూన్యము" లేక "సున్న" అని పేరు.

ఇప్పుడు "ఏది ఉన్నది" అను ప్రశ్నను నాస్తికుని ఎదుట పెట్టెదము. ఖచ్చితమైన నాస్తికుడు ప్రతివస్తువుయొక్క అస్తిత్వమును శంకించి నిరాకరింపగలడు. కాని తన ఉనికిని మాత్రము నిరాకరింపజాలడు. గణితపరిధిలో మరల చెప్పవలెనన్న దీనిని అనుకూలముగా "ఒకటి" అని చెప్పవచ్చును.

"సున్న" యొక్క విచిత్ర చర్యను గమనింపుము. ఉన్నది అను "ఒకటి"కి కుడిప్రక్కలేదు అను "సున్నను" చేర్చుచుపోవుచో ఆ ఉన్నది (ఒకటి) తనకుతానే పెరుగుచు ఎన్నో రెట్లగును. ఈ విస్తరణకు గుర్తింపగల పరిమితమే లేదు. అంతమేలేని ఈ విస్తరణను ఉపనిషత్తులు మిక్కిలి గొప్పదానికంటెను గొప్పది (మహతోమహీయాన్) అని పేర్కొనినవి. ఇప్పుడీ "సున్న"ను "ఒకటి"కి ఎడమవైపు లేక ఋణస్థానమువైపు, నిషేధాత్మక సంకల్పము అయిన దశాంత బిందువును ఉంచిన మరిమరి సున్నలు చేర్చుటవలన విలువ తగ్గును. "ఒకటి"ని "సున్న"కు మరి మరి సమీపస్థితికి తీసుకొనివచ్చును. మరల "తాను" అనుదానియొక్క తరుగుదలకు ఎట్టి పరిమితి ఉండదు. దీనిని ఉపనిషత్తులు మిక్కిలి చిన్నదానికంటె చిన్నది (అణోరణియాన్) అని యుక్తముగ చెప్పుచున్నవి.

భగవంతుని అస్తిత్వమును గూర్చిన వివాదము కేవలము కల్పితమని నా విశ్వాసము. మానవచరిత్ర ప్రగతియందు అనేక సాంస్కృతిక సంఘములు తమ అపోహలతో భగవంతుని నింపివేయుట వలననే యిది నిజముగ తలయెత్తినది. కావున ఈ సమస్యా పరిష్కారమునకు ఉద్వేగపూరితమైన విధానమును విడనాడుట

అవసరము. ఏలయన అది మానవుని దృష్టిని మసకపరచి గమ్యమువైపు అతని పురోగమనమును అడ్డగించును.

అర్థము చేసికొనుటకు దీనిని "శూన్యము" లేక "కేంద్రము" లేక "ఆధారము" అని పిలువవచ్చును. ఆధారము లేకుండా ఏ ప్రకృతిగాని విశ్వముగాని నిలువజాలదు. ఉనికికి ఒక ఆధారముండి తీరవలెను. అట్టి ఆధారమే భగవంతుడు, లేక బ్రహ్మము, లేక అంతిమ సత్యము. అదియే "భూమ" "ద్రవ్యరహిత ద్రవ్యము", "శక్తిరహితశక్తి".

నేనిపుడు ప్రజలకు కొంచెము కూడ తెలియని ఒక నిగూఢ రహస్యము యొక్క నిజమైన విశేషార్థమును బహిరంగపరతును. సాధారణముగా "సత్" అనునదే సత్‌పదార్థమని భావించి భగవంతుని గూర్చిన జ్ఞానమునకు అదియే కొలబద్దయని వారనుకొందురు. వాస్తవమునకు యిది అంతయును "తమ్" పరిధి మాత్రమే. నిజమైన యోగి పొందుటకు అర్హమైన విషయమదియే. ఇంతవరకూ చేరుట నిస్సందేహముగా మిక్కిలి కష్టము. "సత్"ను పొందుట చాలా సులభమయిన పని. కాని "తమ్" అని చెప్పబడు స్థితి అంత సులభముగ పొందుట సాధ్యము కాదు. దానికి అతీతమయినది ఏదియు లేదు. సాధారణముగ ప్రజలు దీనిని గూర్చి ఎంతయో చర్చించినను కొంతమందైనను దాని సామీప్యమును పొందుటకు కూడ ప్రయత్నింపరు. అచట పవిత్రత, సరళత, శాంతికూడా లేవు. నిజమునకు అది వీటి అన్నిటికిని అతీతము. ఎన్నో జీవితకాలములందు ఏళ్ళ తరబడి పట్టుదలతో కృషిగావించి పొందదగినది యిదియే. ప్రపంచమున అందరికంటే గొప్పయోగులు సైతము ఈ విషయమున లక్ష్యమును చేరలేక ఆగిపోయిరని నేను ధైర్యముతో చెప్పగలను. తీవ్రముగా వాంఛింపబడునది. వాస్తవ జీవితము అయిన శూన్యస్థితి "తమ్" యందున్నది. దానిని చేరకమునుపే క్రియలన్నియు ఆగిపోవును. అదియే కేంద్ర బిందువు. మానవుని సత్యస్థితి యిదియే. అన్ని ప్రయత్నములు చేసియు అనేకులీ స్థితిని పొందజాలరైరి.

మానవులీ "తమ్" స్థితిని తమ బద్ధశత్రువుగా భావింతురు. కాని సంపూర్ణ అజ్ఞానస్థితి ఎవనియందు ఉన్నతస్థాయిలో నుండునో అట్టివానిని ఎపుడైన పరిశీలించుట తటస్థించినచో అత్యున్నతస్థాయిలో ఉన్న అతను పసిబిడ్డవలె తన స్థితిని గూర్చిన ఎరుకయే లేకుండా ఉండుట గమనింతుము. అట్టివానికి కొలదిగా "సత్"యొక్క సంపర్కము కలిగించినచో అప్పుడు అతడు తానున్న "తమ్" స్థితిని గుర్తించ మొదలిడును. ఏలన ఈ రెండింటి సంకలనము, సృష్టికి ఆధారభూత సమన్వయమైన ఒక నూతనస్థితిని సృష్టించును.

కన్నులు మిరుమిట్లుగొలుపు ప్రకాశవంతమగు వస్తువేదైనను సాధారణముగ మన దృష్టిని ఆకర్షించును. దానిని మనము "సత్" అని సామాన్యముగ అపార్థము చేసికొందుము. ఈ ప్రకాశవంతమైన వస్తువు మాయయేకాని అన్యముకాదు. దీనిని గురించి గొప్పగా మాట్లాడువారు సత్పదార్థమునకు కాదు గదా తుదకు ఆధ్యాత్మిక పరిధికి కూడ దూరముగా ఉన్నారు. కాని ప్రజలీ విషయమున ఏదైన వినుటకు గాని గుర్తించుటకు సిద్ధపడజాలనంత మాంద్యము పొందించుకొనిరి. చీకటివెలుగులకు అతీతమైన సత్‌పదార్థము కనుమరుగైనది. ఈ సంస్థయొక్క చిహ్నమందిదియే చూపబడినది. అది యదార్థమునకు మానవునని సంపూర్ణ పరిపక్వదశ. అట్టి స్థితినుండి పతనమగుటకు గాని, నశించుటకుగాని వీలులేదు. ఇది తత్త్వముయొక్క అతి సున్నితమైన అంశము. వెలుతురు, చీకటి కాని ఈ స్థితిని మహాత్ములు "సత్‌పద్" అనిరి. కాని ఈ స్థితి ఇంకనూ అతీతమైనందున ఆవిధముగా పిలుచుట సరికాదు. అది నిజమునకు అన్నిటికంటెను అతీతమైనటువంటి సత్‌పదార్థముయొక్క ప్రతిబింబము మాత్రమే. ఈ గ్రంథము చదువువారిలో అనేకులకు యిది మిక్కిలి ఆశ్చర్యకరముగ నుండవచ్చును. కాని నేనీ గ్రంథమును ఆధ్యాత్మికతయందు చక్కని ప్రగతి సాధించినవారికి, ఆ శాస్త్రమును గూర్చిన సమగ్రమైన

జ్ఞానము కలవారికొరకు, మాత్రమే ఉద్దేశించి వ్రాసితిని. దీనికి ప్రత్యక్షముగ అనుభవింపగలుగుట మాత్రమేకాని ఇది మత పరిధులలో కానరాదు. ఇది పూర్తిగా భిన్నమయిన మార్గము. ఇదియే ఒక శాస్త్రము. ప్రకృతిని అంతర్దృష్టి పరిశీలించగల శక్తి పెంపొందించినేగాని ఏ ఒక్కరును దానికి అర్హులుగారు.

## స్వత్వము (ఐడెంటిటి) :

స్వత్వము సూక్ష్మభావము వంటిది అని ఊహించుట ఉచితము అని నా ఉద్దేశ్యము. అది క్రమముగా ఆలలోచనలోనికి మార్పు చెందును. దీని ఖచ్చితమైన భావమును తెలియచేయుట కష్టము. దీనిని స్థూల ఆవరణలచే కప్పబడిన సత్పదార్థముగా గాని, మరొక విధముగా మూలచైతన్యము యొక్క కించిత్ స్థూల రూపము, లేదా మూలము యొక్క చైతన్యమును గూర్చి, ఎరుక అని అర్థము చెప్పవచ్చును. దీనికి కూడ కారణము వేరొకటి ఉండవలెనను అభిప్రాయమునకు మనము రావచ్చును. మన ఎరుకనుండి తొలగిపోవువరకు ఈ కారణకార్య పరంపర ఆ విధముగ కొనసాగవచ్చును. తార్కికముగా దీనికి సైతము ఒక కారణము ఉండవలెను అనిపించును. కాని అపుడది మానవుని గ్రహణశక్తికి అతీత విషయము అగును. దాని అత్యంత సూక్ష్మ స్థితియందు అది "స్వత్వము"గా సూచింపబడునని చెప్పిన చాలును. దేహధారియగు ప్రతి ఆత్మయు ఇట్టి స్వత్వము కలిగి యుండవలెను. అది ఉన్నత స్థితియందు అతిసూక్ష్మము, అతి సరళము. స్వత్వము ఎంత సూక్ష్మమగునో మానవుడు జీవిమున అంత శక్తివంతుడగును.

మహాప్రళయకాలము వరకు స్వత్వము నిలిచియుండును. అప్పుడది వ్యక్తిత్వము లేక స్వత్వమును వీడి సమిష్టి స్వత్వమునందు లీనమగును. ఆవిధముగా అంతమొందినది వ్యక్తిత్వమేకాని స్వత్వముకాదు. సత్, అసత్‌లను భేదము నామమాత్రముగా ఉన్న మూలము, లేక కేంద్రము వద్ద చర్య నిద్రాణముగా ఉండుటవలన అది ఆవిధముగా ఉండును.

## విశ్వశాస్త్రము :

అనాదినుండియు ఈ విశ్వము ఉన్నది. సృష్టి ప్రారంభమును నిర్ణయించుటకు కొందరు వ్యక్తులు ప్రయత్నించి నప్పటికినీ నిర్దిష్ట సమయమును కనుగొనలేకపోయిరి. సృష్టికి పూర్వము ఘనత్వము, స్థౌల్యత ఏమాత్రములేని నిర్మలమూల స్థితియందున్న దివ్యత్వము మాత్రమే యుండినది. ప్రతి వస్తువుయొక్క మూలకారణము అందు ఇమిడియున్నది. సృష్టికి పూర్వము కేంద్రముచుట్టును ఆసన్న పరిసరములందును అంతర్గత చలనము మాత్రమే యుండెను. దానిచుట్టును సృష్టి సంకల్పము కలదు. దానినే మీరు ప్రథమ ఆలోచన, లేక అవిద్య అని పిలువవచ్చును. అర్థము చేసుకొనుటకు దానిని ప్రకంపనమనియో, క్షోభయనియో, స్పందనమనియో, శక్తియనియో లేక ఏదిగానైనను పేర్కొనవచ్చును. అదియే సృష్టికిని, దానికవసరమైన దానికంతకును మూలకారణము.

సృష్టి సమయమాసన్నమైనపుడు అంతర్గతచలనమందు దాగి గుప్తమైయున్న భావము పరిపక్వమై ఆ చలనశక్తినంతటిని మథించి శక్తిని సృష్టించెను. అది వేగముగ బయల్వెడలెను. సూక్ష్మాతిసూక్ష్మాణువు సైతము వేడెక్కినది. ఆవిధముగ తొలిరోజునుండియె ఆవరణములు ఏర్పడసాగెనవి. ఎడతెగని ఉష్ణప్రభావము వలన అణువులు చలింప మొదలిడినవి. దాని తీవ్రత పెరుగుచు ఆవరణములపై ఆవరణములను చేర్చుచుపోయెను. పెరుగుతున్న స్పందనముల ప్రభావము వలన స్థౌల్యత పెంపొందనారంభించినది. గూడునందు చిక్కుకున్న పట్టుపురుగువలె ప్రతి అణువునందు చర్య మొదలిడి ద్విగుణీకృతమగుటవలన సత్పదార్థము మరుగనపడినది.

ఇట్లు సృష్ట్యారంభమున క్షోభ, చలనము ఉండెను. ఆ చలనము సృష్టికి ఆధారము. భగవంతుని తరువాత యిదియే పవిత్రము. అదియే మానవుని మనస్సు రూపమున అవతరించెను. సృష్టిసమయము ఆసన్నముకాగా సన్నాహములు ప్రారంభమయినవి. వెల్లువలు ప్రవహించినవి. స్పందనలు ఉధృతమైనవి. గ్రంధులు రూపొంద మొదలిడి ఉరవడి పుంజుకొన్నవి. మధనక్రమము ప్రారంభమైనది. వస్తువులు వ్యక్తిగత రూపములను దాల్చనారంభించువరకును క్రియలు, ప్రతిక్రియలు మొదలిడి కొనసాగినవి. సృష్టివిధానము పూర్తివేగమును పొందెను. సజీవ నిర్జీవ పదార్థములు ఉద్భవింపమొదలిడినవి. కాలక్రమమున సకల వస్తువులును ఆవిర్భవించి విశ్వము రూపొందినది. ఇట్లు కేంద్రము చుట్టునుగల వలయాకార చలన ప్రభావము వలన ప్రకృతి ఆవిర్భవించినది. చలనము శక్తిని సృష్టించినది. తదనంతరము అది సృష్టికి కారణమయ్యెను. ఏది విశ్వమునకు కారణమైనదో అట్టి ఈ ఆది చలనము, లేక క్షోభ నిద్రణమైయున్న భగవదిచ్ఛచే క్రియలోనికి తీసుకొని రాబడినది. క్షోభ అంతర్గత శక్తులను చలింపజేసినది. సృష్టివిధానములును, చేతనత్వమును ప్రారంబమైనవి. క్షోభ, లేక ఉద్దీపనము గోచరించిన ఆ మూలశక్తియే ప్రతి ప్రాణియందును ప్రధాన క్రియాశక్తిరూపమున అవతరించినది. అది మానవునిలో మనస్సుగా గుర్తింపబడినది. ఆ నిద్రణమైన సంకల్పమే క్షోభయందున్న రీతిలోనే దాని మూలమందున్నది. ఈ విధముగ క్షోభయొక్క భాగమైన మానవుని మనస్సు మూలశక్తి, లేక ఆదిమక్షోభతో చాలావరకు తాదాత్మ్యత పొందినది. ఆ విధముగా ఈ రెండింటి చర్యలును చాలావరకు పోలియున్నవి.

"క్షోభ"కు కారణము చూపునప్పుడు, సృష్టి కార్యమునకు పూర్వము అంతటను పరిపూర్ణమగు ప్రశాంతత వ్యాపించి యుండినదని నేను చెప్పుదును. శక్తి, లేక బలముకూడ దాని మూలమునందు ఘనీభవించియుండెను. మార్పునకు సమయము ఆసన్నమైనది. చలనము జాగృతమై వస్తువులను క్రియాత్మకము చేసెను. ఫలితముగా ప్రకృతియొక్క ఇచ్ఛానుసారము రూపములు ఆకృతులు ఏర్పడినవి. దానికంతటికి మూలమందున్న దానిని క్రియావక్తి అని పిలువవచ్చును. దానికి కూడ ఒక ఆధారముండి తీరవలయును. అట్టి ఆధారములేనిదే అది ఏ పనియు చేయజాలదు. అది యొక అంతిమము. ఆ విధముగా సృష్టి, చలనముయొక్క ఫలితముగను, ఆ చలనము, శాశ్వతమైన మూలము, లేక ఆధారముయొక్క ఫలితముగను నిర్ణయింతుము.

**ఆకాశము - కాలము :**

సృష్టికి పూర్వము అంతటను ఆకాశమే ఉండెను. భగవంతుని (ఈశ్వరుని) ఉనికి తదనంతర పరిణామము. దాని ఆవిర్భావమునకు కొంతకాలము పట్టినది. ఆకాశము అనంతము, నిరంతరము గనుక భగవంతుడును నిత్యుడు అని నిర్ణయింతుము. భగవదావిర్భావమునకు అనంతరమే కాలమేర్పడెను. ఇట్లు భగవంతునియొక్క సృష్టికి ఆకాశమే మాతృస్థానమైనది. కాలము దాని వ్యతిరేకస్థితి. ప్రతి వస్తువు అనంతమునందు అంతము కావలసియే యుండును. ఎంత సూక్ష్మము, లేక అదృశ్యము అయినప్పటికిని చలనము ప్రతి వస్తువునందు ఉన్నది. ఆకాశమును ఎవరు సృష్టించిరి అను ప్రశ్న కూడ అడుగవచ్చును. దైవము, విశ్వము సృష్టింపబడవలసిన ఆవశ్యకతయే ఆకాశపుటునికికి కారణము అయినది అనుటయే దీనికి అనువైన సమాధానము. అది ఉన్నది మరియు ఎల్లప్పుడు ఉండునది. అందుచే శాశ్వతము. అయితే, ఆకాశమునే దానికి బదులుగా ఏల పూజింపగూడదు ? ఋగ్వేదమునందు దీనిని గూర్చి ఒక స్పష్టమైన సూచనకలదు. కాని సరియైన విశదీకరణ లేనందున అది అపరిష్కృతము, అస్పష్టము అయిన నిగూఢరహస్యముగనే ఉండిపోయినది. ఎవరైనను తనలో ఆకాశస్థితిని అభివృద్ధి పరచుకొన్నట్లైన అతడత్యున్నత స్థితికి చేరుకొన్నట్లే అది శూన్యస్థితియొక్క చివరిదశకు

సమానమగుచున్నది. ఈ స్థితినే ప్రతివారును ఆశింపవలెను. ఈ పరిష్కారము నిస్సందేహముగా అద్భుతమైనదేకాక ఖచ్చితమైనది. ఆకాశము పరిపూర్ణము అది అణువులచే నిర్మింపబడినదికాదు. అందు ఎట్టిచర్యయులేదు. అది అత్యంత స్వచ్ఛము. అమిశ్రమము. అయితే దానిని అందరికీ అవగాహన అగునట్లు చెప్పుట బహుకష్టము.

ఆకాశమునకును, అవకాశము అనగా కాలమునకును చాల బేధమున్నది. ఆకాశముచే సృష్టింపబడిన కాలమును, ఆకాశము యొక్క స్థూలరూపము అనుకొనవచ్చును. నిజమునకు భగవంతుడు ఆకాశమునకు ప్రత్యక్షరూపము అయినట్లే, విశ్వము అవకాశము యొక్క ప్రత్యక్షరూపము. అంతరవృత్తము బాహ్యావిశ్వ సృష్టికి దారితీసినది. రెంటికి మధ్యనున్న భాగమే "కాలవ్యవధి" మహాప్రళయకాలమున జరుగునట్లు బాహ్యా ఆవరణము ఆమధ్య భాగములతోసహా కరిగిపోయినపుడు ఆకాశము మాత్రమే మిగిలియుండును. అనగా స్వత్వమే ఆకాశముగా మారును. వేరుగా చెప్పవలెనన్న స్వత్వమే ఆకాశము.

సృష్టికి పూర్వము పరిపూర్ణము మాత్రమే ఉన్నప్పుడు కాలమును గూర్చిన ప్రసక్తి ఉదయింపలేదు. సృష్టిగావింపవలెనను ఆలోచన మూలమునందు అంకురించినపుడు అందు తదితరమైన దేదియులేనేలేదు. అది ముందుకుసాగి చలన ప్రభావము వలన శక్తిగా రూపొంది కార్యోన్ముఖతవైపు మొగ్గుచూపినది. కార్యాచరణకు సహజముగ రంగము, లేక ఆధారము ఆవశ్యకమైయున్నది. ఇప్పుడు మూలసంకల్పమునకు తదుపరి ఉనికికి లేదా ఇంకొకవిధముగ చెప్పిన కారణకార్యములకు మధ్య ఏర్పడిన ఈ స్వల్ప వ్యవధి ఇదివరకేయున్నది. దీనిని వ్యవధి లేక కాలము అని వివరించవచ్చును. అది క్రియారంగముగ ఉపయోగపడెను. ఆ విధముగా కాలము శక్తిలో లీనమై శక్తిగా పరివర్తనచెంది తదనంతర సృష్టి కార్యకలాపములకు ఉపయుక్తమైనది.

సాధారణముగా సంకల్పము ప్రగాఢమైనపుడు విరామము వంటి దానిని కలిగింపచేయును. దానికి మహత్తరశక్తి కలదు. సంపూర్ణ సామ్యతవలన కేంద్రమునందు ప్రగాఢత అను ప్రశ్నయే ఉదయింపదు. కేంద్రము, లేక పరబ్రహ్మ సంపూర్ణమైనప్పటికిని మనస్సును కలిగియుండనందున మనస్సుయొక్క ప్రత్యక్ష క్రియయైన శక్తిచే భావము అందులేదు.

ఆ విధముగ ఆలోచన, చర్య మధ్య శక్తి ఉండెను. దానిని "కాల"మందురు. మన పరిమితసామర్థ్యము ననుసరించి అదే శక్తి మనకుకూడ సంక్రమించినది. ఈ శక్తి నుపయోగించుటకు మనము బృహత్తరమగు కేంద్రీయశక్తితో దానిని లీనము చేయవలెను. అదియె సర్వము, పరిపూర్ణము. ఈ ప్రపంచమున మరియే ఇతరమును, ఆధునిక విజ్ఞానశాస్త్రపు మెగాటన్ను బాంబు సైతము ఈ మహాశక్తికి సాటికాదు. ఆధునిక విజ్ఞాన శాస్త్రము దీని సమగ్రభావమును గుర్తించియుండక పోవచ్చును. దానిని అది గుర్తించి యుండినను వినాశ కార్యములకే వినియోగించి యుండెడిది.

ఇచ్ఛానుశక్తిని వినియోగించుటవలన ఆ శక్తిని ఏదో విధముగ భూమికి గొనివచ్చి కార్యములయందు ఉపయోగించవచ్చును. అత్యున్నతస్థితిక చేరిన యోగి నిరంతరమును దానిని తెలిసియు, తెలియకయు తనయందు కలిగియుండును. నా అభిప్రాయములో నిజముగ అన్ని శక్తులకును మూలమైన ఈ మహత్తరశక్తిని గూర్చిన సమగ్రజ్ఞానములేనిదే భౌతికశాస్త్రము సైతము పరిపూర్ణమైనదిగ భావింపవీలులేదు.

## జీవుడు - బ్రహ్మము :

జీవుడు ప్రత్యేక వ్యక్తిత్వమును ధరించునపుడు మాత్రమే తన "ఉనికి"ని గుర్తించును. అదియే దాని

ఉనికికి ఆధారము. ఆదియందు జీవుడు, బ్రహ్మము సారూప్యముగ ఉండిరి. జీవుని యొక్క ప్రత్యేక వ్యక్తిత్వమే రెండింటికిని, మధ్యభేదమును కలుగజేసినది. ఆత్మ అహంకారము, లేక వ్యక్తిత్వముతో బంధింపబడి జీవునిగా రూపొందినది. తానున్న మండలముకూడ తన ప్రభావమును దానిపై ప్రసరింపనారంభించినది. వివిధ వర్ణములు ఒకదానివెనుక నొకటిగ దానిచుట్టును స్థిరపడమొదలిడి దానికొక క్రొత్తవన్నె సమకూర్చినవి. ఒకవిధముగ దానియందు బహుత్వము స్థిరపడనారంభించి క్రమముగా అహము, దట్టముగను, సాంద్రముగను వృద్ధియై పెరగనారంభించెను. అనుభూతులు, ఉద్వేగములు, కోరికలు వాటికి తగినట్లు దీని స్థౌల్యతను ఎక్కువచేయ నారంభించెను. ఇట్లు జీవుడు బంగారపు పక్షివలె శరీరమనెడి ఇనుపపంజరమందు పూర్తిగా నిర్బంధితుడయ్యెను. ఇది అంతయు అహంకారవలయమునందు సంకల్పములు, భావోద్రేకములు, కోరికలయొక్క క్రియ, ప్రతిక్రియల ఫలితముగ సంభవించి దాని కిరణాభేద్యస్థితిని పెంచుతూ పోయినది. ఇదియే సంక్షేపముగ జీవుని పూర్తిచరిత్ర. అది సంతోషపూర్వకముగ తన ఉత్పత్తిస్థానమును గుర్తింపజేయగలదానితో శక్తివంతము అయిన సంబంధములోనికి వచ్చినపుడు తన ఆవరణములను అన్నింటిని ఒకదానివెనుక మరియొకటిగ త్రోసివేయుట ఆరంభించును. కాని జీవునకు చలనముండుటవలన అతడు తన సృష్టికర్తను (బ్రహ్మమును) కూడ గుర్తెరుంగును. ఇట్లు “జీవుడు” అను పదము తనయందు చలనము, యోచనాశక్తుల భావములను కలిగియున్నది. జీవునియందు ఈ రెండును సమాంతరము. జీవ, బ్రహ్మలిద్దరి విదులు ఇంచుమించు సమానము. ఈ రెంటి తారతమ్యమము ఏమనగా బ్రహ్మము విశ్వవ్యాప్తియై యుండగా, జీవుడు సంకుచిత, అహంకారపరిధికే పరిమితుడై యుండెను. ఈ విషయమున బ్రహ్మముకూడ జీవునివలెనే తన బంధములను కలిగియుండెను అని చెప్పవచ్చును. దీనితేడా ఏమనగా బహుశ బ్రహ్మము యొక్క బంధనములతో పోల్చిచూచిన, జీవుని బంధనము స్థూలమును, సాంద్రమును అయిఉన్నది. ఇద్దరికిని పరిమితులు కలవు. ఇదియే బ్రహ్మమునుగూర్చిన సరియగు భావన.

## ప్రకృతియందలి సమానాంతరత :

సృష్టికి పూర్వము మూలస్థితియందున్న దివ్యత్వమే ఉనికిలోనున్నది. ప్రతివస్తువును సారరూపమున దానియందే ఇమిడియుండెను. క్షోభతో ప్రత్యక్షస్వరుపము ప్రారంబమైనది. గుప్తచలన మండలమున అది మధనక్రియను పురికొల్పినది. క్రియాత్మకత పునరుజ్జీవమైనది. దానితో శక్తి ఉజ్జీవింపబడి ప్రత్యక్షరూపము వైపునకు తనచర్యను ఆరంభించెను. ఈ కార్యక్రమము పూర్తిగా దివ్యత్వముతో పొందిక కలిగియున్నను బాహ్యరూపమున దానికంటెను భిన్నముగా కన్పడెను. ఏలయనగా అది ప్రత్యక్షరూపమును దాల్చుటయను లక్ష్యము కల్గిన మార్గమును అనుసరించెను. మానవుడు రూపుదాల్చుటకు దానికి సన్నిహితసంబంధము ఉండుటవలన దానిని మానవత్వమునకు సంబంధించిన మార్గము అనవచ్చును.

దివ్యత్వము, మానవత్వము సమాంతరముగ పయనించుచు తమతమచర్యల నారంభించినవి. కాని మూలమున సృష్టియే ప్రధానాంశము గనుక మానవమార్గమే ప్రాధాన్యము వహించుట ప్రారంభమైనది. ఆ దశయందు ఆ రూపము అత్యంత సూక్ష్మమైనప్పటికీ ప్రతీవస్తువు మానవునితో సహా స్పష్టమైన రూపమును ధరించనారంభించెను. వేరొకవిధముగ చెప్పవలెనన్న సృష్టి నిర్మాణమునకు మానవమార్గమే ఆధారమైనది. కాని దీని చర్య సమానంతరముగ నడుచుచున్న దైవీమార్గపు నిద్రాణచర్యలకు లోబడియుండినది. అందుచే శక్తియొక్క సక్రమకార్య సరళిరూపములను, ఆకృతులను బలపరచుచుండినవి. వాస్తవమునకు దివ్యత్వములతో సంయుక్తముగ పురోగమింపకున్నచో మానవత్వము ఇంత చక్కగ పనిచేసి యుండెడిది కాదు. క్లుప్తముగ

మానవత్వము దివ్యత్వముతో సమాంతరముగ గమనము సాగించుచున్నది.

ఉన్నకొలది చర్యలు ద్విగుణీకృతము అగుచు మానవుడు ఇతర వస్తువులతోసహా (మరిమరి) స్థూలరూపము దాల్చనారంభించెను. అన్నిటికి మూలమునందు దివ్యత్వము కలిగి మానవునిలో ప్రతీది మానవత్వ వర్గములోనికి వచ్చును. ఈకారణముచేతనే భగవంతుడు మానవుని యందున్నాడని చెప్పుదురు. దాదాపు అన్ని మతములవారికి ఇదే అభిప్రాయముఉన్నది. మనము దివ్యత్వముతో సహా ఉండి, దానిని మానవమార్గముతో కలిసినప్పుడు మాత్రమే మన అంతిమ ఉద్దేశ్యము నెరవేరగలదు. ఇప్పుడు ఈ రెండును ఏకైక పర వస్తువు నుండియే ఆవిర్భవించినవిగాన మానవత్వముకూడ దివ్యతమువలె పరిశుద్ధ స్థితియందుండెను. దానియందున్న క్రియాశక్తి అపుడు నామమాత్రముగనే వుండినది, లేక నిద్రాణస్థితియందు వున్నదని చెప్పవచ్చును. క్రియ, ప్రతిక్రియ వలన కలిగిన సంచలనములు ఒకవిధమగు జాగృతిని రేకెత్తింపనారంభించెను. వైవిధ్యములు పొడసూప సాగినవి. శీతోష్ణములు విభిన్న మార్గములలో రూపకల్పనకు తోడ్పడినవి. ఇవన్నియు మానవ నిర్మాణమున భాగమాయెను. అతడు అస్తిత్వము కలిగియున్న సకల వస్తువుల మిశ్రమమాయెను. మనము ఇప్పుడు చేయవలసినదంతయును వాటిని మూల స్థితికి తిరిగి గొనివచ్చుటయే, లేక వేరొకవిధముగా చెప్పవలెనన్న దివ్యత్వముతో సంబంధము నిలుపుకొనుటకు వాటిని పూర్వపు సమత్వ, ప్రశాంత పరిస్థితులకు కొనివచ్చుటయే. వానియందు సరియైన మితత్వమును ప్రవేశింపజేయుటయే దీనిని సాధించుటకు ఏకైక మార్గము. సహజమార్గమున మనమిదియే చేయుదుము. ప్రజలకు, మానవుడు పరిపూర్ణ దివ్యత్వమును పొందుటను గూర్చిన యదార్థజ్ఞానమును పరిపూర్ణముగ కలిగించు ఉద్దేశ్యముతో ప్రకృతి రహస్యమును నేనిక్కడ ప్రతిపాదించితిని.

## అవతారములు :

ఖచ్చితముగ చెప్పవలెనన్న ఒక చిన్నసృష్టిని మనకు మనమే నిర్మించుకొంటిమి. దీని ఆధారమునకు కావలసిన పదార్థములను మనమే సమకూర్చితిమి. క్షోభను కలుగజేసిన ప్రథమ సంకల్పముతప్ప దీనియందు భగవంతుని కార్యము నామమాత్రమే. యంత్రములన్నిటికిని భూగర్భమందలి ముడి ఖనిజము ఎట్లు మూలమో, అట్లే సృష్టియందున్న నిఖిల వస్తువులకును సారరూపమున ఉండిన పదార్థమే అసలైన మూలము. ఆ ప్రథమ సంకల్పము యొక్క వేగము అతి తీవ్రమైనది. అది నేటికిని అట్లే ఉన్నది. తుదివరకు అది అట్లే కొనసాగగలదు. ఈ విషయములో సృష్టియొక్క ఆద్యంతములు ఒక వేగమునకు రెండుకొనలుగా ఉన్నవి. ఈ మధ్యగల ఆకాశము శక్తి సమన్వితమై సంపూర్ణ విశ్వనిర్మాణము అవతరించుటకు ముఖ్యసాధనమయ్యెను. దానికి అమోఘశక్తి వున్నది. అది విద్యుత్ ప్రవాహమువలె తాకిడులను కలిగించును. దాని మధ్యభాగము కేంద్రమువలె పనిచేయును. దీనికి కొంచెము క్రిందిభాగమున ప్రధాన క్రియాశీలశక్తి కలదు. అదియే కారణముగా పనిచేయును. కేంద్రబిందువునకు కొన్ని మిల్లీమీటర్ల దూరమే అనిపించు మరియొక బిందువు కలదు. అచట తగిన పరిమితిలో సృజనాత్మక శక్తివంటిది ఒకటి కలదు. మిక్కిలి దూరమున నుండి పరిశీలించుటవలన అది కొన్ని మిల్లీమీటర్ల దూరము మాత్రమేనని నేను చెప్పితిని. కాని ఎవరైనను శరీరపుహద్దులను అధిగమించి దానిని సమీపించి చూచినచో అపుడాదూరము అతనికి అంతులేనిదిగా కన్పట్టును. కేంద్రబిందువునకు పైకిపోవు కొలదిని ఆ శక్తి మందగించును. సత్పదార్థమునకు మన అత్యంత సాన్నిహిత్యమును ఇది సూచించును. మానవునికి ఈ మందశక్తి సంక్రమించగా, అవతారములకు కేంద్రబిందువు వద్దనున్న మహత్తర శక్తి సంక్రమించును. వీరు కేంద్రబిందువు యొక్క లక్షణములచే సంపూర్ణముగా వుద్దీపితులై వుందురు. కృష్ణభగవానుడు ఈ కేంద్రబిందు

మండలమునుండి ఆవిర్భవింపగా, రామావతారము ఆవలి చివరనుండి అవతరించెను. ఈ కారణముననే రామావతారము మానవసామ్యతను ఎక్కువగా కలిగియుండెను. మానవునిగా ప్రయత్నించి పొందదగు జీవితధర్మమును ఆయన ప్రదర్శించెను.

అవతారములకు స్వత్వములేదని కొందరి అభిప్రాయము. నేను వారితో ఏకీభవింపను. వారియందు స్వత్వము లేకుండెనేని వారు శరీరధారులై తమకు నిర్ణీతములైన కార్యములను నెరవేర్చియుండక పోవుదురు. తమ పనులకు పెరిగి పెద్దదగుచుండు భౌతిక శరీరము వారికి అవసరము. ఇతరులకువలెనే వారికిని "స్వత్వము" పూర్తిగా ఆవశ్యకము.

ఒక నిర్దిష్ట ప్రయోజనముకొరకు వారిని నిర్ణీతములైన కార్యములను నెరవేర్చుటకు తగిన శక్తులతో కూడుకొని అవతారములు ఆవిర్భవించును. వేరుగా చెప్పవలెనన్న అది వారిని ప్రపంచమునకు తీసుకొనివచ్చుటకు సంస్కారములుగా వర్తింప వచ్చును. వారి కార్యసమాప్తి అయిన పిమ్మట ఆ శక్తి వారిని పూర్వస్థితికి మరలించును.

సాధారణ మానవునికి, అవతారములకు తారతమ్యమే మన మానవుడు అనేకములగు ఆవరణములచే ఆచ్ఛాదింపబడియుండగా అవతారములకు ఆవరణలు చాల తక్కువ. దివ్యత్వము అవతారములకు అవగతము. మానవులకు అట్లుకాదు. ఇప్పుడు మానవునకు అవతారమునకును మూలము ఒకటియే అయిననూ అవతారము దైవముతో సన్నిహిత సంబంధము కలిగియున్నది. అతనికి కావలసినదంతయు శాశ్వత భండారమునుండియే వచ్చును. తన కార్యములను నడిపించుటకు దివ్యవాణి అనబడు దివ్యఆదేశములను ఆయన పొందును. అవతారములు కార్యనిర్వహణను కలిగియున్నవి గాన వారికికూడ మనస్సు ఉండుట అవసరము. కాని వారి మనస్సు నిర్మలమైనదై సమత్వము కలిగిఉండును. వారి కార్యములు దైవేచ్ఛకు అనుగుణ్యముగా ఉన్నవి. కావున అవతారములకు మనస్సు ఉండదు అని భావించుట పొరపాటు.

నేను గమనించినంతవరకు పని చేయుచున్న మూర్తిమత్వము కేంద్రబిందువు నుండి వచ్చినాడని చెప్పగలను. అందువలననే, మన బాహ్యదృష్టికి మందముగా, లేక అణుకువుగా ఉన్నట్లు కనిపించినను అతడు మహాబలవత్తరమైన శక్తి సంపన్నుడు. ఈ లోకమున ఇంతవరకు వచ్చిన ఏ అవతారమునకు మూలము యొక్క శక్తి ప్రసాదింప బడియుండలేదు. సర్వజ్ఞుడైన ఆ భగవంతుని అనుగ్రహమువలన నేను ప్రకృతిని గమనించి తెలుసుకొన్న దానిపై ఆధారపడి ఈ విషయమును వివరించుచున్నాను.

## తృతీయ అధ్యాయము

# జ్ఞానము - దాని స్వభావము

---

సామాన్యమగు అర్థమున "జ్ఞానము" అనగా తెలిసికొనుటయగును. జ్ఞానము శారీరకము, మానసికము, భౌతికము లేక ఆధ్యాత్మికములలో ఏదైనను కావచ్చును. ఈ పదము (జ్ఞానము) ఆధ్యాత్మిక అర్థమున మిక్కిలి అస్పష్టముగ ప్రయోగింపబడినదై తరచు నిజమైన అర్థమును తెలిసికొనుట కష్టసాధ్యము. ఇది అధమస్థాయిలోనున్న సామాన్య అవగాహననుండి ఉన్నత స్థాయిలోనున్న అంతర్గతవికాసము వరకు వర్తించును. ఇది ఎన్నో భ్రమలు అపార్థములకు దారితీయును. కొన్ని మతగ్రంథములను అధ్యయనముచేసి "అహంబ్రహ్మాస్మి" వంటి వాక్యములను ప్రతిక్షణము వల్లించుచు తను "జ్ఞాని" అని చెప్పుకొను వానిని ప్రజలు అతని నిజమైన ఆంతరిక స్థితి ఎట్లున్నను జ్ఞానిగా అంగీకరింతురు. వివిధ గ్రంథులయొక్క వివిధ ఆధ్యాత్మిక స్థితులను అనుభవించుచు అభ్యాసిసాధనలో పెంపొందించుకున్న మనస్సు యొక్క ఆంతరంగికస్థితిక సంబంధించినదే నిజముగ "జ్ఞానము". ప్రతి గ్రంథియందును నెలకొనిన స్థితులను గ్రహించుటయే నిజమునకు జ్ఞానము. గ్రంథులు అనేకములు గావున, సాధకుడు తన సాధనస్థాయి ననుసరించి పొందుజ్ఞానముపై సైతము భిన్నముగనే యుండును. ఆవిధముగ ఒకవ్యక్తి పొందిన స్థాయిని అనుభూతిగాంచిన జ్ఞానముయొక్క పరిమితిని నిర్ణయియింపకయే అతనిని "జ్ఞాని" అని పేర్కొనుట అర్థరహితము. జ్ఞానము యొక్క స్థితిని మనము పూర్తిగ తెలుసుకొని,మరియు దాని ఫలితములను యిముడ్చుకొని మనము దానిలో లీనము పొందిన తర్వాతనే జ్ఞానముయొక్క స్థితి ఏర్పడును. మనము ఇట్టి స్థితిని పెంపొందించుకొని దాని ఎరుకయందు లీనమయినదానితో సాయుధ్యతను పొందుటయే ఆ స్థితియొక్క వాస్తవజ్ఞానము. అట్లు ఆ మేరకు జ్ఞానులము అగుదుము. మన బుద్ధిబలము నుపయోగించి జ్ఞానము సంపాదింప యత్నించినచో అది కృత్రిమముగనే కాని నిజమైనదియు, అసలైనదియుకాదు. ఏ స్థితియందు లీనమై దానితో సమగ్రసారూప్యతను పొందుదుమో అదియే ఆ స్థితియొక్క యదార్థజ్ఞానము. అంతిమము యొక్క అన్వేషణకొరకై తీవ్రతపనతో నింపుటయే వివిధస్థితిలందు జ్ఞానమిచ్చు సహాయము.

అజ్ఞానము, జ్ఞానము ఒకే వస్తువుయొక్క రెండు కొనలు. కొంతవరకు అది అజ్ఞానము అనబడును. పిమ్మట అదియే జ్ఞానముగ మారును. అవి ఒకే అయిస్కాంతము యొక్క రెండు ధృవములవంటివి. ఆ విధముగ విద్యలేనిదే అవిద్యలేదు. అవిద్యలేనిదే విద్యలేదు. ఒకటి ఉన్నచో మరియొకటి ఉండితీరవలసినదే. అజ్ఞానపుపొరను ఛేదించునపుడు ఈరెండును పోవునని దాని అర్థము. అవిద్యాపరిధియందు విద్య అవిద్యలు రెండును ఇమిడి యుండును. ఈ రెండింటికిని అతీమైనదే ఆ"తమ్" స్థితి. యదార్థమునకు అదియే సాక్షాత్కారస్థితి. అచట విద్య, అవిద్యలు రెండును లేవు. అయితే అప్పుడు అచట ఏమున్నది? అది ఈ రెంటిలో ఏదియునకాదు. అదియొక సంపూర్ణ అంతర్లీనస్థితి, తెలియనిస్థితి లేదా సంపూర్ణ జ్ఞానహీనస్థితి. స్థూలముగా శైశవము నందలి అజ్ఞానస్థితియని చెప్పవచ్చును. యదార్థమునకు అజ్ఞానము జ్ఞానముయొక్క మహోన్నత శిఖరము. దీని భావమేమనగా మనము అజ్ఞానదశనుండి బయలుదేరి చివరకు ఉన్నత అజ్ఞానస్థితిని చేరుదుము. (దీనినే

సంపూర్ణ అజ్ఞానము అని నేను అనెదను). సామాన్యవాడుకలో జ్ఞానపరిధి మధ్యస్థస్థితి. నిజమునకు అది జ్ఞానపరిధిలో ఉన్నంతవరకు అది అంతయు వాస్తవముగ అజ్ఞానమే.

అజ్ఞానపు తెర ఛేదించిన పిమ్మట ఉదయించు దానిని జ్ఞానమని ఎప్పటికైనను చెప్పగలమా? చెప్పలేము. పరస్పర వ్యతిరేకములైన ఈ రెండింటిని దృష్టియందిండుకొని బాహ్యమునకు దానిని జ్ఞానము అన్నప్పటికిని నిజమునకు అది ఏమాత్రము సరికాదు. "జ్ఞానము" యొక్క అర్థమునకు అది వర్తించునా? వర్తించదు. జ్ఞానములో నేను అనుదానిని అతిక్రమించిన ఎరుక ఉండును. సాక్షాత్కారమనగా పరిపూర్ణములో లీనమగుట, లేక దానితో ఏకత్వము పొందుట. అట్టి పరిస్థితియందు జ్ఞానప్రసక్తి ఎప్పటికినీ కలుగదు. ఇక అట్టిదానిని ఏమనవచ్చును? జ్ఞానరాహిత్యమా? తెలిసికొనకుండుటయా? అజ్ఞానమా? మరి ఏదైననా? దానిని మాటలలో చెప్పుటకు అసాధ్యమైనను అది అటువంటిదే. సంపూర్ణ జ్ఞానహీనత అనుట ఉచితము.

దివ్యమార్గమున పయనించువాడు చీకటినుండి వెలుగులోనికి వచ్చుచున్నట్లు భావింపనగును. (చీకటి సామాన్యముగా చెప్పబడినట్లు) అవిద్యాకానిండు. వెలుగువిద్య కానిండు. సహజ మార్గమునకు జ్యోతి గమ్యము కాదు. అది అంతిమస్థితి వైపు పయనించుమార్గమున సంభవించు ఒక మధ్యంతర స్థితి మాత్రమే. అది వెలుతురు కాదు, చీకటియుకాదు. ఆ రెండింటికిని అతీతమైనది. ఆవిధముగ మనము అవిద్యనుండి బయలుదేరి విద్య (జ్ఞానము) ద్వార, విద్య, అవిద్యలకు అతీతమైనదానికి పోవుదుము. వెలుగు–చీకటి, విద్య–అవిద్య కానని దానియొక్క సరియైన అర్థము తెలుపగల పదమెద్ది? ప్రపంచములోని శబ్దసముదాయమున, అట్టి పదమేదైనను కలదా? లేనేలేదు. కావున తొలి అజ్ఞానము యొక్క అసంస్కృత స్థితికంటె భిన్నమైన "జ్ఞానహీనత" అని నేను చెప్పినట్లుగానే ఉండనిమ్ము.

## ఉపాయములు : తర్కము - శృతి - అనుభవము

సామాన్యముగ తాత్వికులు వస్తువులయొక్క విషయాంతరమును అంతరదృష్టిచేగాక తర్కముద్వారా తెలిసికొనుటకు ప్రయత్నించిరి. తర్కము సాధారణముగా లోపసహితమైయుండి మనలను విఫలులుగ చేయవచ్చును. కాని ఒక వస్తువును అనవసరమైన తార్కికదృష్టితోగాక అంతర్‌దృష్టితో దర్శించినట్లయిన అది ఎట్టి పొరపాటునకు తావీయక తన మూలరూపమున కన్పట్టును. గ్రంథులు తమంత తాము విడివడుట మొదలిడినప్పుడు విషయములను అర్థము చేసుకొనుటకు ప్రయత్నింపవలెను.

గ్రంథముల నుండి మనము ఆశించిన మార్గదర్శకత్వము అంతగా ఉపకరింపదు. ఏలయనగా అది తరచు పెడత్రోవ పట్టించునదిగను, కొన్నివేళల ప్రమాదకరముగను కూడ ఉండును. గ్రంథములలో విధింపబడిన పద్ధతులు సాధారణముగ తబ్బిబ్బుచేయుచు, బాహ్యరూపమునే ప్రస్తావించును. ఓషధీగుణములను, వాటి పేరులను చదివినంత మాత్రమున ఎవడును ఎన్నటికిని వైద్యుడు కాజాలడు. గ్రంథములలో మామిడిపండు వర్ణనను గూర్చి చదివినంత మాత్రమున దాని రుచియొక్క సంపూర్ణ గ్రాహ్యము కలుగుట అసంభవము. "తింటేనేగాని రుచి తెలియదు" అను లోకోక్తి సర్వవిదితము. బాహ్యదృష్టికి వేదములలో పరస్పర విరుద్ధభావములు కలవు. తత్ఫలితముగ షడ్దర్శనములు కలిగినవి. ప్రతివారును తమస్థాయి ననుసరించి ఏదో ఒకటి చెప్పుదురు. ఆ శాశ్వతస్థితిని పొందుటయే యదార్థసాధన. అది అతీంద్రియజ్ఞానము వలననే సాధ్యమగును. కాని కేలము పఠనము, తర్కము, నమ్మకములు మున్నగు వానివలన సాధ్యముకాదు. నేనుగ్రంథములను అధ్యయనము చేయలేదని నిర్మొహమాటముగ అంగీకరింతును. ఏలయన అవి ఉపయోగకరమని నేనెన్నడును తలచలేదు.

గ్రంథ పఠనమును విద్వాంసులకు, పండితులకు వదలివైచి నేను పొందుటకు అర్హమైనదిగా భావించిన సత్పదార్థమునందె దృష్టి ఉంచితిని. నేనేమి చెప్పినను వ్రాసినను అది కేవలము నా సాధనయందు సాక్షాత్కార పథమున స్వానుభవముపై ఆధారపడినదేకాని శంకరులు గాని, రామానుజులుగాని, తదితరులు గాని చెప్పిన వాటితో నిమిత్తములేదు. నేను అప్పుడప్పుడు చదువుదును. అది కేవలము వినోదముకొరకే. భావమును సులభముగ ప్రకటించుటకు నేను సాధ్యమైనంత జ్ఞాపకముంచుకొనుటకు ప్రయత్నింతును. శంకరాచార్యునిచే వ్రాయబడిన వివేకచూడామణియందు నేను చదివినదొకటి జ్ఞాపకమున్నది. దాని అర్థము "సాక్షాత్కారమునకు గ్రంథములు తోడ్పడవు. మరియు సాక్షాత్కారము లభించిన పిమ్మట గ్రంథములు నిరుపయోగములు".

పాపాత్ములకు నరకమును, అజ్ఞానులకు స్వర్గమును, మాయకులకు బ్రహ్మలోకము కలవు. కాని పండితులకు, విద్వాంసులకు, వారే కల్పించుకున్న కృత్రిమస్వర్గము ఉన్నది. మరియు బలహీనులకు అనిత్యమైన ఈ ప్రపంచము కలదు. కాని ఎవరు బలహీనులు? ఆత్మవిశ్వాసము లేనివారే బలహీనులు. శాస్త్రములలో పరస్పర విరోధభావము లున్నప్పటికినీ మనము ఆలోచించి ఒక పరిష్కారమునకు వచ్చుటకు అవి అవకాశము కల్పించును. కావున వాటికి విలువ ఉన్నది. వానియందు మరియొక సుగుణము కలదు. అవి భిన్నరుచులు గల వారికిని, వేర్వేరు మానసిక ప్రమాణములుగల మేధావులకును, ఆధ్యాత్మిక పురోగమనముకు మార్గములను, పద్ధతులను అందించును. నేను గ్రంథములద్వారా సాక్షాత్కార మార్గమున పయనించియుండినచో దివ్యత్వమునకు మౌలికధర్మమైన "అజ్ఞాన" (Ignorance) స్థితిని చేరియుండకపోవుదును. ఆచరణతో కూడిన జీవితమే పొందుటకు అర్హమైనది. సాక్షాత్కారమును గూర్చి తెలిసికొనుట మాత్రమే చాలదు. మనము దానిని పొందుటకుకూడ ప్రయత్నించవలెను.

# చతుర్థ అధ్యాయము

# మానవుడు

---

## విశ్వమందు మానవుని స్థానము మరియు విధి :

ఈ విశ్వము ఏ తీరున ఉద్భవించియుండును అని యోచించుటకంటెను ఆ సృష్టికర్తను శ్లాఘించవలెనని నేను సలహా ఇచ్చెదను. స్థౌల్యము, కాంతి, చొరరాని ఆవరణలు పరంపరతో కూడిన వ్యక్తిగత భౌతిక ఉనికియొక్క అల్పసృష్టిని మనము నిర్మించుకొంటిమి. ఇప్పుడు చేయవలసినదేమన, కాంతికి అభేద్యమైన ఆ ఆవరణములను ఒక్కొక్కదానిని ధ్వంసము చేసి, సృష్టికాలమున మనకున్న పూర్ణస్వరూపమును దాల్చవలెను.

ప్రస్తుతము అత్యంత స్తూలరూపముననున్న మన ఉనికి తటాలున, లేక ఆగంతుకముగ వచ్చినదికాదు. అది క్రమవృద్ధి ఫలితము. విశ్వ నిర్మాణమునకు హేతువైన గుప్తచలన శక్తియే సర్వశక్తిమంతుడైన భగవంతుని ఆదిమ మనస్స. మన ఆవిర్భావమునకు అదియే కారణము. దానినే ప్రథమ మనస్సు అందుము. మనస్సు వెనుక కేంద్రము, లేక తమ్‌స్థితి కలదు. సృష్టి ఆరంభమున ఆత్మయునికి గోచరించును. అప్పుడది స్వచ్ఛమైన, ప్రత్యేక ఉనికిగా నుండెను. అత్యంత సూక్ష్మరూపమున ఉన్న ఆత్మయొక్క ప్రాథమిక స్థితినుండి మనము ఉనికి యొక్క స్థూల స్థూలతర రూపములకు చేరితిమి. వీటినే ఆత్మచుట్టూ ఏర్పడిన ఆవరణలని చెప్పవచ్చును. ఆదిలో ఆవరణలు మిక్కిలి సూక్ష్మములు. అట్టివానితో మనము మన జన్మస్థానమగు భగవత్ సామ్రాజ్యము నందుంటిమి. అహంకార ఆవరణ కొనసాగిన అనంతరము మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారములు అపరిష్కృత రూపములతో చేరి మన స్థూలత్వమునకు దోహదము చేయ ప్రారంభించినవి. కాలక్రమమున సంస్కారములు ఏర్పరుట ఆరంభమై వాటి ఫలితముగా ఏర్పడిన గుణములను కలుగజేసినవి. సుగుణ, దుర్గుణములు కనపడినవి. క్రమముగ ఉనికి అత్యంత స్థౌల్యమును దాల్చినది. సుఖ, దుఃఖ, సంతోష, విషాద భావములయొక్క ప్రారంభము సంస్కారముల ఫలితమే. ఆనందములు సుఖములయందు ఆసక్తియు, దుఃఖము విషాదముల యందు అయిష్టముగను, యింకను చిక్కులను సృష్టించినవి. ఫలితముగ మనము బాధలు, దురవస్థలచే చుట్టబడితిమి. వాటినుండి విడివడుటయే ప్రధాన లక్ష్యముగ భావింతుము.

మానవునని యందు రెండు ధృవములు కలవు. దాని ప్రారంభము మూలమునకు అతిసమీపముగ నున్నది. రెండవ కొన ప్రపంచమువైపున ఉన్నది. ఏదోవిధముగ వ్యక్తిగత మనస్సును విశ్వమనస్సు వైపునకు మలచుకొనిన అది దాని నిజస్వరూపములో కనబడుట ఆరంభించును. యదార్థమునకు సృష్టి కార్యనిర్వహణకు ప్రకృతిశక్తిని చలింపచేసిన క్షోభయొక్క ప్రతిబింబమే మానవునని మనస్సు. ఆవిధముగ వ్యక్తిగత మనస్సు భగవంతుని మనస్సు (క్షోభ)నందలి భాగమే. ఎట్లో దానిని దాని అధఃప్రవృత్తులను మూలము వైపునకు మరల్చినచో అది నిశ్చలము, స్థిమితము, ప్రశాంతము అగును. స్వానుభవమును బట్టి నాకు తోచినదేమన ఒక గతిశీల మూర్తిమత్వము (Dynamic Personality) యొక్క సహాయము మాత్రమే దానిని మూలము వైపునకు మరల్చగలదు. అట్టి మహాత్ముని శక్తి ఇచట మాత్రమే సరియైన మార్పును తీసుకొనిరాగలవు. చదువుట,

వ్రాయుట నిరుపయోగములు. శ్రద్ధ, భక్తి, ఆత్మ విశ్వాసముగల మానవుడే జయము పొందగలడు.

మానవుడు ప్రకృతియొక్క ఉపకరణము. అతడు అమితమైన శక్తి కలవాడు. ఆ శక్తిని ఉపయోగించు ఉపకరణము కూడ అతనికి కలదు. అద్భుతమైన ఆ ఉపకరణము అతని మనస్సు. అది మనుష్యునిలోనే ఉన్నది. పూజ్యవస్తువని తలవబడు భగవంతునకు కూడా మనస్సులేదు. జంతువులకు మనస్సు ఉన్నది కాని అది వేరొక విధమైనది. పూర్ణచైతన్యము, క్రియాత్మకత కలిగిన మానవుని మనస్సుతో పోల్చిన ఇది జడస్థితియందున్నదని చెప్పవచ్చును. సృష్టిని కలుగజేయుటకు ఏర్పడిన దైవసంకల్పమువల్ల ప్రథమక్షోభ జనించినది. అది మనస్సునకు మూలము. మానవుని మనస్సు యొక్క స్వభావము అట్టిది గాన కపట మహాత్ములు దానిని మానవునికి బద్ధశత్రువని కఠోరపదములతో నిందించుట చాలాతప్పు. దాని వాస్తవిక ప్రతిభ, విలువలను వారు పరిగణింపరు. నిజమునకు విషయములను కార్యరూపమునకు కొనివచ్చుటకు అదియే ఏకైక సాధనము. మానవుని అల్పసృష్టిని ఉనికిలోనికి కొనివచ్చిన ప్రథమ విశ్వశక్తియొక్క సంక్షిప్త రూపమిదియే. అదే శక్తి, ప్రతీదాని మూలమునందును క్రియాశీలత కలిగిఉన్నది. ఆ శక్తి ఎవరిది దేవునిదా, లేక మానవునిదా? సమాధానము సులభము. అది ఖచ్చితముగ, మానవునిదే. ఏలన దేవునికి మనస్సులేదు. అది ఉండియేయున్న అతడు సంస్కార ప్రభావములకు లోబడి ఉండియుండును. కావున మూలమున పనిచేయునది మానవమనస్సు మాత్రమే.

మానవదేహములోని అణువణువూ అమితశక్తి సమన్వితము. విశ్వమంతయు దానితో సన్నిహిత సంబంధము కలిగియున్నది. వెన్నుపామునందలి ప్రతిబిందువు అత్యున్నత శక్తితో నిండియున్నది. కాని దాని నింతవరకును ఎవ్వరును గమనించలేదు. ప్రజలు “కుండలిని”ని జాగృతము చేయుటకు మాత్రమే వెర్రిగా కాంక్షించుచు గోల పెట్టుచున్నారు. మెదడులోని కణములయొక్క బీజములోని ప్రతి అణువునందు ఉన్న తీవ్రశక్తి కుండలినీశక్తిని అధిగమించును. కాని దానిని ఇంతవరకు ఎవరును మానవశ్రేయస్సు కొరకు వినియోగింపలేదు. చాలామంది జ్ఞానులకు నా అభిప్రాయము అంగీకారయోగ్యము కాకపోవచ్చును. నేను వారికి నిదర్శనపూర్వకముగ చూపినను దానిని గ్రహింపగల సూక్ష్మగ్రహణశక్తి వారియందుండక పోవచ్చును. ప్రజలు దీనిని గ్రహించి అనుభూతి పొందగలకాలము ఎట్లయినను రాకతప్పదు.

మానవత్వమునకును, దివ్యత్వమునకును మధ్యనున్న సమాంతరత నిర్మూలము.

భగవంతుడు మానవుని తన రూపములోనే సృష్టించెనని సామాన్య విశ్వాసము. ఈ విషయమున ప్రపంచమున అన్ని మతములు, తత్వశాస్త్రములు, విజ్ఞానశాస్త్రములు ఇంచుమించు ఏకీభవించును. ఎముకలు చర్మముతోకూడి చేతులు, కాళ్ళు ఇతర అవయవములుగల మానవునివలెనే భగవంతునికి రూపము ఉన్నది అనికాదు. మానవుడు ప్రకృతియందున్న శక్తి, బలము, సామార్థ్యములతో అదేవిధముగ నిర్మింపబడియున్నాడు. లేదా కలిగియున్నాడు అని దీని భావము.

మానవనిర్మాణము సరిగ్గా విశ్వనిర్మాణమువలెనే యున్నది. ఈ స్థూలబాహ్య ప్రపంచము వెనుక ఎన్నియో సూక్ష్మ, సూక్ష్మతర ప్రపంచములు ఉన్నట్లే మానవుని స్థూల భౌతికరూపము వెనుక ఎన్నియో సూక్ష్మ, సూక్ష్మతర రూపములున్నవి. మిక్కిలి బాహ్యమైనది స్థూలశరీరము. దానివెనుక సూక్షశరీరము, దాని వెనుక కారణశరీరములు కలవు. ఈ మూడు బాహ్యరూపములే గాక అసంఖ్యాకములగు సూక్ష్మాతి సూక్ష్మరూపములు కలవు. మేధావులు వీటిని శరీరములనక ఆత్మచుట్టును గల సూక్ష్మ ఆవరణములందురు. అవి అసంఖ్యాకములు కనుక వాటిని విడిగా పేర్కొనుట సాధ్యముకాదు. విశ్వము లేక భగవంతుని సమగ్ర ఆవిర్భావమునకు ప్రతీకగ మానవుడీ

భౌతిక ప్రపంచమున సూక్ష్మాతి సూక్ష్మము నుండి స్థూలాతి స్థూలమువరకు అసంఖ్యాములైన ఈ అన్నిరూపములతో ఉన్నాడు. అత్యంత బాహ్యపరిధి నుండి అత్యంత అంతర్గత కేంద్రము, లేక సున్నవరకు గల పూర్ణవృత్తమున మానవుని అస్తిత్వము సూచింపబడినది. మనవుని అస్తిత్వమును, భగవంతుని ఆవిర్భావమును నిజమునకు ఒకటియే. కావున దైవసాక్షాత్కారమనగా ఆత్మ సాక్షాత్కారమే. ఆత్మసాక్షాత్కారమనగా దైవసాక్షాత్కారమే. విశ్వము అదే బిందువు (శూన్యము) నుండి పరిణామక్రమమున ఆవిర్భవించెను. అట్లే మానవుని ఉనికి కూడ ఆ బిందువు నుండియే పెంపొందినది.

ఎల్లప్పుడు ఏదో ఒకరీతిలో మతోత్సాహము ఇనుమడించుచున్న దేశమునకు మనము చెందియున్నాము. మనము ఏ సత్‌పదార్థమునుండి వచ్చితిమో దానితో ఐక్యత పొందుటకు శిక్షణ పొందితిమి. ఆ అనంతముయొక్క సారమే మనకు సంక్రమించినది. భగవంతుడు మనుష్యునియందున్నాడని చెప్పుదురు. మనము దివ్యత్వముతో సమానముగా గమనము సాగిస్తూ దానిని మానవ మార్గముతో కలిపినప్పుడే మన అంతిమ ప్రయోజనము నెరవేరును. మొదట చెప్పిన విధముగ సృష్టిమూలమున మానవత్వము దివ్యత్వమును పోలియుండెను. సృష్టి పరిణామక్రమమున క్రియప్రతిక్రియలచే ఏర్పడిన కుదుపుల ఫలితముగ అది స్థూలరూపమును దాల్చెను. దివ్యత్వముతో ఈ సంబంధమును పరిరక్షించుటకు మానవ నిర్మాణమందలి భాగములన్నిటిని వాటి మొదటి సమత్వ, ప్రశాంతస్థితికి తీసుకొని రావలసినదే. వాటియందు సరియగు మితత్వమును ప్రవేశపెట్టుటవలన ఇది సాధింపనగును. మనము సహజమార్గమున చేయునది ఇదియే. నిత్య ధ్యాన సాధన యొక్క లక్ష్యము మితస్వభావము లేకుండుటను తొలగించుట. తద్వారా సంకల్పముతో సమత్వస్థితిని కాపాడుకొనవచ్చును. ఈ రీతిని మనయందలి మానవత్వము దివ్యత్వముగ పరిణమించుట ఆరంభమగును. మానవదైవీకరణ అనుదాని సరియైన అర్థము నిజముగ ఇదియే. ఇది జరిగిన పిమ్మట సమాంతరత్వము మాయమయి ఈ రెండును దివ్యత్వము, మానవత్వము – ఇంచుమించు ఒకటే అగును. శరీరము ఉన్నంతవరకు మానవత్వమెన్నటికిని పూర్తిగా నిర్మూలనము కాదు. ఆ రీతిగా సహజమార్గ పద్ధతిలో ధ్యానఫలితముగ మానవ మార్గమున పనిచేయుచున్న శక్తి తీవ్రతను క్రమముగ తగ్గించుచూ పోవుదుము. దివ్యత్వము ఆవిధముగ పెరుగనారంభించును. సమానాంతరత తగ్గనారంభించును. వేరొకవిధముగ చెప్పవలెనన్న మానవత్వము దివ్యత్వముతో పూరింపబడి, ఆ దివ్యత్వమే కాలక్రమమున అంతటనూ వ్యాపింపనారంభించును. పరిస్థితులు పూర్తిగా కుదురుకున్నప్పుడు, సమాంతరతపోయి, మానవత్వము దాని సృజనశక్తితోపాటు గుర్తింపరాని స్థితికి క్షీణించును. ఈ రీతిగ భగవంతుడు అనంతుడుగాన మానవుడు అత్యున్నత స్థాయినుండి కూడ మానవత్వము యొక్క పరిధిలోనే ఆవిధముగ ఉన్నాడు. మానవపరిమితులను దాటినంతటనే ఆత్మ వ్యాకోచము అపరిమితమై ఈ విశ్వమంతయు తనయందే ఉన్నట్లు కనిపించును. అపుడు విశ్వమందు ఎచట ఏతాకిడి కలిగినను అది తన హృదయమున ప్రతిధ్వనించును. ప్రకృతి యందలి సమస్తము ఆయన ప్రత్యక్షజ్ఞానము నందుండును.

## సాక్షాత్కారము – సాక్షాత్కార మార్గములు :

అనాదిగ ముఖ్యముగ భారతదేశమున మానవ ప్రయత్నము (పురుషార్థము) మరియు ఉనికికి దైవసాక్షాత్కారమే పరమావధి అని చాటిచెప్పబడుచుండెడిది. దైవము (అంతిమ సత్యము) వలెనే భగవత్సాక్షాత్కారము అను భావనకూడ నిగూఢ రహస్యకోశములలో మణగియుండెను. ఇందువలన వివేచనాపరుడు ఆ మాట వినినంతనే విసుగుచెంద మొదలిడును.

ఋషులు అనేకులు భగవత్ సాక్షాత్కారస్థితిని అనేక విచిత్రరీతులలో నిర్వచించియున్నారు. కాని నా ఉద్దేశ్యములో నిర్వచింపగలిగినట్లయితే అది సాక్షాత్కారము కాదు. అది వాస్తవమునకు వివరింప వలుకాని యొక మూగస్థితి. బాహ్య అంతరములో కాంతిని చూచుటగాని, భావించుగాని సాక్షాత్కారమెన్నటికినిగాదు. నా అభ్యాసపు తొలిదినములలో నేను తరచు కాంతి యొక్క దర్శన అనుభూతి పొందుట జరిగినది. కాని అది నాకు లక్ష్యముకాదు గాన నా గురుదేవుని మెలకువతో గూడిన సహాయమున నేను పురోగమించితిని. నిజముగ అది రుచిలేని స్థితి. మార్పులేనిది, మరియు స్థిరమైనది. ఆ పదము యొక్క సామాన్యఅర్థమున మనోహరత్వము, ఆకర్షణ, అందము అచట లేవు. అట్టిదానిని సాంగ్–ఇ–బేనమక్ (ఉప్పదనము లేని ఉప్పు) అని వర్ణించుటయే సంరియైనది కాగలదు. సాక్షాత్కారస్థితిని పొందియున్నావాడు ఆధ్యాత్మికరంగమున అజేయమైన సంకల్పము పెంపొందించుకొనును.

సాధారణముగ విద్వాంసులు తమ పాండిత్యముపై ఆధారపడి సాక్షాత్కారము, లేదా దాని స్థితులనుగూర్చి తమ అభిప్రాయమును వెల్లడింతురేగాని వారి స్వంత పరిశోధనాజ్ఞానముపై ఆధారపడికాదు. అదియే యదార్థమైనది. ఆ కారణముగా సాక్షాత్కారమనునది ఒక ఆధునిక కళగా మారినదని చెప్పుటకు విచారించు చున్నాను. వాస్తవమునకు సత్‌పదార్థము వారి అభిరుచులకును, నేర్పునకును అనుగుణ్యముగ దాని వన్నెలను బయటకు విడిచిపెట్టి అది అట్టడుగునకు కృంగిపోయినది. తత్‌ఫలితముగ ప్రజలు ఆ రూపములపైననే దృష్టిని కేంద్రీకరింప మొదలిడి, ఆధ్యాత్మికతయుకాదు, సత్‌పదార్థముకాదు అనునంతవరకు నిమగ్నమైరి. దివ్యజ్ఞానము జాగరూకమై యదార్థముగ సాక్షాత్కారము పొందనివారికి ఆ విషయమును ప్రాస్తవించుటకైననూ హక్కులేదని నా విశ్వాసము. ఈ సమస్యా పరిష్కారమునకు ఆచరణతోకూడిన జీవితము మాత్రమే కావలసియున్నది.

సాక్షాత్కారము వేల సంవత్సరముల పర్యంతము మానవునకు అరుదుగ ప్రసాదింపబడు శాశ్వతస్థితిగ నిర్వచించుట ఉచితము. కాని సంపూర్ణముగ సాక్షాత్కారమును పొందిన గురుదేవుడు లభ్యమైనచో, మరియు అభ్యాసికూడ దానియందు తీవ్రమైన ఉత్సాహము, ఆతురత కలవాడైన అది సులభముగ పొందసాధ్యము. కాని "ఉన్నది" (అస్తిత్వము) అను భావమున్నంత వరకును అది పూర్తి సాక్షాత్కారముకాదు. అందువలన ఆనందముకూడ లోపమే.

సాక్షాత్కారమనగా ఏమియో మొదట తెలిపిన తరువాతనే పూజ ప్రారంభింతుమని నాతో చెప్పుదురు. ఇది ఎట్లున్నదనగా "తొలుత షేక్‌స్పియర్ లేదా మిల్టన్ భావములను గ్రహించిన పిమ్మటనే అక్షరములు నేర్చుకొన ప్రయత్నింతును" అని చెప్పినట్లుండును. "భగవంతుని సాక్షాత్కారము పొందనివ్వండి. తరువాతనే ఆయనను పూజింప మొదలిడుదును" అని ఒక అభ్యాసి అన్నట్లుండును. అన్వేషించునదియే నీకు దొరికినప్పుడు, పూజింప నీకు అవసరము లేదు. తాను తక్కువ స్థితియందు ఉంటిని అన్న గుర్తింపును తానే సృష్టించుకొన్నవారు మాత్రమే ఉన్నతస్థితిని పొందగలడు. భారతీయతత్వ సాంప్రదాయమునందు ఆధ్యాత్మిక అసంతృప్తియే దార్శనిక కృషికి ప్రారంభదశయని సరిగ గుర్తింపబడుచున్నది.

దివ్యపురుషుని మూర్తిమత్వముయొక్క ఉనికి వలన ఈనాడు సాక్షాత్కారము మిక్కిలి సులభమైనది. సామాన్యముగ ప్రజలు ఆలోచన మోక్షమువరకే పరిమితము. దానిని దాటి వెళ్ళరు. దానినే వారు మానవుని తుదిగమ్యము అనిభావింతురు. కాని అది పొరపాటు. నిజమునకు దైవీయమార్గమున మోక్షము మిక్కిలి తక్కువ స్థితులలో ఒకటి. కావున అది పిల్లలు ఆడుకొను ఆటవస్తువు వంటిది. తదుపరి సాధించవలసినది ఇంకనూ

ఎంతయోకలదు. అనంత మహాసాగరము ఇంకనూ ముందున్నది. దాని వ్యాప్తి అపరిమితము. దానియందు మాత్రమే నీ దృష్టిని లగ్నముచేసి దానినే తప్పక గుర్తించుటకు ఇంకా ఇంకా ముందుకు సాగవలెను.

నిర్వికల్పసమాధికూడ యోగస్థిఇయే. కాని అది సమస్యను పరిష్కరింపజాలదు. ప్రాపంచిక కార్యములు, బాధ్యతలయందు ఒకడు ఎంత నిమగ్నుడైనను సరే ప్రతిక్షణము శుద్ధము, సరళము, అయిన సత్‌పదార్థముతో సంబంధము కలిగియుండుటయే వాస్తవమైన సమాధిస్థితి. అది సహజసమాధి. అది పొందనగు అత్యున్నత స్థితి. అదే నిర్వాణమునకు మూలము. దీని సుగుణములను వర్ణింపశక్యము కాదు. ఎవడు దానియందు నిష్టుడై యుండునో అతడే దానిని సాక్షాత్కరించుకొనును. అది దాని పేరు సూచించినంత సులభము కాదు. కబీరు మహనీయునిచే ఇది మిగుల ప్రశంసింపబడెను. అదియే పొందదగినది.

సాక్షాత్కారమునకు అనేక ఉపాయములు, సాధనములు నిర్ణయింపబడినవి. అందుండి నిశ్చయముగను, శీఘ్రముగను ఫలితము నిచ్చుదానిని ఎన్నుకొనవలెను. అది ఏదైనదీ ఎవరికి వారే నిర్ణయించుకొనవలెను. సూచన ప్రాయముగ ఈ విషయమున స్వామి వివేకానందుని విజ్ఞతాపూర్వకమగు అభిప్రాయమును నేను ఒప్పుకొందును. అది మనుష్యుని అత్యున్నతస్థితికి విజయవంతముగ కొనిపోగలది రాజయోగము మాత్రమే. తన అంతశ్శక్తులను ప్రాణాహుతిద్వారా వినియోగింపగల సమర్థుడే మార్గదర్శి, లేక గురువుగా ఉండుటకు అర్హుడు. హఠయోగము ఆజ్ఞచక్రము దాటి వెళ్ళజాలదు అని నేను ఖచ్చితముగ చెప్పగలను. అంతేకాక దానియందు వేరొక తీవ్రమగు లోపముకూడ కలదు. హఠయోగవ్యాయామము ప్రారంభించినప్పుడు కృషితో పాటు “నేను” అన్నభావనకూడ నిరంతరము ఉండును. అప్పుడు అహంకారము క్షీణించుటకు బదులు వృద్ధి పొందుచుండును. రాజయోగమున అట్లుగాక నిర్విరామముగ పనిచేయు చిత్తవృత్తులను ప్రశాంతపరచుటకు అతడు సూక్ష్మాతి సూక్ష్మములైన ఉపాయములను అవలంబించి పురోగమించుచుండును. అంతేగాక ఈ సాధన చేయునపుడు అతడు తన దృష్టిని అత్యంత సూక్ష్మమైన దానియందు నిలుపుటవలన శారీరకభావన నిరంతరము దూరముగ నుండును.

సూక్ష్మతత్వమును సాక్షాత్కరింప చేసికొనుటకు అట్టివేయగు సున్నితమును, సూక్ష్మమును అగు ఉపాయములను అవలంభించవలెను. సరళమగు సమస్యను పరిష్కరించుటకు జటిలమగు పద్ధతిని ఉపయోగించినప్పుడే చిక్కులు తలెత్తును. అనగా అట్లు చేయుట ఒక చిన్న సూదిని పైకెత్తుటకు పెద్ద క్రేను (బరువులను ఎత్తు, దింపు యంత్రము)లను ఉపయోగించుట వంటిది యగును. భగవంతుడు సరళుడు. సరళములైన పద్ధతులతోనే తెలిసికొనబడగలడు. కావున ఆయనను పొందుటకకు మన ఇచ్ఛ, క్రియ, పరిసరములచే సృష్టింపబడిన వాటినుండి ఎట్లు విముక్తులముకాగలమో అందులకు అనువైన పద్ధతులనే అవలంభించవలెను. మన ఆలోచనలన్నిటిని క్రమబద్ధము చేయవలెను. మరియు వ్యక్తిగత మనస్సును దానిపైనున్న భారము నుండి విముక్తి చేయవలెను. సమర్థుడైన గురుదేవుని సహాయముతో ఒకే ఒక త్రోపున భగవంతుని వైపునకు ఎగురగలుగునట్లు మనము దూదిపింజలయంత తేలికగ తయారుకావలెను. మన సంస్థలో సంకల్ప శక్తియొక్క ప్రథమ తాకిడిచే అభ్యాసి హృదయమున సత్‌పదార్థము ప్రవేశపెట్టబడును. నికలడమీద అదియే బీజముగ పనిచేయును. ఈ బీజము సులభముగ పెరుగుటకున్నూ, మండుగాలులు దాని దగ్ధము చేయకుండుటకున్నూ గురువు సత్‌పదార్థమును ప్రవేశపెట్టుటను ప్రారంభించును. దానిని అభివృద్ధి చేయుటకు సాక్షాత్కార మార్గమున నిరంతర స్మరణయే శరణ్యము.

## గృహస్థాశ్రమము :

జీవిత లక్ష్యమును సాధించుటకు కుటుంబజీవితము ఆటంకమేమియుకాదు. ఉన్నత స్థితులను సులభముగా పొందుటకు గృహస్థాశ్రమమే అన్నింటికంటె మేలైనదని నేను అనుకొందును. నేను గృహస్థుడను. మా గురుదేవులు కూడ గృహస్తులే. గృహస్థాశ్రమమందే పూర్ణుడగు యోగి లభించునని నేను రూఢిగా చెప్పగలను. మనము మన విధులను నిర్వహించుకొనుచు ఆయననే (దైవమును) అంతిమ సత్పదార్థముగ స్మరించుకొందుము.

# పంచమ అధ్యాయము

# సాక్షాత్కారము – సాధకుని పాత్ర

---

## వైరాగ్యము :

మనము వైరాగ్యమును అలవరచుకొననిదే మాయ నుండి ఎన్నటికిని విముక్తులము కాజాలము అనుట యదార్థము. అట్లు అనుటచే గృహము, కుటుంబము, అన్ని ప్రాపంచిక సంబంధములతో తెగత్రెంపులు చేసుకొని సన్యాసజీవితము నవలంభింపవలెనని దీని అర్థముగాదు. గృహము, కుటుంబమును విడిచిపెట్టియు ప్రాపంచిక బంధనములను అన్నిటిని విసర్జించి ఏకాంతస్థలమునకు నిష్క్రమించుటయే వైరాగ్యమును అలవరచుకొనుటకు ఏకైక మార్గము అను అభిప్రాయము కలవారితో నేనేకీభవించను. అట్లు నిర్బంధ పద్ధతులచే కలిగిన వైరాగ్యము యదార్థముకాదు. ఏలయన వారు ప్రపంచము నుండి నిర్బంధముగ తెగత్రెంపులు చేసుకొన్నట్లు కనబడినప్పటికిని అంతర్గతముగ వారు ఇంకను దానిని అంటిపెట్టుకొనియుందురు. గృహస్థులమగు మనము నిస్సందేహముగ అనేక విషయముల యందు శ్రద్ధ వహించవలెను. మన కుటుంబమును పోషింపవలెను. మన పిల్లల చదువునకు ఏర్పాటు చేయవలెను. వారి కోరికలను, అవసరములను తీర్చవలెను. మనము వారిని శీతోష్ణముల నుండి కాపాడుట, మొదలగునవి ఎన్నియో చేయవలెను. ఇట్టి అవసరములకొరకు డబ్బును, ఆస్తిని సంపాదించవలెను. మనము సంబంధము కలిగియున్న వాటిపై అంత్యంత అనురాగము పెంచుకొనుటయే నిజమైన కీడు. ఇదియే మన బాధలకు ముఖ్యకారణము. రాగద్వేషములు ఏవియూ లేక జీవితములో ప్రతి కార్యము, మన కర్తవ్యమని తలచి చేయగలిగియున్నచో మనము ఒక విధముగా ప్రాపంచిక బంధనములనుండి విడుదల పొందినట్లే. మనము పెక్కు వస్తువులను కూడబెట్టి వాడుకొనుచుండినను లోకమును పరిత్యజించినట్లే. అప్పుడు మనవద్దనున్న ప్రతిదియు మన ధర్మమును నిర్వర్తించుటకై సర్వేశ్వరుడు ఇచ్చినట్టి ఒక పవిత్రనిధి అనిపించును. నిజమునకు వైరాగ్యము అనగా ప్రాపంచిక వస్తువులపై వ్యామోహము లేకుండుటయే కాని వస్తువులను కలిగియుండకపోవుట కాదు. గృహస్థ జీవితమున సంపదలు, ప్రాపంచిక బంధములు అతి ఆవశ్యకములు. తనకు సంబంధమున్న వస్తువులతో తగని రీతి వ్యామోహము లేనప్పుడు మాత్రమే గృహస్థ జీవితము వైరాగ్యమునకు గాని, తుదకు సాక్షాత్కారమునకు గాని ప్రతిబంధకముగాదు. జీవితకాలమంతయు గృహస్థ జీవితమును నడుపుచునే పరిపూర్ణత్వమును పొందిన మహాత్ముల దృష్టాంతములు పెక్కుగలవు. వైరాగ్యమనునది నిజముగా మనస్సు యొక్క అంతర్గతమగు స్థితి. అది వస్తువులయొక్క క్షణభంగురత పరివర్తన శీలతలను మన దృష్టికి తెచ్చి నిర్ వ్యామోహభావమును కలిగించును. విరాగియగువాని దృష్టి పరివర్తన రహితమును, శాశ్వతమును అగు సత్‌పదార్థము మీదనే సదాలగ్నమై యుండును. అతనికి రాగ, ద్వేషభావములుండవు. వాస్తవమునకు వైరాగ్యము అనగా ఇదియే. మానసికముగా మనమిట్టి స్థితిని పొందినప్పుడు కోరికల నుండి విడుదల పొందిన వారమగుదుము. ఉన్నదానితో మనము తృప్తిపొందుదుము. కోరికలు అంతము పొందుటతో సంస్కారములు ఏర్పడుట నిలిచిపోవును. మన జీవితకాలములో పూర్వసంచిత సంస్కారములను అనుభవించి పోగొట్టుకొనుటే

ఇక మిగిలియున్నది. అవి ఈ జీవితములో సమసిపోవలసి ఉన్నది. మన కోరికల వలనను, కర్మలవలనను, కలిగిన సంస్కారములను కారణ శరీరము నుండి తొలగించుటకు వలసిన "భోగ్" సృష్టించి ప్రకృతికూడ ఈ కార్యమునందు మనకు చేయూతనిచ్చుచున్నది. ఈ పొరలు కరిగిపోయినప్పుడు మనము సూక్ష్మరూపముతో కూడిన అస్తిత్వము పొందనారంభింతుము.

ఈ లోకమున జన్మించిన మానవుడు దుఃఖములను చవిచూడక తప్పదు. వీనినుండి తప్పించుకొనజాలదు. నేనీ ప్రపంచమును చూచినప్పుడు అది దుఃఖభూయిష్టముగా కనపడును. బాధలతో మూలుగువారు కొందరు, ప్రేమపాత్రులను కోల్పోయి బాధను పొందువారు కొందరు. అనేకులు ప్రతి సందర్భమునందు విజయమునే పొందుటకు ఆతురత పడుచున్నారు. తపస్సు లోనికిపోయిన ఈ కష్టములను తప్పించుకొనుటకు ప్రయత్నింతుము. ఋషులు తమ జీవితమును పూర్తిగ దీనికే వినియోగించిరి. వ్యామోహమువల్ల పుట్టినది ఎల్లను దుఃఖమే. సుఖదుఃఖములు రెండును బాధలనే కల్గించును. పరిశుద్ధమైన భగవత్ భావమునకు మనలను అర్పించుకొనుట తప్ప ఈ దుఃఖములను అధిగమించుటకు వేరొక పరిష్కార మార్గములేదు.

మనము ప్రపంచమును పరిత్యజించి తపమొనర్చుటకు అరణ్యములకేగనవసరము లేదు. ఐహికజీవితము, ఆధ్యాత్మిక జీవితము సమానముగ ప్రకాశించునట్లు ప్రక్క ప్రక్కననే కొనసాగవలెను. గృహస్థ ధర్మములను నిర్వర్తించుచు భగవత్ సాక్షాత్కారమును పొందినట్లయితే అతనికి ఏ విధముగను నష్టము లేదు. మనము విజయము సాధింపవలెనన్నచో రెండు రెక్కలతో ఉన్నతి గాంచవలెను. భగవంతునని అరణ్యములలో అన్వేషించుట అను సాధారణ ప్రజాభిప్రాయము అస్పష్టమైనది. ఆయనను హృదయమునందే అన్వేషింపవలెనని నా అభిప్రాయము. ఒకడు గృహస్థ ధర్మములను నిర్వహించుచు, అదే సమయమున భగవత్ భక్తియందు కూడ అంతే శ్రద్ధ కలిగియున్నాడు. ఈ రెండును పరస్పరము పొత్తు కుదరనిపని, విరుద్ధములైనవని మీరు అనవచ్చును. కాని అది సరికాదు. క్రమమున దివ్యజ్ఞానము పనిచేయనారంభించును. అప్పుడు అతడు అతీత మనస్సు నుండియే తన విధులను నిర్వర్తించును.

ఆ విధముగ దివ్యత్వమువైపు సంపూర్ణముగ మరలినపుడే వైరాగ్యము పొందగలడు. అట్లు జరిగిననాడు తనకు సంబంధముగల విషయములతో బాటు తనయందును సహజముగనే వ్యామోహరహితుడగును. ఇట్లు అతడు శరీర చైతన్యమును కోల్పోవుటయేకాక ఆత్మచైతన్యమును కూడ కోల్పోవును. ఇక మిగిలియున్నదేమనగా "మరణరూపమున జీవించుట లేక జీవించుచునే మృతుడగుట".

## ధ్యానము :

సహజమార్గ సాధనయందు పతంజలి యోగమండలి ఏడవ అంగమైన "ధ్యానము"తో ప్రారంభించి ధ్యానసాధన చేయుటకు మనస్సును ఒకే విషయముపై లగ్నముకావింతుము. దానిముందున్న అంగములను ప్రత్యేకముగ తీసికొనము. ధ్యానముతో పురోగమించునపుడు వాటి అంతట అవియే ఆచరణలోనికి వచ్చును. ఆవిధముగ మనకాలము, శ్రమ, చాలవరకు కలసివచ్చును. కొన్ని సంస్థలయందు సాధన క్రమమును తరచు రహస్యముగ ఉంచెదరు. లాంఛనముగ వారితో చేరపూనుకొనిన వారికి మాత్రమే బయటపెట్టుదురు, బోధింతురు. ఆంతరికముగ వారి ఉద్దేశ్యమేమియో మనకేమాత్రము అర్థముకాదు. ప్రకృతికి రహస్యములు ఏమియులేవు. అట్లే దైవీయమార్గమును అనుసరించువారికి రహస్యమనునది ఉండరాదని నేను అనుకొందును.

హృదయముపై ధ్యానము చేయుట మన సంస్థలో అనుసరించు పద్ధతి. పతంజలి మహర్షియు ఈ విధానమునే ప్రబోధించెను. దానియందు గొప్పతత్వము ఇమిడియున్నది. మనము ఎల్లవేళలయందును ప్రాపంచిక విషయములయందు నిమగ్నులమై ఉందుము. మనము ఏమి చేయుచున్నను విరామసమయమందు మన ఆలోచనలకు రెక్కలు వచ్చినట్లుండును. మనము ఎల్లప్పుడును కలకలములందును, అస్తవ్యస్థముగను ఉందుము. మన వ్యక్తిగత మనస్సు అటువంటి అవలక్షణములను అలవాటుపడియున్నది. అందుచే ప్రతి విషయమును మనము తలక్రిందులు చేసితిమి. మనకార్యములు, ఆలోచనలు మనతప్పుడు పనులయందు ఎక్కువ ప్రాధాన్యత వహించును. వివిధమైన భావములు, ఆలోచనలతో మనము సంబంధము కలిగియున్నప్పుడు అవి ఉద్వేగముతో నిండిన మన భావములపైనను, ఇంద్రియములపైనను, సంస్కారములను కలిగించును. అన్ని ఇంద్రియములు పాడై వక్రమార్గమును అవలంభించును. ఇంద్రియములపైబడిన గుర్తులు వానిని రాయివలె స్థౌల్యము కలిగించి జ్ఞానము లేకుండునట్లు చేయును. ఆత్మమీద దీని ప్రభావము నిస్సందేహముగ ఏమియులేదు. కాని ఆత్మచుట్టును కవచమువలె ఆవరించియుండు పొరలతో పట్టుపురుగు తనచుట్టు అల్లుకొన్న గూడువలె, ఆటంకములను మనమే సృష్టించుకొందుము. ఆత్మను సాక్షాత్కారింపజేసికొను సంగతి అట్లుండగా దానిలోనికి తొంగిచూచుటకైనను సాధ్యముకాదు. మనచెడ్డ యోచనలు, దుష్కర్మల ఫలితముగ మన విచక్షణ జ్ఞానము, సరియైన గ్రహణశక్తి నశించును. ఇట్టి స్థూలస్థితిని పొందినవాడు రాజయోగ పద్ధతిలో శిక్షణకు సమ్మతింపడు. కావుననే మనము చెప్పెడు దానిని ప్రజలు పెడచెవిని పెట్టెదరు. హఠయోగసాధన సాక్షాత్కారమును సాధించలేదు. ఏలన ఆజ్ఞన చక్రము తరువాత దాని శక్తి పనిచేయదు. అజ్ఞచక్రము తదనంతరము యింకను దాటవలసిన దశలు ఎన్నో ఉన్నవి. అందువలన రాజయోగము ఒకటియే మనలనుచివరవరకు కొనిపోగలదు. కేంద్రమును సమీపించుటకు వేరొక ఉపాయములేదు. మన తప్పుపనుల వలన చెడగొట్టబడినదైనను ఆ కేంద్రశక్తి మనయందే కలదు. ధ్యానమున మనము ఆ శక్తినుండియే పనిని స్వీకరింతుము. చెప్పవలెనన్న ఈ విధముగ మనము ప్రకృతిశక్తితో సహజముగ పురోగమింతుము. ధ్యానము చేయునపుడు మనయందున్న కేంద్రశక్తి కార్యనిరతియందుండును. దాని బలముచే మనలను గాఢముగా చుట్టుకొనుచున్న మేఘములు నిర్వీర్యము చేయబడి చెదరగొట్టబడుచున్నది. దానిని మాటలలో చెప్పలేము. అది అభ్యాసి మాత్రమే అనుభవమున గ్రహింపగలడు. ఇది ఆచరణవలన మాత్రమే తెలియగలదు. నీవు అనతికాలమందే నిరంతర ప్రశాంతత, ఆనందములయందు ఈదులాడుచున్నట్లు తెలిసికొనగలవు. సర్వమును ఇచట అంతమొందును. ప్రపంచముతో సంబంధమేమియు ఇక మిగలదు. మనస్సు సుశిక్షితముగ తనంతటతానే క్రమశిక్షణయందుండును. ఇంద్రియములు నీ అధీనమునకు రానారంభించును. నీకు వానిపై ఆధిపత్యము లభించును. నీపై నీవు ఆధిపత్యము పొందుట అనగా నీవు ప్రకృతిపై ఆధిపత్యము పొందినట్లే. మార్గము సుగమమైనపుడు ప్రకృతికార్యము నీ పరిధి పరిమితులలో యుండుట గమనింతువు. అపుడు నీకు నీవే పనిచేయుట ప్రారంభింతువు.

మన పద్ధతియందు అభ్యాసిని తన హృదయమునందు దివ్యజ్యోతి ఉన్నట్లు భావించి ధ్యానము చేయవలెనని సలహానిత్తుము. కాని అట్టి జ్యోతిని విద్యుత్‌దీపముగనో, క్రొవ్వువత్తివంటిదిగనో ఏదియో ఒకరూపము లేక ఆకారముగలదిగా చూడరాదని ఆదేశింతుము. అట్లు భావించినచో అచట కనబడు జ్యోతి యదార్థమైనదిగాక ఊహాకల్పితమైనదియే అగును. అంతర్గత దైవభావముతో అభ్యాసి జ్యోతి ఉన్నది అని కేవలము అనుకొని సాధన చేయవలెనని ఉపదేశింపబడును. అపుడు జరుగునదేమనగా మనము పొందవలసిన అతిసూక్ష్మమైన దానిపై ధ్యానింతుము.

హృదయమునందు దివ్యజ్యోతి ఉన్నదని తలంచుటయే హృదయముపై ధ్యానముచేయు పద్ధతి. ఈ విధముగ ధ్యానము చేయనారంభించినపుడు నీలోగల దివ్యజ్యోతి నిన్నాకర్షించుచున్నదని అనుకొనుము. ధ్యానమున ఆలోచనలు నిన్ను వెంటాడినచో వాటిని లక్ష్యము చేయకుము. వాటిని రానిమ్ము. కాని నీవు మాత్రము నీ పనియందే నిమగ్నుడవుకమ్ము. నీ ఆలోచనలు లేక భావములను ఆహ్వానింపబడని అతిథులుగా భావింపుము. అప్పటికిని అవి నిన్ను బాధించినచో అవి గురువుగారివే కాని, నీవికావని భావింపుము. ఈవిధమగు ధ్యానము చాలా ప్రయోజనకరమైనది. ఆశించిన ఫలితమును ఇచ్చుటలో ఇది ఎన్నటికిని విఫలము కాదు. ఉదయము ఒక గంట సుఖాసనము సహజముగ కూర్చుండవలెను. ధ్యానము మాత్రమే చేయవలెను. ధ్యాన సమయమున వచ్చెడు ఆలోచనలతో పెనుగులాడకుము. ఏకాగ్రత అనునది ధ్యానమువలన సహజముగను, అప్రయత్నముగను కలుగు ఫలితము. ధ్యానమునకు బదులు ఏకాగ్రతకొరకు పట్టుబట్టి తన మనస్సును దానివైపు బలాత్కరింతురేని – అట్టివారు సామాన్యముగ వైఫల్యమునే పొందుదురు.

సాయంకాలము మరల కనీసము ఒక అరగంట కూర్చుండుము. నీలోని పలువిధములైన, పూర్వపు ఆలోచనా ఫలితములు, సంస్కారములు, స్థూల్యత, ఘనత్వము కరగిపోవుచున్నవి, లేదా పొగరురూపమున నీ శరీరపు వెనుకభాగమునుండి హరించి పోవుచున్నదని భావింపుము. ఇది నీ మనస్సును నిర్మలము చేయుటకు తోడ్పడును. మరియు మన సమర్థగురుదేవుల అఖండ ప్రభావమును గ్రహించుకొనుశక్తిని కలుగజేయును. నీయందలి కాలుష్యములన్నియు తొలగింపబడినవి. నాకు తెలియగనే దానిని మరియొక విధముగ మార్చుటగాని లేదా దానిని నిలుపుమనుటగాని చేయుదును. ఈ విధముగా మనము చక్రములను, ఉపబిందువలను, మేల్కొలిపి, శుద్ధిచేయుటవలన అతివేగముగ ఉన్నతస్థాయిని అందుకొందుము. అంతమున కుండలిని చేపట్టుదుము. అభ్యాసికి దీనితో ఎట్టి ప్రమేయములేదు. అది ప్రత్యేకముగా గురువుగారి బాధ్యతయే. ఈ పద్ధతి నవలంభించునపుడు సాధకుడు తన మనస్సును అతిగ బలవంతముచేయక సహజముగా కూర్చొనుట మాత్రమే అని జ్ఞప్తియందు ఉంచుకొనవలెను. ఈ క్షాళన కార్యక్రమము ఉదయమునగూడ ధ్యానమునకు పూర్వము అయిదు నిముషములపాటు మరల చేయవలెను. సాధకుని అవసరములనుబట్టి ఇతరవిధములైన క్షాళన మార్గములను కూడ ఉపదేశింపవచ్చును. దానిని ఇచ్చట వివరింప పనిలేదు. క్షాళన ప్రక్రియ ఆలోచనలయొక్క మూలశక్తిని, మానవ సంకల్ప రూపములో వ్యక్తియొక్క ఆత్మను శుద్ధిచేయుటకు ఉపయోగించును. సూక్ష్మాతిసూక్ష్మమైన సారానికి ప్రతీకను సాక్షాత్కారము పొందే గహనము, దుర్గమము (నిటారు, జారుడు) అయిన మార్గాన్ని అధిరోహించుటకు అది సహాయపడును అని చెప్పినచాలును.

యోగులందరును "జ్యోతి" అను పదమును ఉపయోగించిరి. సత్‌పదార్థమును తెలుపుటకు అది అత్యుత్తమమైన పదము గనుక నేనును దానిని వాడకయుండలేను. కాని అది కొన్ని చిక్కులను సృష్టించును. ఏలయన మనము "జ్యోతి" అనగానే "కాంతి" అనుభావమే ప్రధానముగా కలిగి, మెరయునదిగా తీసుకొన నారంభించెదము. యదార్థమైన జ్యోతియందు అట్టిభావము ఏమియులేదు. మన విధానమునందు అభ్యాసి ఒక్కొక్కప్పుడు నిస్సందేహముగ కాంతిని దర్శించును. కాని తొలిదశయందు మాత్రమే పదార్థమునకు శక్తితో సంబంధము కలిగినపుడు మెరయుచున్న కాంతి కనపడును. మరియొక మాటలో శక్తి తన పనిని ప్రారంభించిన దనుటకు ఇది ఒక చిహ్నము మాత్రమే. నిజమైన జ్యోతి అరుణోదయవర్ణము కలది. లేదా వర్ణరాహిత్య స్థితియొక్క పేలవమైన ఛాయ. జ్యోతి అనునది దానికి సరియైన అనువాదము కానప్పటికిని (ఏలయన జ్యోతి, ఆ పదార్థము

యొక్క భారముకంటె నిజముగా అతిభారమైనది) కేవలము అర్థము చేసుకొనుటకు ఆవిధముగా చెప్పబడినది. సాధకుడు అంతకంతకును తాను తేలికయగుచున్నట్లు అనుభవింపమొదలిడినచో అతడు పురోగమించుచున్నాడని అర్థము. ఏలయన అతడు అపుడు భగవంతుడు ఉన్న స్థితిలోనికి పోవుచున్నాడు. తేలిక అనగా వ్యక్తియొక్క ఆలోచన భారము తగ్గిపోవుట. అట్లు యదార్థజ్యోతి నిజమైన వస్తువునకే అన్వయించును. ఇంకను సరిగా చెప్పవలెనన్న అది "ద్రవ్యరహిత ద్రవ్యము".

అభ్యాసియొక్క వాంఛలు, పూర్వమే ఏర్పరచుకొన్న అభిప్రాయములచే ప్రేరేపింపబడే కృత్రిమత్వము మరియు పెడత్రోవను పట్టించు ప్రాధాన్యత అనునవి అతడు తనను మార్చుకొనుటకు సైతము వీలులేనంత హానికరములగును. కావున కాంతిదృశ్యములు మున్నగువాటిని కృత్రిమముగా సృష్టించుకొనుట లేదా అట్టివి రావలెను అనుకొనుట పొరపాటు. ఇట్టివి సంభవించినపుడు కేవలము అవి గమనింపదగినవే కాని వాటియందు ఏవిధమగు వ్యక్తిగత వ్యామోహభావము కలిగి యుండరాదు. మనము వ్యక్తిగతముగా, కాంక్షింపదగినది అంతిమ లక్ష్యము మాత్రమే. అనగా సాక్షాత్కారము, దానినినే సర్వదా గాఢముగా మన దృష్టియందుంచుకొనవలెను. ప్రతి అప్రధానమైన మార్గమునకు వ్యతిరేకముగా విశ్వసనీయమైన హామీగా ఇది రూపొందును. రాజయోగ అభ్యాసముచేయు అనేకులు ప్రతియొక ధ్యానసాధన కాలమునందు ఆతురతతో ఎదురుచూచు ఏకాగ్రత కొరకు పట్టుబట్టుట అనునది, పైన చెప్పబడినట్లు హానికరమగు అపమార్గ ప్రాధాన్యతకు ఒక ఉదాహరణము. హిందూదేశ మందును, ఇతర దేశములందును యోగసాధన చరిత్రయందు ఇవి ఒక విధ్వంసక పాత్రవహించినది. మనోనిగ్రహమునకై సామాన్యముగ అవలంబించబడు తీవ్రనిష్టలు, తపస్సులు, శరీరమును కృశింపచేయు పద్ధతులు మనస్సును పెడత్రోవపట్టించు పోకడలను అరికట్టజాలవు. పైగా ఇట్టివి చెడుగులను లోపలనే అణచియుంచుటకు మాత్రమే ఉపకరించును. ఏ కారణము వల్లనైనను వానిపై యించుక అదుపు సడలినచో ఎపుడైననూ ఉధృతముగ పైకి ఉబుకును. ఈ సమస్యకు నిజమైన పరిష్కారము మనస్సును వశమందుంచుకొనుటకై అసహజముగ అణచుట, అదుపులోపెట్టుట, శోషింపజేయుటగాదు. కాని దానిని పెడత్రోవను పట్టెడు పోకడల నుండి విడుదల గావించి క్రమముగ రూపొందించుటయందే కలదు. మనఃపూర్వకముగ నడచుకొను సాధకుడు ప్రతి విషయమును గ్రహించుకొనుచు, ప్రతిదానిని పనిచేయుటకు సహజముగ అభివృద్ధి పొందుటకు వీలు కల్పించును. అతని వైఖరి దీనియందును, తదితర విషయములందును, శీఘ్ర ప్రగతిని సాధించుట తప్పక జరుగునట్లు చేయును.

సామాన్యముగ గుండె కొట్టుకొనుటను నీవెక్కడ గుర్తించెదవో ఆ హృదయస్థానమున ధ్యానము చేయుమని నేను సలహానిత్తును. నాసికాగ్రము, భ్రూమధ్యము, మున్నగు చోటులందు దృష్టిని నిలిపి ధ్యానము చేయవచ్చును. కాని నా అభిప్రాయమున హృదయముపై ధ్యానము సులభమేకాక మిక్కిలి ప్రయోజనకరమైనది. హృదయముపై ధ్యానముచేయుటయందు గొప్పతత్వము ఇమిడియున్నది. హృదయము రక్తప్రసార కేంద్రము. ఇది శుభ్రపడిన రక్తమును, దేహమందలి అన్ని భాగములకును, అతిచిన్న కణములకును పంపును. మనము ఇప్పుడు ధ్యానముకొరకు హృదయమును కేంద్రముగా తీసికొంటిమి. శరీరమున ప్రవహించు రక్తము ప్రభావితమైనది. మన యోచనలు, కర్మలవలన ఏర్పడిన స్థూల్యము కరిగిపోవుట ప్రారంభమగును. హృదయముపై ధ్యానము చేయు పద్ధతివలన తొలిదినముననే మనకు లభింపమొదలిడిన ప్రప్రథమ లాభము ఇదియే. ఇది బీజస్థానము. అది ఎటువైపు మరల్పబడినను అచట స్పందన క్రియను సృష్టించును. మనస్సు పనిచేయుటకును, యుక్తాయుక్త

వివేకము కలుగుటకును, ఇదియే రంగస్థలము. దివ్యశక్తి అవతరించుటకు ఇచటనే సూక్ష్మశక్తి పనిచేయును. మన ఆలోచన దానితో ఏవిధముగ కలిసినను లేదా సరియగు దానిని ప్రవేశింపచేయు శిక్షణనిచ్చి సత్‌పదార్థము వైపు మరల్చినను, సమస్య పరిష్కారమగును. ధ్యానము చేయుట అవసరమేమని అడుగుదురు. సమాధానము స్పష్టము, సులభము ధ్యానము వలన వ్యక్తిగత మనస్సు తాను అలవర్చుకొన్న చంచలస్వభావమును వీడి, మనము ఒక స్థానమున నిలకడ చెందుదుము. ఈ అభ్యాసముచేత వ్యక్తిగత మనస్సును సరియైన మార్గమున పెట్టుదుము. ఏలయన అది ఇప్పుడు తన అలవాట్లను మార్చుకొనుచున్నది. ఇది జరిగినపుడు మన ఆలోచనలు సహజముగ అపమార్గమున పట్టవు. సజీవ, నిర్జీవ పదార్థముల కలయిక సంబంధము, అతిస్పష్టముగ అనుభవమునకు వచ్చు స్థానము హృదయమే. ఆ కారణముననే హృదయముపై ధ్యానము అత్యంత ప్రయోజనకరమైనది. అంతగాక హృదయము మనస్సునకు రంగస్థలము. మనస్సు ఎల్లప్పుడు దాని స్వభావము కనపరచుచుండును. మనస్సునకు కార్యస్థానమైన హృదయమును సరిచేయవలెను. ఊర్ధ్వముగగాని అధోముఖముగ గాని ప్రవాహమెచ్చటి నుండి ప్రవహించునో అట్టిస్థానమే ధ్యానమునకు సరియైనది. అది హృదయమేకాని అన్యముకాదు. ధ్యానమునకు త్రికుటిని (భ్రూమధ్యమును) కూడ గ్రహింపవచ్చును. కాని సాధకుడు అధికముగా శ్రమింపవలసియున్నది. కాన అది సామాన్యులకు సులభమైనదికాదు. ధ్యానము సక్రమముగా చేయకున్నచో ఇది కాలక్రమమున కొన్ని చిక్కులను కలిగించ వచ్చును. నాభిస్థానమున ధ్యానము మనస్సును ఇంద్రియవాంఛలను బలవత్తరము గావించి ఉద్రేకములు కలుగచేయుట తప్ప దానికి ఆధ్యాత్మికముగా విలువలేదు.

సాధకునియందు విశ్వాసము పెంపొందిన తర్వాత ఒకదశలో మనము సామాన్యముగా మానవాకారముపై ధ్యానము చేయుటను నొక్కి చెప్పుదుము. ఆధ్యాత్మికోన్నతికి ఆత్మహత్యా సాదృశ్యమని విమర్శకులు అనుకొనవచ్చును. ఏ వ్యక్తిపై ధ్యానము చేయుదుమో ఆయన విలక్షణమైన సామర్థ్యము కలిగినవారయి ఉండి "భౌతికేతర కేవలము" (Immaterial Absolute) నుండి దిగివచ్చినవారై, అత్యుత్తమ ఆధ్యాత్మిక శిక్షణ ఇవ్వడానికి, పరిణామదశలో ఉన్నతోన్నత స్వయంకృషి ద్వారా ఆధ్యాత్మిక ప్రమాణము సాధించినవారు అయిన ఎడల ఆ విమర్శన సరికాదు.

## ధ్యానమునకు పూర్వరంగము :

మానవునియందు మూలమునకు పోవలెనన్న సంకల్పము రేకెత్తినపుడు అతనియందు ఉద్భవించిన క్రియాశీలతను అతడు సాధ్యమగునంతవరకు నిద్రాణస్థితికి కొనిరావలసిన ఆవశ్యకత కలిగెను. ఇందులకు అతడు ఉపాయములను అన్వేషింపసాగెను. గుప్తచలనశక్తి తాను సంబంధము కలిగియున్న పరతత్వముకంటెను స్థూలముగనున్న కారణమున తాను ఆశించిన సత్‌పదార్థము పొందుటకు అంతకంటె స్థూలమైన దానికి ఆధారముగ గ్రహించవలసియున్నదని తుదకు అతనికి తోచినది. ఇది అతనికి ప్రళయకాలమునందు ఏర్పడు సంకోచస్థితివంటి దానిని తనలో సృష్టించుకొనవలెనను నిశ్చయమునకు దారి తీసినది. సామూహికముగ సృష్టిని వీక్షించినపుడు ఆత్మసృష్టియందు అంతటను వ్యాపించియున్నట్లే అది మానవునియందును సర్వవ్యాపిగా నున్నది. సంకోచము ప్రారంభమైనపుడు ప్రళయస్థితి ఆసన్నమగును. మనుజునియందును అట్టి సంకోచము వ్యక్తిగత ప్రళయమునకు దారితీయును. అనగా అతడు తన స్థూలస్థితి నుండి నిజస్థితికి పోవుటకు ప్రారంభించినాడని అర్థము. దాని ఊర్ధ్వప్రవృత్తి కారణముగ సంకోచము ఎల్లప్పుడును క్రింది భాగము నుండి బయలుదేరి క్రమముగ ఊర్ధ్వముగ కొనసాగును. కావున అతడు ఊర్ధ్వముగ పోవటకు క్రిందినుండియే సంకోచము

ప్రారంభింపవలెను. కాళ్ళను ఆటి సంబంధ భాగములను ఒకతీరున తెచ్చి వాటిని నిశ్చలముగ నుంచుటయే అట్టి సంకోచ రూపమగును. ఏ పద్ధతిలో అయిననూ ఆకృతిమాత్రము ఆసనము అగును. మన అంతిమలక్ష్యము చేరుటకు మార్గమును ఇది సులభము గావించునది గాన ఇది ఆవశ్యకము. ఈ ఆసనమెల్లప్పుడును ఒకేవిధముగ నుండవలెను. కారణమేమన అతడు తాను పొందదలచిన ప్రత్యేక లక్ష్య సాధనకు తొలుతనే చేపట్టిన ఆ మహాశక్తితో ఈవిధముగ సంబంధము కలిగియుండును. సత్‌పదార్థముతో సంబంధము కలిగియున్న ఈ రూపము ప్రాథమిక దీక్షయందు అతనికి ఎంతయో తోడ్పడును.

పూర్వకాలమునుండియు, ధ్యానమున వెన్నెముక, మెడ, శిరస్సు ఒకే వరుసను వంకరలేనట్లు నిలువుగ కూర్చుండుట చాలా ఉపయోగకరముగ నుండునని తలచుచుండిరి. ఏలయన ఆ భంగిమలోనున్న అభ్యాసి మీదకు భగవత్‌కృప నేరుగా ప్రవహించునని విశ్వసింపబడుచున్నది. మన సాధన విధానమునందు ఈ విషయమును అంతగా పట్టుబట్టము. సహజమైన సులభరీతిని కూర్చుండుడని నేను సాధకులకు సలహా నొసంగుదును. అంతియే గాకుండ బిగువుగ వంకరలేని రీతినిఉండు వారైనను ధ్యానమందు ఆనంద నిమగ్నస్థితి మొదలైనపుడు తమంతతామే విధేయతా భావము కన్పట్టుతీరున ముందునకు కొంచెము వంగుట కనుగొనెదము. ఉన్నతచైతన్య స్థితులలోనికి ఆరోహించుటకు కూడా యిది చాలా సహజము అయినదని భావించవచ్చును. యదార్థమునకు అమూల్యమైన ఈ విషయమున వివాదము అసంగతము.

ధ్యానమునకు అరుణోదయకాలముననే కూర్చుండుట మంచిది. అది సాధ్యము కానప్పుడు అభ్యాసికి అనువైన ఏ నిర్ణీత సమయముననైనను కూర్చుండవచ్చును. బాహ్యవిషయమువలన కలతనొందక అవి ఒకవిధముగ యీ సాధనయందు ఎక్కువగా లీనమవవలసిన ఆవశ్యకతను తెలిసికొనుటకు నీకు తోడ్పడుచున్నదని అనుకొనుచు నీ పనిలో నీవు నిమగ్నుడవై యుండుము.

## ప్రార్థన :

ప్రతిదినము నిదురించుటకు ముందు అతివినమ్రుడవై దివ్యప్రేమ పూరితహృదయము నుండి భక్తిభావము పొంగిపొరలునట్లు మన సంస్థయందలి ప్రార్థనను చేయవలెను. (ఓ ప్రభూ...) ఈ ప్రార్థనను మనసునందే ఒకటి, రెండు పర్యాయములు అనుకొనుచు దానిపై కొలదిక్షణములుపాటు ధ్యానము చేయుము. మిక్కిలి దైన్యావస్థయందున్న ఒకడు అశ్రుపూరిత నయనములతో ఆ పరమప్రభువు ఎదుట బాధాతప్త హృదయముడై ఆయన దయ, కరుణ, కృపలను అర్థించుచూ తన దుఃఖములను విన్నవించుకొను రీతిని ప్రార్థన సలుపవలెను. అపుడే అతడు అర్హతగల అభ్యాసికాగలడు. భగవంతుని ప్రేమించుటకు అనేక పద్ధతులు గలవు. అనేక భావములును అవలంభింపబడుచున్నవి. ఉదాహరణకు పితృభావము, సఖ్యభావము మొదలగునవి. నా ఉద్దేశ్యములో ప్రియుడు, ప్రేయసి అనే భావముకంటె వున్నతమైనది లేదు. ఒక అభ్యాసి తాను ప్రియుడుగను, భగవంతుని ప్రేయసిగను భావించుచు ఆ భావములో అతడు పురోగమించినచో తత్ఫలితముగ కాలక్రమమున భగవంతుడే ప్రియుడుగను, సాధకుడు ప్రేయసిగను అగును. కాని ఈ స్థితియందు అభ్యాసి గమ్యమును పొందితినని భావించునేని అది చాలా పొరపాటు. అటుపిమ్మట మిగిలినదానిని మాటలలో చెప్పలేము. అది సాధనకు సంబంధించిన విషయము మాత్రమే.

ప్రార్థన అత్యంత ప్రధానము. విజయసాధనకు తిరుగులేని వుపాయము. దానివలననే మనము పవిత్రమగు దివ్యత్వముతో సంబంధము ఏర్పరచుకొంటిమి. ప్రేమ, భక్తితోనిండిన హృదయముతో ప్రార్థన చేయడమువల్ల దివ్యకృపా ప్రవాహాన్ని అభ్యాసివైపు మళ్ళించడానికి, అతనిలో శూన్యస్థితి కలుగునట్లు చేయడానికి వీలగును. ప్రపంచము నేటిరూపమున ఆవిర్భవించినపుడు అన్నిప్రాణులయందును కేంద్రీయబిందువు లోతుగనాటుకొని యుండెను. మనయందు పాతుకొనియున్న ఈ కేంద్ర బిందువు పరమాత్మలోని ఒకభాగమే కావున అది మన దృష్టిని మూలమువైపు మరల్చును. ప్రార్థనయందు మనము ఆ కేంద్రబిందువు వరకు చేరుటకు ప్రయత్నింతుము. అట్టి స్థితి మనలో సృష్టించుకొనినపుడే అది సాధ్యమగును. దీనికి సాధనకావలెను. సరళము, శాంతము అయిన దివ్యసంకల్పమునకు విధేయులము అయినచో అది సాధ్యము. అయినప్పటికి దానిని కాంక్షించెడు వారికి మాత్రము నిజముగ అది కష్టముకాదు. పరతత్వము కొరకు తీవ్రతపనను సృష్టించుకొన్నప్పుడు అతడు నిజముగ ప్రార్థనస్థితి యందున్నాడు. ప్రతివారును దానికొరకు తీవ్రయత్నము చేయవలెను. ఒక్క క్షణమైన ఆ స్థితిలో ఎపుడైనను ప్రవేశించిన అతని ప్రార్థన సఫలమగును. కాని దీనిని సాధించుటకు నిరంతరసాధన అవశ్యకము. అట్టి ప్రార్థనను చేయవలెనని ప్రజలను ప్రోత్సహింపవలెను. దానిని సాధించి అందు స్థిరపడిన పిమ్మట అతనికి సతతస్మరణము తప్ప యింక చేయవలసినది ఏమున్నది. అదియుకూడ ఒకవిధముగ ఎరుకలోనికి ఎన్నడునురాదు.

## నిరంతరస్మరణ :

భగవంతుని నిరంతరస్మరణ ఆధ్యాత్మికతయందు ఒక విశిష్ట లక్షణము. ఒక విశిష్ట లక్షణము. నీ విశ్రాంతి సమయమున ఇంటియందు వున్నను, ఆఫీసుయందువున్నను, వీధిలో లేక బజారులో ఎచట వున్నను భగవంతుడు సర్వాంతర్యామి అని ఆయననే భావించుచున్నాను అను దృఢవిశ్వాసముతో ఆలోచించుచుండుటే నిరంతర స్మరణమును అలవరచుకొను విధానము. ఈ ఆలోచనలోనే ఎంతవరకు వుండగలిగితే అంతవరకు వండుటకు ప్రయత్నింపుము.

ప్రజల మనస్సులు ప్రతిక్షణము అసంఖ్యాక ప్రాపంచిక జీవితసమస్యల గూర్చి ఆలోచించుటయందే లగ్నమై యుండును. ప్రగాఢ సంతాపమునందో, దుఃఖమునందో మునిగియున్నప్పుడు తప్ప తక్కినయెడల వారి దృష్టిని దైవమువైపు మరలించుట లేదు. కారణమేమన నిరంతరము వారి దృష్టిలో నిలచియుండు ప్రాపంచిక లాభమునకే వారు ప్రాముఖ్యమిత్తురు. ఇట్లు వారు మాయలో చిక్కుపడి ఎప్పుడును అందుండి బయటపడుటకు ఆలోచింపరు.

తరచు భగవంతుని స్మరించుట చాలా సహాయకరము. అయినప్పటికిని సాక్షాత్కార విషయమున మనకు కావలసినది అంతియేకాదు. సాధారణముగ మనము ఏ ముఖ్యకార్యమైనను దేవుని పేరున మొదలుపెట్టెదము. అట్లుచేయుట అన్ని మతముల వారికిని ఆచారమే. అదియొక లాంచనము మాత్రమే, అంతేగాని దానికి ప్రాముఖ్యత లేదు. మనము దేనినీ నిజముగా భగవంతునకు అంకితము చేయుటలేదు. హృదయాంతరములో వాస్తవమునకు భగవంతుడు అనెడి భావమునకే కడుదూరముగ వున్నాము. ఇట్లు దేవుని స్మరించుట నిరర్థకము. మహాత్మ్యము ఏమనగా మానసిక కార్యకలాపములన్నిటిలోను భగవద్భావముతో సాన్నిహిత్యము కలిగియుండవలెను. మన కార్యకలాపములు అన్నిటిలోనూ ప్రతిక్షణము ఆ దివ్యశక్తితో ఎడతెగని ఆలోచనాపరంపరతో దగ్గరగావున్న అనుభూతి ఉండవలెను. మన చేతులు, కార్యములు, దైవకైంకర్యమున భాగమే అనియు ఆ మహాప్రభువుని

మనకు వీలైనంత చక్కగా సేవించుటకై మన కొసంగబడిన సాధనములే యివి అనియు భావించినచో దానిని తేలికగా సాధించవీలగును. ప్రాపంచిక బంధనములు బాధ్యతల కారణమున అసంఖ్యాములగు కలతలు, కలవరముల చేత మానవుడు చుట్టుబడి భగవంతుని సర్వదా స్మరించుట అట్లుండగా తరచు స్మరించుటకూడ సాధ్యపడదని కొందరు భావింతురు. కాని సాధన, అనుభవము, అది చాలా సులభమయిన ప్రక్రియ అని వారికి నిరూపించగలవు. ప్రతివారు తమకున్న బాధలు, కార్యక్రమాలు ఉన్నప్పటికీ వారు తమదృష్టిని యదార్థంగా దైవమువైపు మరలించినయెడల సతతస్మరణ వీలు అగును.

గురువు సాక్షాత్కారముయొక్క పరాకాష్టయందు లీనమైన వాడగుచో, ఆధ్యాత్మికాన్వేషణమున అతనిని సర్వోత్కృష్ట దైవశక్తిగా భావించుట కడుసహాయకారి. అతనిని ఒక మానవాతీత వ్యక్తిగా భావించి అతని మార్గదర్శకత్వము మీద ఆధారపడుదుము. సర్వము గురువునకు అంకితమొనర్చి ఎడతెరిపిలేని నీ జీవన వ్యవహారక్రమముతో సాగిపోవుచున్నచో తుదకు నీకది ఎట్టిమేలు చేకూర్చిపెట్టునో ఊహించుము. ఒక పని చేయునపుడు నీవు నీకొరకు ఆపని చేయుచున్నట్లు అనుకొనకుము. నీ గురువునకై చేయుచున్నట్లు భావింపుము. లేదా నీ గురువే తనకొరకు చేయుచున్నాడని తలంపుము. భోజన సమయమున నీ గురువు భోజనము చేయుచున్నాడని అనుకొనవలెను. నీవు కార్యాలయమునకు పోతివేని నీ గురువే ఇది అంతయు చేయుచున్నాడని భావింపుము. నీవు కార్యాలయమునుండి తిరిగి వచ్చునపుడు దారిలో ఒక ఆకర్షణీయమైన నాట్యప్రదర్శనము చూచితివనుకొనుము. నీ కనులు ఆ నర్తకి ముగ్ధమోహన రూపముచే ఆకర్షితములగును. నీ ఆలోచనలు కొంతసేపు తప్పుదారి పట్టినట్లుండును. అపుడుకూడ గురువేకాని నీవు నాట్యప్రదర్శన చూచుటలేదని తలంపుము. తక్షణమే నీకు దానిపై కుతూహలము పోవును. ఏలయన నీ గురుశక్తి ప్రవహింపమొదలిడి నిన్ను ఆకర్షణ నుండి తొలగించును. నీవు కార్యాలయము నుండి తిరిగి వచ్చినపుడు చాలా గంటల తర్వాత నీ పిల్లలు నిన్ను చూచి ఆనందింతురు. నీవుకూడ వారి వినోదములకు సంతోసింతువు. అది సహజమే. త్రుటికాలము నీ ధ్యాస వారివైపు మొగ్గుటతో, నీవు పవిత్రచింతనకు దూరమైనట్లు అనుకొనెదవు. నీవు అప్పుడు చేయవలసినది ఏమనగా నీలోని గురువేవారితో వినోదించుచున్నడని భావించుట. అట్లయిన నీవు మరల అదే పవిత్ర చింతనతో సంపర్కము కలిగియుందువు. నీవు మిత్రునితో మాట్లాడుచుండినచో వానితో నీ గురువేకాని, నీవుకాదు మాట్లాడుచున్నది అని తలంచుము. నడచుచున్నప్పుడు నీ గురువే నడచుచున్నాడని భావించుము. ధ్యానకాలమున నీవుకాదు నీ గురువే తనరూపము పై ధ్యానించుచున్నాడని భావించినట్లయిన దానివలన అద్భుత ఫలితములుండును. ఇదేవిధముగ అన్ని పనులయందును నీవు నిన్ను సరిచేసుకొనవచ్చును. ఈ భావమును పెంపొందించుకొని, నీ స్థానములో నీ గురువే సమస్తము చేయుచున్నాడను దృష్టి నెలకొల్పుకొన్నచో, నీవు సతతస్మరణతో ఎల్లవేళలయందు, ఉండుటయేగాక, నీ కర్మలవలన ఎట్టి సంస్కారములును పుట్టవు. అందువలన నూతన సంస్కారములను పెంపొందించుకొనుట జరుగదు.

## భక్తి :

యదార్థమునకు ధ్యానసాధనయొక్క సహజ పరిణామమే నిరంతరస్మరణ. అభ్యాసి ధ్యానముయొక్క లేదా నిరంతర స్మరణయొక్క లక్ష్యమునకు తనను సమర్పించుకొనునపుడు అది గొప్పదక్షత పొందును. అపుడది నిస్సారమైన సాధనగాక పూర్తిగ మధురమైన సర్వాకర్షణీయమైన కార్యక్రమము అగును. భక్తి, ప్రేమయొక్క అగ్నిమాత్రమే, నిరుపయోగమైన చెదారమును దగ్ధముచేసి మట్టినుండి బంగారమును పొందుదును. మొదటిదశలో

అదిమిపెట్టబడి, అంతర్గతంగా ఉండి అది రాజుకుంటూ దట్టమైన పొగలను ఇచ్చును. రెండవదశలో అప్పుడప్పుడు నిప్పురవ్వలు ఉండడం జరుగును. మూడవదశలో ఒక్కక్షణంలో అంతటినీ బూడిద చేయగలిగిన ప్రకాశవంత మయిన మంటలను ఇచ్చును. మొదటి, రెండుదశలూ గాలిలో మండే ద్రవ్యానికి సమక్షంలో నుండును. జ్వాలానిరోధకమైన ఘనపదార్థాన్ని, అంతర్గతాగ్ని ద్వారా తొలగించునపుడు సంపూర్ణ శక్తితో అంతిమచర్య ఆరంభమగును. అయిననూ విద్యుదగ్ని మొదటి రెండుదశలను మించిఉండి అది మూడవదశలోనే గోచరించును. అందు పొగగాని, ఆవిరిగాని ఉండదు. నీవునీలో అటువంటి అగ్నిని రగుల్కొనేలా చేసుకోగలిగిన, నీ అభివృద్ధి అత్యధికంగా ఉండును.

నిజమునకు భక్తి, ప్రేమలు మిక్కిలి సులభములైనను వాటిని తక్షణమే సాధించుట ఎంతయో కష్టము. నిజమగు భక్తియందు నటన, లేశమైనను ఉండదు. ఇదియు (భక్తి) మానసిక వికాసము – రెండును పరస్పరము సన్నిహితముగ నుండును. ప్రారంభదశలయందు భక్తునికి తాను ప్రేమించుదానియందు తనకు ప్రేమయున్నదను స్ఫురణయుండును. ఉన్నతదశలలో హడావిడి, అట్టహాసము సన్నగిల్లును. అంతిమస్థితిలో ఎరుక చాలావరకు లేకుండాపోవును. భక్తియొక్క అతిసూక్ష్మస్థాయి సంపూర్ణ ఆత్మార్పణమని చెప్పవచ్చును. దానినుండి గురుదేవుని అనుగ్రహమువలన అర్పించుకున్నానను ఎరుక పూర్తిగ తొలగింపబడును.

భక్తి ప్రపత్తి మొదలగువానిని సహజపద్ధతియందు ఆచరించు సమస్య కలదు. ఇందులకు తన తోటిమానవుని గాఢముగా ప్రేమించవచ్చునని చెప్పబడినది. అందుచే గురువు మానవాకృతియందున్న భగవంతుడేయని తలచవలెను. నా విషయమున నా ఏకైక ప్రేమవస్తువు నా గురువే. నేను ప్రేమించినది ఒక్క గురుదేవుని మాత్రమే. స్వేచ్ఛ, శాంతి, పరిపూర్ణత్వము లేక మరి దేనినీ నేను ప్రేమించలేదు. ధ్యానింపబడుటకు, అర్పించుకొనుటకు మహా ఉత్తమ పురుషుడగుటచే మా గురువే నిస్సందేహముగ దానికర్హుడు. ఆయనకు అహంకారభావములు, కోరికలు, ప్రాపంచికబంధములు ఏమియును లేవు. ఆయన సంపూర్ణముగ ఆత్మనిష్ఠుడు. ఆ స్థితి మానవునకు సామాన్యముగ ప్రసాదింపబడుట అరుదు. ఈ మాట ఉన్నత ఆధ్యాత్మికస్థితిని సూచించును. ఆ కారణముననే నేను శక్త్యానుసారముగా ఆయనను ప్రేమించితిని. నేను ఆయనయందు సంపూర్ణముగ లీనమగుటకు హృదయపూర్వకముగ ప్రయత్నించితిని. ఇదియే నా జీవితధ్యేయముగా నుండెను. ఏలయన నాకు అసామాన్యుడు, అసదృశుడు అయిన గురువు దొరుకుటవలన, దానినుండి నాకు లభించిన ఫలితములను విశదీకరించుటకు నాకు మాటలు లేవు. ఒక్కమాటలో చెప్పవలెనన్న ఆయన అనంతకృపాసాగరము. దానియందు మనమందరమును లీనము కావలసినదే. శ్రద్ధతో కూడిన సత్యాన్వేషకులు ఎల్లరకును అది సాధ్యముగావుత.

## శరణాగతి :

లక్ష్యమును సాధించుటకు అత్యంత ఖచ్చితము సులభమైనదియగు ఉపాయము నీకు నీవే సమర్థగురువునకు సమర్పించుకొని, జీవన్మృతుడవు అగుట. ఈ శరణాగతి అనుభూతి బలవంతముగ లేక యాంత్రిక ఉపాయములతో కల్గించుకొన్నచో అది యదార్థమగుట అరుదు. మనస్సునకు యేవిధమైన శ్రమగాని, ఒత్తిడిగాని లేకుండ తనంతట అది నీయందు పెంపొందవలెను. ఆత్మజ్ఞానముయొక్క ఎరుక ఉండినచో అది నిజమగు శరణాగతి కాజాలదు. నీకు నీవే నిజమగు శరణాగతి చేసికొన్నచో ఇక చేయునది ఏమి మిగిలియుండును? ఏమియులేదు. ఈ స్థితిలో అభ్యాసి నిరంతరము సత్‌పదార్థముతో మిక్కిలి సన్నిహితుడై యుండిన, అతనిలో దివ్యతేజస్సు యొక్క ప్రవాహము, నిరాటంకముగ ప్రవహింపసాగునని నా నమ్మకము. ఈ విధముగ

జీవితసమస్యను మిక్కిలి స్వల్పకాలమందు సులభముగను, సమర్ధవంతముగను, పరిష్కరించుకొనగలము. దివ్యపురుషుడగు గురుదేవునకు తన హృదయమునొక కానుకగా సమర్పించుకొనగలిగిన సాధకుడు తరువాత చేయవలసినదేమియు నుండదు. ఇది అభ్యాసిని సహజముగ కేవలసత్‌పదార్థమునందు లీనమగుస్థితికి గొనిరాగలదు. ఈ విధమైన సరళము, సులువు అయిన పద్ధతి ఆరంభాన్ని అంతిమంగా చేయును. అత్యంత ప్రీతిపాత్రమయిన జీవితలక్ష్యాన్ని సాధించడానికి కడుయోగ్యమైన అర్పణము అల్పహృదయముకంటె మరి ఇంకేమున్నది?

మరియొక విషయము అతి సులభమార్గమున హృదయమును సమర్పించుకొనుటకు కావలసినది సంకల్ప క్రియ మాత్రమే. ఇదియేగాక ఈ సంకల్పము సూక్ష్మము, సున్నితము అయినకొలదిని దానిపని కూడ అంతఫలప్రదమైనదిగ ఉండును. ఈ పద్ధతి అవలంభించుటవలన మొట్టమొదటి నుండియు వైరాగ్య వైఖరి నిశ్చయముగ అలవడును. ఇందుకు కావలసినది ఎల్లయూ ధైర్యముతో కూడిన ప్రయత్నము మాత్రమే.

శరణాగతి (ఆత్మార్పణ) అనగా ఆత్మను సంపూర్ణముగా నిర్లిప్తత చేసి గురు సంకల్పానికి పూర్తిగా అర్పించి వేయడము అనే స్థితి మాత్రమే కాని మారుకాదు. ఈ స్థితియందు స్థిరముగా నుండినచో అది శూన్యస్థితికి దారితీయును. మనము ఆ మహామహుని శరణుజొచ్చిన వారినుండి ఒక మహోన్నత నిరర్గళ దివ్యశక్తిధారను ఆకర్షింపనారంభింతుము. ఈ స్థితియందు మానవుడు తన ప్రభుని ఇచ్ఛానుసారమే ఆలోచించును, లేక నడుచుకొనును. ప్రపంచమందేదియు తనది కాదనియు, ప్రతిదియు ప్రభునియొక్క పవిత్రనిధియనియు భావించి ప్రతి పనిని ప్రభుని ఆజ్ఞానువర్తియై ఒనర్చుచున్నట్లు తలచిచేయును. అతని యిచ్ఛ, సంపూర్ణముగ, ప్రభుని యిచ్ఛకు విధేయమైపోవును.

శరణాగతి తేలికగా పొందుటకు వీలగు సామాన్య విషయముకాదు. అది ఇంద్రియ మానసిక శక్తులను సంపూర్ణముగ లయపరచిన తర్వాతనే ప్రారంభమగును. ఇందుకు పోవుదుము. మనము మన గురువును మానవాతీత వ్యక్తిగా తలంచి అతనికి విధేయులమగుదుము. మనము భక్తి విశ్వాసములతో ప్రేమించి సర్వవిధముల అతని దృష్టిని ఆకర్షించుటకు, అనుగ్రహము పొందుటకు ప్రయత్నింతుము.

మహర్షులు శిష్యులను "మన్మతులు", "గురుమతులు" అని రెండు ముఖ్య వర్గములుగ విభజించిరి. తొలివర్గమునకు చెందినవారు ప్రాపంచిక దుఃఖముల నుండి విడుదల, సంపదల వంటి యేదో ఒక ప్రాపంచిక లాభము దృష్టిలో నుంచుకొని గురుని ఆశ్రయింతురు. వారి కోరికలు నెరవేరు ఆశ వున్నంతవరకే వారు అతనికి విధేయులై యుందురు. ఈ విషయమున నిరాశాహతులైనచో వారు వదలిపోవుదురు. అట్టి శిష్యుల విషయమున నమ్రత, విధేయతలన్న ప్రశ్నయే ఉదయించదు. శరణాగతి మాట చెప్పనేల? గురుమతు లనబడు శిష్యులు గురుని ఆజ్ఞలను, అన్ని విషయములందును, తలదాల్చి, అన్ని విధముల అతని ఇచ్ఛకు విధేయులై ఉండజూతురు. విదేయత నమ్రతతో మొదలగును. ఆధ్యాత్మికముగ మహోన్నత స్థితులను సాధించిన గురుని మహోత్కృష్ట శక్తులచే గాఢముగా ముగ్ధులమైతిమేని మన అంతరంగమున వారి ఆజ్ఞలను శిరసావహించుటకు సమ్మతింతుము.

దశరథుని కుమారుడగు భరతుడు అయోధ్య పురజనులతోగూడి అడవికివెళ్ళి తన సోదరుడగు రాముని నగరమునకు తిరిగి రమ్మని ప్రార్థించుట శరణాగతిని గూర్చిన చక్కని దృష్టాంతము. రాముడు ప్రజల ప్రార్థనలను విని భరతుడు తనను రమ్మన్నచో, తాను రాజధానికి వచ్చుటకు నిరభ్యంతరముగ అంగీకరింతునని గంభీరముగ

చెప్పెను. అచట ఉన్న అందరి దృష్టి భరతునివైపు మరలెను. అతడు స్వయముగా రాముని తిరిగి రమ్మని కోరుటకే అచటకు వచ్చియుండెను. అయినను అతడు నెమ్మదిగ ఇట్లు బదులు పల్కెను. "ఆజ్ఞాపించుటకుగాదు అనుసరించుట మాత్రమే నేను చేయగలిగినది". కావున అభ్యాసికి తన సాధనయందు ఆత్మార్పణ అత్యంత ప్రాముఖ్యము కలిగియున్నది.

## ఆరవ అధ్యాయము

# సాక్షాత్కారము - మార్గదర్శకుని పాత్ర

---

### గురువు, ఆయన నిర్వహించు కార్యము :

అభ్యాసము వలన మాత్రమే సాక్షాత్కారము సాధించుటకు వీలుపడదు. కారణమేమనగా ఉన్నత దశల యందు పరిస్థితులు అట్లుండును. సాధకుడు స్వశక్తిచే కొంచెము పైకి పోయినను పైనుండి శక్తివంతమైన ఒత్తిడి వలన అతడు వెంటనే క్రిందికి జారిపోవును. కావున ఉన్నత భూమికలలోనికి మన ప్రదేశమునకు సంబంధించినంతవరకు గురువుయొక్క సహాయము ఆవశ్యకము. సాధన యొక్క ఆచరణ విషయమందు కూడా ప్రతివారును ఆధ్యాత్మిక శిక్షణ యొక్క ఆచరణ పద్ధతి అవలంబించుట ఆవశ్యకము. దానికొరకు మనము సరియగు మార్గదర్శకత్వము అన్వేషింపవలెను. అయినను మహనీయులు కొందరు నేరుగా దేవుని శరణార్థులై స్వప్రయత్నముతో పరిపూర్ణతను సాధించిన సందర్భములు కొన్ని ఉన్నవి. కాని అట్టి దృష్టాంతములు అరుదు. అది చాలా కష్టమైన మార్గము అసాధారణ మేధాసంపన్నులు మాత్రమే దానిని అనుసరింపగలరు. దైవమునకు, మానవునకు అనుసంధానకర్త గురువే. ఆయన ద్వారా మనము భగవంతుని చేరగలము. మన మార్గమున గల చిక్కుల నుండి విమోచనము కలిగించగల ఏకైక శక్తి ఆయనే.

అత్యంత ఉన్నత శక్తి సంపన్నుడును, తన అసాధారణ బల సహాయము చేత చూపు మాత్రమున చిక్కులను తొలగింప గల మార్గదర్శకుని మనము ఎన్నుకొనుట కూడా అవసరము. అట్టివారు కేవలము పరిపూర్ణత్వము పొందిన వారుగాని అహంభావరహిత స్థితిన పొందిన వారుగాని కావలయును. మనము ప్రేమ, ఆకర్షణ భావములు కలిగి అట్టి మహాశక్తి సంపన్నునితో సంబంధము ఏర్పరచుకొనవలెను. మన మనస్సులో అట్టి వారిని గూర్చి ఏతీరున భావింతుము, అన్నది అంత ప్రధానము కాదు. అతనిని మిత్రుడని, గురుడని, సేవకుడని మన కిచ్చవచ్చినట్లు పిలువవచ్చును. కాని అతడు మాత్రము సామాన్యముగా పిలుచునట్లు మార్గదర్శిఖుడుగా, గురువగానే ఉండును. గురువును తల్లిగా భావించుట నా దృష్టిలో అత్యంత సముచితమును, శిష్యునకు లాభదాయకమును అగును. మూర్తీభవించిన ప్రేమ, వాత్సాల్య భావములే తల్లి. మాతృ హృదయము మాత్రమే తన పుత్రుని వలన కలిగిన సకల బాధలను క్లేశములను ఓరిమితో భరించుచు తన కుమారునికి సుఖ సంతోషములను కూర్చవలెనని సర్వదా యత్నించును. శిష్యునకు ఆధ్యాత్మిక మాతృత్వమును వహించు నిజమైన గురువు యొక్క స్థానము గూడ అట్టిదే. అందువల్ల గురువుతన పుత్రసమానమగు శిష్యుని ఆధ్యాత్మిక సంక్షేమమును సర్వదా కనిపెట్టుకొని యుండును. శిష్యుని యెడల గురువునకు గల మాతృ వాత్సల్యపూరిత సాన్నిహిత్యము వలననే అతని ఆధ్యాత్మిక జననియగు గురువునకు అత్యంత సన్నిహితుడైయున్న పరమపిత యొక్క కృప ఆ శిష్యుని వైపు ప్రసారితమగును. తల్లి బాధ్యతలు నిజమైన గురువు యొక్క బాధ్యతలు సన్నిహితముగ సమానములే. తల్లి బిడ్డను తన గర్భమునందు కొంతకాలము ఉంచుకొనును. గురువు కూడ ఆధ్యాత్మిక శిశువును మన మానసిక పరిధిలో కొంతకాలము ఉంచుకొనును. ఈ కాల వ్యవధిలో శిష్యుడు గర్భములోని శిశువు వలెనే

గురువు నుండి శక్తిని గ్రోలి గురువు ఆధ్యాత్మిక యోచనా తరంగముల నుండి పోషణను గ్రహించును. కాలము పరిణతి చెందినపుడాతడు దివ్యలోకమున ఉద్భవించును. అటుపై అతని ఆధ్యాత్మిక జీవనము ఆరంభమగును. శిష్యుడు తనవి అన్నియు గురువునకు అర్పణచేసి ఆయన మానసిక పరిధిలో ప్రవేశించిన యెడల అతనిని దివ్యలోకమునకు పంపుటకు ఏడు నెలలు చాలును. అతడు గురువు యొక్క మానసిక పరిధిలో ఉంటూనే తన ఆలోచనలు అనుభూతుల ఎరుకలో ఉండుట వలన అది చాలాకాలము ఆలస్యమగును. ఇట్లు గురువు స్థానము తల్లి స్థానము వంటిదేనని మనము గమనింతుము. గురువును ఆధ్యాత్మిక జననిగా భావించుట మనయందు ఆధ్యాత్మిక జీవనమునకు ముఖ్యాంశములగు ప్రేమ, భక్తి, శరణాగతులను పెంపొందించును.

సమర్థుడైన గురువను ఎన్నుకొనుట నిస్సందేహముగ చాల కష్టమైనపని. స్వానుభవమే ఆధారముగా దీనిని నిర్ణయించుటకు ఒక సులభపద్ధతి చెప్పెదను. నీవొకవ్యక్తి సమీపమున ఉండుట తటస్థించిన అతని సంపర్కము వలన నీలో శాంతినిశ్చలతా భావములు కలుగుచున్నవా? మనస్సు మీద భారముగాని, మరియే గుణములుగాని లేకుండ దాని చంచల ప్రవృత్తులు తాత్కాలికముగానైనను శాంతించినవా అని అర్థము చేసికొన ప్రయత్నింపుము. అట్లయిన ఆ వ్యక్తి నిన్ను ఆధ్యాత్మిక పదమందు ముందునకు కొనిపోవటకు తగిన వ్యక్తియని నిర్ణయించుకొనుము. అయితే ఇంకొక చిక్కు కూడా కలదు. అట్టి గురువు లభించినను, అందుబాటులో ఉన్నను ఆయన ఏదో ఒక అద్భుత మహిమను ప్రదర్శించినగాని అతనిని నమ్మరు. ప్రాణాహుతి శక్తి ప్రసారము చేయగల రాజయోగి మహిమలను నిస్సంశయముగ ప్రదర్శింపగలడు. కాని అవి తన నిజస్థితులను కించపరచునవి అగుటవలన అతడట్లు చేయుటకు అంగీకరింపడు. తన జీవితమంతయు మహిమలను ప్రదర్శించిన క్రీస్తు ఉదాహరణము మనకున్నది. అట్లుండి కూడా ఆయనకు పండ్రెండుగురే శిష్యులుండిరి. వారిలో ఒకడు తరువాత ఆయనను శిలువ నెక్కించుటకు కారణభూతుడయ్యెను. ప్రజలయందు విశ్వాసము కలిగించుటకు ఆయన మహిమలు నిరుపయోగములని ఇది నిరూపించుచున్నది. యదార్థమునకు ఆయన యొక్క మంచి బోధనలే ఆయన తరువాత అంత పెద్ద అనుచర వర్గమును చేకూర్చినవి. కావున మహిమలపై గాక సత్‌పదార్థము పైననే దృష్టిని నిలుపుట మనకు చాలా శ్రేయస్కరము. అవి మిక్కిలి స్వల్ప విషయములు, అల్పసిద్ధులు, శక్తులు కలవారిచే కూడా అవి ప్రదర్శింపబడును. మహాత్ములను, లేక, యోగులను గుర్తించుటకు మహిమలు ప్రమాణములు కావు పైగా ఇది బలహీనులను, సులభముగ నమ్మెడు ప్రజలను తమ గురుత్వపు వలలో వేసుకొనుటకై చమత్కారులైన గురువులచే ఉద్దేశపూర్వకముగ చేయబడు మోసము. గురువును నిర్ణయించుకొనుటకు ముందు ఆధ్యాత్మిక మార్గమున ఆయన అనుభవ సిద్ధులయందు, శక్తి సామర్థ్యముల యందు పూర్తి విశ్వాసము మనకు కలిగి తీరవలెను. ప్రయోగాత్మకముగా గ్రాహ్య అనుభవముల ద్వారా విషయములను నిర్ణయించుటకు వారితో ఎడతెగని సాంగత్యము కలిగియుండవలెను. అట్లు నమ్మకము కలిగిన పిమ్మటనే ఆయనను విశ్వాస పూర్వకముగా నమ్మి ఆయనపై స్థిరముగ ఆధారపడవలెను. అన్వేషణ విజయవంతమగుటకు ఇది అత్యావశ్యకము.

అవసరమైన వారికి సహాయము చేయుటకు నా హృదయము ఎల్లప్పుడు సిద్ధముగా నున్నది. మానవ జాతికి విధేయతగల సేవకునివలె మాత్రమే నేనీ కార్యమును స్వీకరింతును. సమర్థులుగ పనిచేసియు, ఇంకను చేయుచున్న గురువులు నాడును నేడును కలరు. కాని సామాన్య ప్రజల శ్రేయస్సునకై సేవకుడుగా ఉండి సేవ చేయుటయే నా అభిమతము. నీకు చెప్పబడినట్లు దయచేసి చేయుము. నీదైనందినాభివృద్ధిని గురించి నీకు కలుగు ఏవైన చిక్కులను గురించి నాకు తెలుపుము. నిరంతర స్మరణతో పట్టుదల గల్గి సాధన చేయుచున్నచో నీ గమ్యమును సులువుగా సాధించగలవని నేను నిశ్చయముగ చెప్పగలను.

పాండిత్యము గల మతగురువులు సాధారణముగ దేవుళ్ళను దేవతలను పూజింపుడని ప్రజలను పురికొల్పుదురు. మార్గము చివర వరకును ప్రయాణించిన వ్యక్తి మాత్రమే విజయవంతముగ నడిపించగలడు. పండితులైన గురువులు యించుమించు ఏదారి ఎచటకు పోవునో తెలిపెడు త్రోవలు చూపు గుర్తు స్తంభములవంటి వారు. వారు చేయగలిగిన పని ఇదియే. భౌతికత్వము నుండి విముక్తి పొందవలెనని వాంఛించువారు భౌతిక రూపములపైననూ స్థూల రూపములపైననూ ఆధారపడుట నిస్సందేశముగా మిక్కిలి వింతగా నున్నది.

"మహాత్ముడు" అను పదము పలు విధములుగ నిర్వచింపబడి యున్నది. బహుళ సకారణ ఆధారము లేకుండా కాదు. దానికి నా నిర్వచనము "స్థితి రహిత స్థితి". ఈ నిర్వచనము కొంత వింతగా యున్నను అర్థయుక్తమే అగును. ఇది ఆధ్యాత్మికతకు దూరముగా ఉన్న వారికి సంబంధించునని కూడ అర్థము తీయవచ్చును. కాని ఆధ్యాత్మికతను కాంక్షించు వారికి అది అంగీకారము కాకపోవచ్చును. కాని దాని నిజమగు భావ విశేషమును వివరించుటకు మరికొంత లోతుకు వెళ్ళినచో అది అర్థము కాదని నా భయము. కావున ఈ విషయము ఇంతటితో ఆపివేయుట మంచిది. రాజ దుస్తులు మాత్రమే ఎవనినీ నిజమగు రాజుగా చేయవని మనకు తెలియును. అట్లే రూపముగాని, దుస్తులుగాని, నిజమగు మహాత్ముని లేక యోగిన చేయజాలవు. బాహ్య భౌతిక లక్షణములు అంతర్గతముగానున్న హృదయమునకు నిజమైన చిహ్నములుకావు.

నేటి గురువులను అనుకూలముగ ఈ క్రింది విధముగ వర్గీకరించవచ్చును.

1. క్షుద్ర గురువులు : వృక్షములు, జంతువులు, దయ్యములు, కీటకములు, వ్యాధులు, దుష్టశక్తుల, పూజలను బోధించి చేయించువారు.
2. గ్రంథ కీటకములు : తాము పుస్తకముల నుండి సేకరించుకొన్న పద్ధతులను, విధానములను నిర్దేశించు వారు.
3. ఆచరణ గురువులు : వీరు మంచి చెడ్డల విచక్షణ లేకయే తాము చేయునది మాత్రమే ఇతరులను చేయుమని విధింతురు.
4. ప్రేరణనొందిన గురువులు : వీరు తమ ప్రేరణల ఆధారము చేసికొని ఇతరులకు మార్గము చూపుదురు.
5. ప్రేరణనొందిన అనుభవ గురువులు: ఉన్నతమైన అంతఃప్రేరణ సహాయముతో ప్రత్యక్షానుభవ ఆధారమున ఇతరులకు మార్గముచూపువారు.

ఇదే విధముగా శిష్యులను కూడ క్రింది విధముగ వర్గీకరించవచ్చును.

1. స్వలాభాపేక్షాపరులు : తమ ఇంద్రియముల (అవసరములు) కోరికలను తీర్చుకొనుటకై సాధనను చేపట్టువారు.
2. కాలక్షేపకులు : దీనిని కాలక్షేపము కొరకు చేపట్టువారు.
3. అనుచరులు : గురువుల ఆజ్ఞలను అనుసరింప ప్రయత్నించు వారు.
4. శ్రద్ధావంతులైన శిష్యులు : గురువు అడుగు జాడలలో నడచుచు వారి ననుకరింప ప్రయత్నించు వారు.
5. భక్తి శ్రద్ధలుకల శిష్యులు : గురువుగారి దృష్టికి కేంద్రమగు వారు.

ఆధ్యాత్మిక తృష్ణను తృప్తిపరచుకొనుటకు గురువొకరుండుట తప్పదని మతము యెడల ఆసక్తిగల ప్రతి హిందువును నమ్మినప్పటికిని దురదృష్టవశమున ఈనాడు సరియైన మార్గదర్శకుని యెంచుకొనుటలో ఎక్కువ అశ్రద్ధ కనపడుచున్నది. ఇందుకొరకు సామాన్యముగా అర్హత, సమర్థతలను పరిశీలింపకయే ప్రజలు ఎవరో ఒకరిని ఎంచుకొనుచున్నారు. అజ్ఞాన ప్రజానీకమును ఆకర్షించుటకై గురువులుగా చెల్లబడియగుచున్న కొందరు ప్రదర్శించు అద్భుతశక్తి ప్రదర్శనల చేతనో, చమత్కార వాక్ నైపుణ్యముచేతనో ప్రేరేపితులగుచున్నారు. శిష్యులకై వేటాడు కొరతలేదు. చెట్టుననున్న ఆకులవలే వారు అసంఖ్యాకులు. వారిలో పెక్కుమందికి గురుత్వమనునది కడు లాభదాయకమైన వృత్తి. అది వారికి వేరు విధముగా గడింపలేని అపార ఆదాయమును కూర్చిపెట్టును. పైగా శిష్యుల నుండి అత్యంత గౌరవమును, వ్యక్తిగత సేవయును పొందుదురు. అజ్ఞాన ప్రజానీకము ఈ తీరున సులభముగ ఈ కుక్షింభరుల వాతపడుచున్నది. ఏ క్షుద్రమగుఅద్భుత శక్తి ప్రదర్శనమో,మనోహరముగానీ, ఆకర్షణీయముగానీ, అగు ఏదో ఒక సామాన్య ప్రదర్శనమో గొర్రెలవంటి అవివేకులను వందలాది మందిని వారు గురుత్వమనెడి బంధనశాలలోనికి ఆకర్షింపగలుగును. తమకు కోపము కలిగించిన వారిని శాపదగ్ధుల నొనరింతుము అను ఒకచిన్న బెదిరింపు, వేలమందిని వారి అడుగులకు మడుగులొత్తునట్లు చేయును. ఇంతియేకాదు, ఈ వృత్తియందు ఏకాధికారము సంపాదింపగోరి సన్యాసిగాని, సంసారిగాని విశిష్ట వర్గమునకు చెందినవాడు తప్ప ఇతరుడు గురువు అగుటకు అనర్హుడని వారు ప్రకటింతురు. యోగ్యత, సామర్థ్యములతో నిమిత్తము లేకుండా వారు తాము మతపరముగ ఆజన్మ జగద్గురువులమని వాదింతురు. ఈ రోజులలో అసంఖ్యాకులుగా సన్యాసులు కూడ మహాత్ములవలె అభినయించి జగద్గురువులమని ప్రకటించుకొనుచున్నారు. జాతికిని, మతమునకును, తలవంపులు తెచ్చునట్టి వృత్తి వంచకులు తమస్వార్థలాభములకై అజ్ఞాన ప్రజలను వంచించుచూ పూర్తిగా దండన రహితులై తిరుగాడుచుండుట విచారకరము కాదా ?

అట్టి వ్యక్తులు ఎట్టి అవాంతరము కల్పించియుండిరో ప్రజానీకము కనుదెరచి చూడవలసిన కాలము ఆసన్నమైనది. గురుత్వమును అధికారవర్గీయులు గుత్తాధికారముగ చిత్రించుట అసంగతము. ఇది వృత్తిగురువులచే వారి స్వప్రయోజనముల పరిరక్షణకొరకు ప్రవేశపెట్టబడినది. ఏ పరిస్థితులలోగాని గురువుతో పవిత్రబంధమును శిష్యుడు త్రెంచుకొనరాదనుట ప్రజా బాహుళ్యము నమ్ముచున్న సూత్రము. ఇదికూడ ఈ మిధ్యాగురువులు తమ స్థానమును సురక్షితము గావించుకొనుటకు అనుసరించు కుయుక్తియే. ఇది పచ్చిమోసమేకాని వేరుకాదు. శిష్యులకు దీక్షనిచ్చు ఆచారమును, దాని అంతరార్థమును ఎరుగని నేటి గురువులలో అధికసంక్యాకులు ప్రజలను తప్పుదారి పట్టించుచున్నారు. దీక్షాకాలమున కొన్ని రహస్య శబ్దములను శిష్యుని చెవిలో ఊది పూజలపేరిట కొన్ని ఆచారములను అనుసరించుమని చెప్పుటయే గురువులుగా వారి ఏకైక కృత్యము. శిష్యునియెడల వారి కర్తవ్యము అంతటితో తీరిపోవును. ప్రతిసంవత్సరము శిష్యునకు దర్శనమిచ్చి వారినుండి వారికి ముట్టవలసిన వార్షిక బహుమతులను అందుకొనుటతప్ప వాని అభివృద్ధికి చేయునది ఏమియు ఉండదు. యదార్థమునకు శిష్యునిలో నిజమైన విశ్వాసము నెలకొనియుండి దైవప్రేమ అతని హృదయములో వేరుదన్ని నాటుకొనినప్పుడు మాత్రమే యధావిధిగా అతనికి దీక్షనీయవలెను. శిష్యునకు దీక్షనొసగుట సర్వశక్తిమంతుడగు భగవంతునితో లంకె కుదుర్చుటకు సూచించును. అట్టియెడల అతడుతనయందు పెంపొందించుకొన్న గ్రాహ్యశక్తికి అనుగుణముగా ఆధ్యాత్మికశక్తి తనంతతానుగా ప్రవహింపనారంభించును. సుస్థిర సంబందము కుదుర్చుట అన్నది గురుని శక్తి సామర్థ్యములపై ఆధారపడియున్నది. దానికి మహోన్నతశక్తి సంపన్నత కావలెను. ఒకమారు దృఢమైన సంబంధము కుదర్చినచో అది శిష్యుడు ముక్తి పొందునంతవరకు నిలిచియుండును. అట్టి

సందర్భములయందు ముక్తి పెక్కుజన్మల తరువాత పొందవలసిన బహుదూరవిషయము కూడా కాదు. వాస్తవమునకు మహోన్నత శక్తి సంపన్నుడగు గురువు, పైన నుడివినట్లు సరియైన రీతిని శిష్యునకు దీక్షనొసంగినట్లైన వానితో తెగతెంపులు చేసుకొనుట అను ప్రశ్నయే ఉదయించును. కాని స్వార్ధలాభాపేక్షతో దొంగ దీక్షలనొసగు వృత్తి గురువులకు మాత్రము ఇది నిరంతర ఆందోళనకారియే. అందువలన శిష్యుని శాశ్వతముగ తమ గుప్పిటిలో నుంచుకొనుటకై వారు అతడెప్పుడైనను తమనుండి విడిపోదలచినచో అతనికి నరకయాతనలు తథ్యమని దైవశాసనముగ చాటెదరు. అజ్ఞానప్రజలు గురువునకు అప్రియమును తలచుటకు వెరచుచు దానిని వేదవాక్కుగా గ్రహింతురు. వారు గురువుల దురాగతము లన్నింటినీ సదానోరెత్తక తలయొగ్గి భరించుచు వచ్చుచున్నారు. మనశాస్త్రములందు ఈ విషయమై అణుమాత్రపు సూచనకూడా లేదని నా నమ్మకము. ఇది మతబోధకుల తెలివితేటల ఫలితమే. తాను గురువునెంచుకొనుటలో పొరబడినాననిగాని, గురువుయొక్క శక్తి సామర్థ్యములను సరిగా గమనించలేదనిగాని కనుగొన్నచో అట్టి గురువునుండి ఎప్పుడైనను తెగత్రెంపులు చేసికొనుట ప్రతిమానవుని జన్మహక్కు అని నేను గట్టిగా నమ్మెదను. ఏ దశయందైనను అతడు తాను ఇంతవరకు సాధించిన దానికంటే పైదశకు కొనిపోవుశక్తి తన గురువునకు లేదని కనుగొన్నచో స్వేచ్ఛగా మరొకగురువును అన్వేషించుకొనవచ్చును. అట్టి పరిస్థితిలో న్యాయబుద్ధిగల గురువు తానే శిష్యుని పురోభివృద్ధి కుంటుపడకుండ తనకంటే ఉన్నతుడును, యోగ్యుడును అగు ఇంకొకనిని వెదకికొన నిర్దేశింపవలెను. ఇదియే నిజమైనట్టియు, స్వార్థరహితుడైన గురువు యొక్క పవిత్రధర్మము. శిష్యుడు విడిపోవుటకు అనుమతి వేడి గురువుస్వార్థబుద్ధితో తిరస్కరించిన పక్షమున శిష్యుడు అతని నుండి తక్షణమే తెగత్రెంపులు చేసికొని స్వేచ్ఛగా మరియొకనిని చేరవచ్చును. ఏ నైతికధర్మమును గాని, మతధర్మముగాని అతనిని ఎన్నడునూ నిరోధింపదు.

శాస్త్రములు, తదితర పవిత్రగ్రంథములనుండి ఆర్జించిన జ్ఞానమును ఆధారము చేసికొని బోధించువారు గురువుతెగలో కొంత అభివృద్ధి సాధించినవారుగ పరిగణింపబడుచున్నారు. వారు వ్యవస్థలను, ఆశ్రమములను స్థాపించిరి. అందు వారు తమ అనుచరుల నడుమ రాజవైభవమును అనుభవింతురు. వారు గొప్ప సమావేశములందు ఉపన్యసింతురు. ఏమి చేయవలెనో, ఏమి చేయరాదో చెప్పుచు మాయ, జీవుడు, బ్రహ్మములకు సంబంధించిన సమస్యలను గూర్చి విశదీకరింతురు. వారి ధర్మోపన్యాసములను ఆలకించుటకు వేనవేలుగా ప్రజలువచ్చి గుమిగూడి వారి ఉన్నతభావములను, అపార విజ్ఞానమును వినుతించి వారు గొప్పమహాత్ములని, మహర్షులని భావింతురు. ప్రజలు వారిని పెక్కు చిక్కు ప్రశ్నలు అడిగెదరు. తాము గడించిన శాస్త్ర పరిజ్ఞానము నుండి ప్రత్యుత్తరములను వారీయగలిగినచో ప్రజల మనస్సులలో వారు మహాత్ములుగా తమ గొప్పతనమును స్థిరపరచుకొనినట్లే. అటుపై, వారే వారికి గురువులు. కాని వాస్తవముగ వారి పాండిత్యము రక్షింపబడినదిగాని వారి యోగ్యత కాదు. పాండిత్యముగాని, పరిజ్ఞానముగాని మానవుని పరిపూర్ణునిగా చేయనేరవనియు, సరియైన అనుభవజ్ఞానమే నిజమైన యోగినికాని, మహర్షునిగాని, కావించుననియు, మనస్సునందు చక్కగ నాటుకొని యుండవలెను. ఇట్లు తన బహిఃస్వరూప పాండిత్య వక్త ృత్వములచే ప్రభావితులనొనరించి వ్యక్తి యొక్క ప్రత్యక్షానుభవములను పరిశీలించినచో అధమమాధమ దశయందుండుటయు, సంభవించవచ్చును. కాని మమాత్ముడనుటకు గాని, యోగి అనుటకుగాని జ్ఞానము ప్రమాణముకాదు. అట్లే మహాత్ముడుగాని గురువుగాని అగుటకు నిదర్శనము కేవలము సాక్షాత్కార మార్గమున అతని అనుభవిక సిద్ధులేకాని, వారి అద్భుత శక్తి ప్రదర్శనలో, అసాధారణ ప్రవర్తనలోకావు. మహాత్ముడనగా గొప్ప వ్యక్తి అనెడి సామాన్య అర్థము నాకు నచ్చదు. నేను మహాత్ముడనెడు వానిని శాశ్వతముగా ఆత్మ భావరాహిత్యము కలిగి జీవించుచు గర్వము, అహంకారము

ఆధిక్యములనెడి భావములకు అతడు అతీతుడైయుండు ప్రాముఖ్యరహితునిగానో, నిరాదృతునిగానో నిర్వచింతును.

సాక్షాత్కారమునకు జ్ఞానము ప్రథమిక దశ అగుటచే అది అవసరమని, అనివార్యమని, అనువారు కొందరున్నారు. జ్ఞానము మేధాశక్తి సాధితము. సాక్షాత్కారము మేధాశక్తికి అతీతమగు ఆత్మవికాసము. అందుచే మన సిద్ధాంతములలోని నిర్దుష్టతను వివరింపగలవాడు కాని, చేయదగినవి, చేయదగనివి నిర్ణయించగలవాడు కాని నిజమైన గురువుకాదు. గురువు నుండి మనకు కావలసినది ఏమనగా ఆత్మవికాసమును కలుగజేయు ప్రేరణను సాక్షాత్కార మార్గమున పురోగమించు సమయమున అతని ప్రత్యక్ష ఆధారమును, విజయమును కోరినచో అట్టి గురువును అన్వేషింపవలెను. మనకు ఆధ్యాత్మిక శిక్షణ నొసగుటకు తగిన గురువును ఎంచుకొనునప్పుడు మనము ఆయనకు గల విజ్ఞానమునుగాని అద్భుత శక్తులనుగాని చూడరాదు. సాక్షాత్కార క్షేత్రములో ఆయన పొందిన సిద్ధులను గ్రహించవలెను. బంధ విముక్తుడైన వ్యక్తి మాత్రమే నిన్ను శాశ్వతబంధము నుండి విముక్తి చేయగలడు. నీ గురువు సంస్కారములు, మాయ, అహంకారములనెడి బంధముల నుండి విముక్తుడు కానిచో నిన్ను ఆ బంధముల నుండి విడిపించుట అసాధ్యము.

## ప్రాణాహుతి :

నా గురుదేవుల అనుగ్రహము వలన సామాన్యముగ ప్రజలకు తెలియని ఒక రహస్యమును వెల్లడించుటకు ప్రయత్నించెదను. శ్రీకృష్ణుడు, స్వామి వివేకానందుడు, నా గురుదేవుల వంటి మహావ్యక్తులు ఒక మనుష్యుని జీవితమును సంపూర్ణముగా మార్చివేయగలరనుట అత్యాశ్చర్యకరము. తన శక్తి వలన మనలను ఉన్నతోన్నత స్థితులకు కొనిపోగల గురువును అన్వేషించుట మనకు అత్యంత ఆవశ్యకము. ఈ రహస్యమే ప్రాణాహుతి. స్వచ్ఛమగు మనోమార్గము ద్వారా ఈ శక్తి పనిచేయుచున్నది. ఎల్లప్పుడును ఫలప్రదమగు సంకల్ప శక్తి వలన ప్రాణాహుతి ప్రయోగింపబడుచున్నది. ఆధ్యాత్మిక శిక్షణ వలన ప్రాణాహుతి ప్రయోగింపబడుచున్నది. ఆధ్యాత్మిక శిక్షణ నిచ్చు అధ్యాపకుడు అభ్యాసి మనస్సును మలచుటకు తన ఇచ్ఛాశక్తిని ప్రయోగించినచో అది ఫలవంతమగుచుండును. మరియు అద్భుత ఫలితముల నిచ్చుచుండును, కాషాయ వస్త్రములు ధరించి వెంటనే గురువుగా వృత్తిని ప్రారంభించు స్వాములవార్లు చాలామంది తమ శిష్యులు తాము చెప్పినది ఆసక్తితో వినినప్పటికినీ ఆ పిమ్మట కుక్కతోకవలె తమ వక్ర ప్రవర్తనమును మానరు అని వాపోవుచుందురు. కారణము స్పష్టము, స్వాములవారు ఇచ్ఛాశక్తిని వినియోగింపక పోవుటగాని, ఆయనకు శక్తి లేక పోవుటగాని జరుగును. వారు తమ శిష్యులకు మిక్కిలి శ్రమతో కూడినట్టివియగు సాధనలను నిర్దేశించి వారిని వారి విధికి వదలివేయుదురు. ఆ సాధన ఫలితములు గురువునకు తెలియవు, శిష్యులు తమ విచక్షణను ఉపయోగించరు. శిష్యునకు స్థౌల్యము, బుద్ధిమాంద్యము కలుగును. హక్కులే కాని బాధ్యతలను పూర్తిగా విస్మరించు గురువులకు భ్రష్టత్వము, పతనము నైతిక దురాచారములు తప్పవు.

తనలో మార్పు రావలెను అనెడి వానికే మార్పువచ్చునని అట్టి మార్పునకు గురువు కేవలము నామమాత్రమే కారకుడు అని కొందరు సంశయాత్ములు, హేతువాదులు, చెప్పుదురు. శ్రీకృష్ణభగవానునికి అట్టిశక్తి ఉండియున్నచో కురుక్షేత్ర యుద్ధము కలుగజేయుటకు మారుగ దుర్యోధనుని హృదయమునే ఏల మార్చలేదు? మరియు అర్హతలేని వ్యక్తినిగాని నిర్జీవమగు ఒక వస్తువునుగాని మార్గదర్శిగా స్వీకరించి గొప్ప యోగియైన వారి అనేక కథలను వారు ఉదహరింతురు. కాని భగవద్విలాసములు అనూహ్యము లగుటచే ఇది సత్ పదార్థమును కనుగొను ప్రయత్నమునకు ఆటంకముకాదు. కొందరు స్వంత ఆలోచనల వలన భ్రాంతిలో పడెదరు. కొందరు దివ్య

కృప వలన జ్ఞానవంతులగుదురు.

యోగ్యుడైన శిక్షకుడు ప్రాణాహుతి ద్వారా అభ్యాసి మనస్సునందలి అధోప్రవృత్తులను బలహీనపరచి అతని హృదయాంతరాళమందు దివ్యజ్యోతి బీజమును నాటును. ఈ విధానమున శిక్షకుడు తన ఇచ్ఛాశక్తిని ఉపయోగించును. అందులకు ఆయన ఆధీనములో అనంత దివ్యశక్తియున్నది. అతడు పరతత్వము యొక్క ఎరుక కలిగియుండును. అతడు సరిగా దానిని తన సత్‌సంకల్పమనెడు కటకము ద్వారా అభ్యాసి హృదయముపై కేంద్రీకరించును. ప్రారంభమున అభ్యాసి ఏమియు అనుభవింపక పోవచ్చును. అతడు ఇంద్రియముల ద్వారా అనుభవించుటకు అలవాటుడి ఉండుట దీనికి కారణము. అయినప్పటికీ కొంతకాలము తరువాత అతడు ప్రాణాహుతిశక్తి ఫలితములను అనుభూతి చెందును. ఆ ఫలిములు ప్రాణాధార అంగముల చర్యలలోను, చిత్తవృత్తులలోను సూక్ష్మమైనవై ఉండును.

ప్రాణాహుతి అను ఈ పురాతన విధానము ఈ దేశమున ప్రారంభించబడి మనపూర్వ మహర్షులచే విస్తారముగా ఉపయోగింపబడి పుట్టిన ఈ దేశమందే పూర్తిగా మరుగునపడిపోయినది. నేడు ఏ కొలదిమందియో తప్ప నమ్మువారు కూడ లేని దశకు వచ్చుట అత్యంత దుఃఖకరము. అది ఇందద్రాలమనియు, సమ్మోహనవిద్య అనియు కొందరు దుర్వ్యాఖ్యులు కావించి హేళన చేయజూతురు. ఇంద్రజాలము లేక సమ్మోహనవిద్య యొక్క ఫలితములు, ప్రాణాహుతి యొక్క ఫలితములు – పరస్పర విరుద్ధములు. ఈ క్షుద్రకళలయందు, సమ్మోహనశక్తిని ప్రయోగించువాడు భౌతికశక్తి సహాయమున తన ఇచ్ఛాశక్తిని ఉపయోగించును. సమ్మోహక శక్తికి గురియైన వ్యక్తి యొక్క సంకల్పము బలహీనమై, సమ్మోహన పారవశ్యమునుండి మేల్కొనగనే తనకు మాంద్యమును, హృదయభారమును యుండుట గ్రహించును. సమ్మోహనశక్తిని బట్టియు, దానికి గురియైన వ్యక్తి యొక్క దుర్భలత్వమును బట్టియు ఏదేని యొక వ్యాధిని పోగొట్టవచ్చును. లేదా అల్పమైన ఒక ప్రత్యేక చిత్తవృత్తిని కొంతవరకు అణచి పెట్టవచ్చును. కాని ఈ ఫలితము ఎంతోకాలము నిలువదు. భౌతిక వస్తువులను లేక మానసిక రూపములను ఏకాగ్రత వస్తువులుగా ఉపయోగించి తీవ్ర శారీరక మానసిక సాధనలచే సమ్మోహన శక్తి పెంపొందించబడును.

ఈ సాధనలు తరచు మనోవికారముగాని ఉన్మాదమునకు గాని దారితీయును. మరియు కొన్ని సమయములలో శారీరక వైకల్యములను కూడ కలిగించును. అయితే ఈ సాధన విజయవంతమైననాడు ఏదేని ఒక భౌతికశక్తిని కలిగింప చేయవచ్చును. అది పరిమితమైయుండి ఉన్నంతవరకు కొన్ని రకముల కోరికలను సంతృప్తి పరచుకొనుటకు మాత్రమే ఉపయోగకరము.

ఉన్నత స్థితులను పొందుటకు ఆధ్యాత్మిక శిక్షణ కేవలము ప్రాణాహుతి విధానముననే సాధ్యమనియు, వేరొక విధానము కాదనియు నేనిచట నొక్కి వక్కాణించుచున్నాను. నేటి సమాజములోని విద్యావంతుల ముందు ఈ విధానమును గూర్చి తరచు ప్రస్తావించినపుడు కొందరు మతబోధకులు ప్రాణాహుతి యందు ఏ విశేషములేదని ప్రజలకు చెప్పి ఈ విషయమున తమ శక్తిహీనతను సమర్థించుకొనుచున్నారు. సాధారణముగా ఒక మహాత్ముని సన్నిధినిగాని, మహర్షి సన్నిధినిగాని యున్నప్పుడు మనస్సును కలవరపరచు ఆలోచనలు కొంతవరకు తొలగిపోయి కొలదిసేపు ప్రశాంతత కలుగను. ఇది ఆ మహాత్ముని ప్రాణాహుతి ప్రభావమని వారు చెప్పుదురు. తమ ఆశక్తతను కప్పి పుచ్చుకొని ప్రజలను మోసపుచ్చు ఉద్దేశ్యముతో వారు ఈ వివరణమును ఒసగుచున్నారు. ఏది ప్రాణాహుతి అని వారు వివరింతురో అది ఆ మహాత్ముని నుండి తమంత తాముగా ప్రసారమగు పవిత్ర

పరమాణువులు. అవి అచట సమావేశమైన అందరినీ ప్రభావిత పరచును. తత్‌ఫలితముగా వారచట ఉన్నంతవరకు వారిలో కొంత ప్రశాంతత నెలకొనును. అది సహజానుభవమే. కాని ప్రాణాహుతి కానేరదు. అట్టి పరమాణువులు కేవలము మహాత్మునినుండి, మహర్షినుండి మాత్రమే ప్రసరించుటలేదు. ప్రతియొక్కని నుండియు అతడు పవిత్రుడు కాని, దుర్మార్గుడు కాని, సాధువుకాని, క్రూరుడుకాని అవి ప్రసరించును. కొంతకాలము అపవిత్రుడో, నైతిక పతితుడో అగువాని చెంతనున్నచో వాని నుండి అటువంటి అపవిత్ర పరమాణువులే ప్రసరించి మనలను ప్రభావితుల కావించును. తత్ఫలితముగా అప్పటికి మనస్సులోని ఆలోచనలను అదే ధోరణిలో సాగును. అట్టి ప్రసార ప్రభావము స్వల్పకాలము మాత్రమే యుండి ఆ వాతావరణము నుండి దూరమైన వెంటనే మాయమగును. ఇందు మూలముననే మత బోధకులు తరచు ప్రజలు బోధనలను అనుసరించుటలో నిర్లక్ష్యభావము చూపుచున్నారని నిందింతురు. ప్రజలు వారి ఉపదేశములను ఆలకించి వెళ్ళి దానిలో ఇసుమంతయు మనస్సునందుంచుకొనక తాము విన్నదంతయు అప్పటికప్పుడే వదిలి వేయుదురని చెప్పుదురు. ఇందుకు నిందింపవలసినది ఉపదేశకులనే గాని ప్రజలను కాదు, అని నా భావము. ఏలయన తాను వేదికపై నుండి బోధించవలసినది వారి హృదయములలో ప్రతిపాదించుటకు వలయు శక్తి సామర్థ్యములు అతనిలోలేవు. కాని ప్రాణాహుతిశక్తి అత్యున్నతస్థితికి చెందిన యోగసిద్ధి. దీనిచే యోగి తన ఇచ్ఛాశక్తితో ఎవనియందైననూ యోగశక్తినీ, దివ్యతేజస్సును ప్రసరింపజేయవచ్చును. అది అతనియందు ఆధ్యాత్మిక పురోగతికి అవరోధముగాను, హానికరముగాను ఉన్నదేనినైనను తొలగింపగలదు. అతడు తన చుట్టు సమావేశమై యున్నవారి మీదనే గాక దూరముగానున్న వారిమీదకూడ ఆ శక్తిని తన ఇష్టము వచ్చినట్లు, ఎప్పుడైనను ఉపయోగించగలడు. ఈ శక్తిని స్వాధీనపరచుకొన్నవారు చూపుమాత్రమున అభ్యాసి తాను జీవితకాలమంతయు వెచ్చించికాని పొందలేనట్టి మానసికస్థితిని ప్రస్తుత స్థితికంటె మిక్కిలి ఉన్నతమైన దానిని తాత్కాలికముగగాని, శాశ్వతముగగాని కల్గింపగలరు. ఇది వట్టిమాట కాదు. సత్యవచనము. ఎవరేని కోరినచో ఎప్పుడైననూ ప్రత్యేకముగా పరీక్షించి చూడవచ్చును. ప్రాణాహుతి శక్తితో మహర్షులు పలుమార్లు కేవలము చూపుమాత్రమున మానవుని స్వభావమునే మార్చి వేసినారు. మా గురుదేవులును, స్వామి వివేకానందుడును మరికొందరు అట్టి మహాత్ముల దృష్టాంతములును దానికి నిదర్శనములు.

నేను అనేక సంస్థల అధిపతులను కలిసికొంటిని; నా ఆశ్చర్యమును పెంపొందించునట్లు ప్రతిచోటను ప్రాణాహుతి శక్తి విచారకరముగా లోపించి వారిలో ఎందరికో అది పూర్తిగా దూరమైనది. స్వామి వివేకానందులకు నిస్సంశయముగా ఆశక్తి కలదు. కాని అట్టి మహాపురుషులు ఎల్లప్పుడును అరుదు. పరమ పూజ్యులైన మా గురుదేవులవంటి మహాపురుషులు లోకమున కారణము లేకుండ జన్మింపరు.

యదార్థమునకు మనమందరమును చేతిలో భిక్షాపాత్ర ధరించి భిక్షకులవలె గురు మందిర ద్వారమున వేచియున్నట్టి వారము. ఆ పాత్రను గురువు వెంటనే నింపుదురు కాని ఆ పాత్ర ఆధ్యాత్మికత కాక యితర విషయములతో అప్పటికే నిండియున్నచో గురువు నుండి ఏదైనను పొందు అవకాశమేమియు లేదు. అట్లు ఏదైననూ నింపినచో తక్షణము అది బయటకు ప్రవహించును. అందువలన ఆ పాత్రను గురుకృపతో నింపవలెనన్నచో మనము మనలను ఖాళీగాచేసి ఉంచుకొనుటయే ప్రధాన విషయము.

## సప్తమ అధ్యాయము

# సాక్షాత్కార మార్గమందలి దశలు

---

చేరుకొనవలసిన అత్యున్నత బిందువు, లేక జీవితపు అంతిమగమ్యము సంపూర్ణ అభావస్థితి, శూన్యస్థితి, దానిని నేను పటమునందు సూచించుటకు ప్రయత్నించితిని.

కేంద్రముచుట్టును రచింపబడిన ఏకకేంద్ర వృత్తములు రమారమి మన పురోగమనమునందు దాటునట్టి వివిధ అధ్యాత్మిక స్థితులను తెలుపుము. అత్యంత బాహ్య వృత్తము నుండి మన పయనము ఆరంభించి తదనంతరదశ ప్రాప్తించుటకు ప్రతి వృత్తమును దాటుచు కేంద్రమువైపు పోవుదుము. ఇది అత్యంత విస్తారమైనది.

జీవకేంద్రమైన హృదయముమీద ధ్యానము చేయుచు గమ్యము పొందువరకును దానితో పురోగమింతుము. మనమార్గమున ఈ హృదయమండలమునందు ఐదు బిందువులు, లేక ఉపకేంద్రములు కలవు. ప్రతిబిందువు యొద్దను ఈ క్రింది నాలుగు స్థితులను అనుభవింతుము. ఈ వరుసక్రమమున,

1) దివ్యశక్తి అంతటనూ వ్యాపించియున్నది అను ఎరుక మనస్సునందు నిరంతరము జాగరూకమైయుండు విచిత్రస్థితి అంతటను ఉండును.

2) అంతటను దివ్యశక్తి వ్యాపించి ఉండి దాని స్మృతిలో లీనమై ఉండుట.

3) దివ్యశక్తి యొక్క అనుభూతిగాని, స్మృతిగాని, ఏదియును లేకుండా శూన్యస్థితి యొక్క అనుభూతి మాత్రమే ఉండును.

4) అన్నియు పోయెను. హృదయముపై ఏ గుర్తును లేదు. ఉనికిని గూర్చి గుర్తుయును లేదు.

ఈ నాలుగుస్థితులు ప్రతిమండలమందును, ప్రతి బిందువు వద్దను అనుభవింపబడును. సహజమార్గ ఆధ్యాత్మిక శిక్షణ పద్ధతియందు ప్రతివారును వాటిని అనుభవింతురు. బహుశ అధిక గ్రహణశక్తి గలవారు మాత్రమే ఆ స్థితులన్నిటినీ వాటి అతిసూక్ష్మ వివరణములతో అనుభూతి గాంచగలరు. మిక్కిలి క్రిందుగానున్న బిందువుల నుండి పైనగల ఉపకేంద్రముల ద్వారా అత్యున్నత బిందువువద్దకు పోవుకొలదిని క్రమముగా అవి సూక్ష్మతరములగుచుండును.

మనము అయిదవ బిందువు దాటిన వెంటనే ఆజ్ఞచక్రము వైపునకు మన ప్రయాణము సూటిగా అగును. ఈ బిందువువద్ద స్థితి విచిత్రముగ ఉండును. ఈ బిందువునుండి మనము వినియోగించు శక్తి క్రింది మండలములకు మరలింపబడును. ఈ బిందువు కడకు మనము పయనించునపుడు అనుభవమునకు వచ్చు ప్రధాన స్థితి నీడవలెనున్న చీకటి వంటిది. తుదకు మనము జ్యోతిని అతిక్రమించి పురోగమింపవలెననుటకు సూచన మాత్రమే. దాని నిజస్వభావము వెలుగును, చీకటియుగాక అరుణోదయ వర్ణము వంటిదై యుండును.

హృదయ మండలముయొక్క అయిదవ వృత్తము దాటి మనోమండలమున ప్రవేశింతుము. ఈ మండలమున నున్న పదునొకండు వృత్తములు అహంకారపు వివిధ దశలను తెలియజేయును. వాటిగుండా పురోగమించుకొలది స్థితి సూక్ష్మతరము, నిర్మలము అగును. ఇచ్చట ప్రతివృత్తమునందును అసంఖ్యాకములగు బిందువులు మరియు గ్రంథులును కలవు. ఈ ఆశ్చర్యకరమగు ప్రాణాహుతి యోగపద్ధతివలన తప్ప సామాన్యముగా ఒక బిందువునుండి ఆ తరువాత బిందువునకు పయనించుటకు ఒక సంపూర్ణ జీవితకాలము కావలసియుండును.

పదునారవ వృత్తమును చేరుకొనుసరికి మనము అహంకారమునుండి రమారమి విముక్తులము అగుదుము. మహర్షులలో మహోన్నతులగు వారియందుకూడ యాస్థితిని అందుకున్నవారు అరుదు. నా దృష్టికి గోచరించునంత వరకు ఈ దశవరకు (పదునారవ వృత్తము) పురోగమించగలిగిన వారు, కబీరు, మానవసాధ్యపరిమితులకు మిక్కిలి అతీత స్థితులను పొందిన నా సమర్థగురుదేవులు తప్ప మరెవ్వరును కానరారు. యా వృత్తము తరువాత మిగిలియున్నది ఇంకనూ స్థూలరూపమున ఉన్న స్వత్వము మాత్రమే.

యీ బిందువును చేరుటకు ముందు మనము సహస్రదళ కమలమందలి విరాట్ మండలముద్వారా పయనింతుము. మహా భారతయుద్ధ సమయమున అర్జునుని దృష్టికి గోచరించిన విరాట్ రూపము ఈ మండలమునుండియే కనబరచబడినది. ఇదియే సకల విశ్వము. మనము దేనిని బ్రహ్మగతి, లేక దివ్యస్థితి అనవచ్చునో అట్టిమార్పులేని స్థితిని ఇచ్చటనే కొంతవరకు అనుభవింతుము. ఈ పురోగమనమున ఆయా విశిష్టదశలు గల వివిధ కేంద్రములద్వారా మనము అదిగమింతుము.

కేంద్రమండలము నందలి ఏడు కాంతి వృత్తములను (చక్రములను) దాటిన పిమ్మట విశాలము, అపరిమితముఅయిన అనంత తత్వమున ప్రవేశించి అందు యీదులాడుట ప్రారంభింతుము. ఇచట గురుసహాయము ఇంకనూ ఆవశ్యకము. ఏలయన ఎక్కువ శ్రమపడి ఈదుటయందు, ఈ ఈదెడు వ్యక్తియొక్క సూక్ష్మాతిసూక్ష్మమగు శక్తికూడ అతని పురోగమనమునకు ప్రతిబంధకములగు శక్తి తరంగములను సృష్టించును. ఏ రకమయిన ఈత విరుద్ధ తరంగములను సృష్టింపదో, ఏది ఇంచుమించు తేలియాడునటువంటిదైననూ తేలియాడుటకాదో అట్టి అనాయాసముగా ఈదుట అను కళను ఈతగానికి నేర్పుటయందును, ఆ తరంగములను ఉపశమింపజేయుట యందును, అనుభవశాలి, సమర్థుడు, జాగరూకుడు అయిన గురువు మాత్రమే సహాయపడగలడు. అనాయాసముగా ఈదుటయందు స్థితియందు అనందభావము ప్రగతిని ఆటంకపరచును. ఈతగానిని ఆ ఆనందములోనికి జారిపోకుండా రక్షించి, పురోగమన మార్గమునకు కొనిపోవుటకు అట్టి గురువే సాయపడును.

ఇప్పుడు మనము నిద్రణమైయున్న కేంద్రము యొక్క పరిధిని చేరుదుము. అదియును ఒక చక్రము వంటి దానిచే ఆ వృత్తమైయున్నట్లు అగుపించును. ఇదియే చిట్టచివరిది. అది యెట్టిదో ప్రయోగాత్మకముగ పరిశీలించుటకును, వ్యక్తపరచుటకును నేనొక పర్యాయము ప్రవేశింప యత్నించితిని. క్షణము మాత్రమే దానిలోనికి తొంగిచూడగలిగితిని. కాని (ఇంతలో) ఆకస్మికము, ప్రబలము అయిన ఒకశక్తి నన్ను వెనుకకు విసిరి వైచినది. మానవ ప్రయత్నముచే చేరగలుగు చిట్టచివరి అవధి బహుశ ఇదియేనని ఈ అనుభవముద్వారా నిర్ణయించు కొంటిని. ప్రతియొక్కరును అంతవరకు చేరుకొనవలెననియు వీలైనచో దానిని అదిగమించవలెననియు నా కోరిక. నేనిదివరలో అన్నట్లు స్థూలమైన స్వత్వము యొక్క రూపము చిట్టచివరి అవధివరకును క్రమేణ సరళము సూక్ష్మతరము అగుట వచ్చినది. మనమిపుడు కేంద్రమునకు అత్యంత సమీపముననున్న స్థితిని సాధించుకొంటిమి.

అదియే మానవసాధ్యమగు మహోన్నతస్థితి. ఇచ్చట మనము అత్యంత యదార్థమగు స్థితితో చక్కని సమన్వయము కలిగియుందుము. మానవుడు అంతిస్థితి, లేక పరిపూర్ణస్థితిలోనున్న భగవంతుడు అయిన "భూమ"తో సన్నిహిత సంబంధము కలిగినప్పుడు తానెవ్వడో, ఎచటనున్నాడో అనునవి అతని ఊహకు అందవు. ఆత్మకును, భగవంతునకును మధ్య నామమాత్రమైన భేదమును నిర్వహింపవలసియున్నది. కావున కేంద్రము లేదా సర్వశక్తియందు సంపూర్ణముగా లీనమగుట సంభవము కాదు.

మానవుడు సాధింపదగుదాని పరాకాష్ఠ ఇదియే. కనుక ఆత్మ సాక్షాత్కారమార్గమున అత్యంతోన్నత ప్రగతి సాధించగోరునతడు ప్రారంభమునుండియు దానిపై దృష్టి నిలుపవలెను. మహర్షులయందును, యోగులయందును, చాలాకొలది మందికి మాత్రమే దానిని గూర్చిన భావన వుండివుండవచ్చును. చాలామంది విషయమున వారు చేరగలిగిన పరమావధి రెండవ లేక మూడవ వృత్తమువరకు మాత్రమే. ఇంత ప్రాథమికదశ యందుండికూడా వారు కొన్ని యెడల తాము సాధించినది చాలా గొప్పదని భావించుట దురదృష్టకరము. బ్రహ్మవిద్యావిశారదులని చెప్పబడుచు, బాహ్యస్వరూపమును, వాచ్చాతుర్యమును చూచిమోసపోవు అమాయక ప్రజలచే పరిపూర్ణత్వము పొందిన వారుగా పరిగణింపబడుచున్న కొందరి తత్వమును చక్కగ నిర్ణయించుటకు వీలుగా నేనిది యంతయు చెప్పితిని.